# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 3, మార్చి 2026

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 3


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు


ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| పరాభవ ఉగాదీ – స్వాగతం సుస్వాగతం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| పరాభవ నామ ఉగాది | 22 |
| మార్గదర్శకులు – మహర్షులు (సీరియల్) | 25 |
| ముక్తికి సోపానం – శ్రీరామ నామం | 29 |
| శ్రీ సీతారాముల కళ్యాణ అక్షతలు | 32 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| మీ ప్రశ్న మా సమాధానం | 39 |
| జయదేవుని 'గీత గోవిందము' | 40 |
| నవవిధ భక్తిమార్గాలు | 46 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 49 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 55 |
| ప్రణవ తత్త్వమే సీతారాములక్షణులు | 60 |
| వాల్మీకి మహర్షి | 61 |
| సంబరాల కేళి – రంగు రంగుల హోళీ | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# రాబోవు హరినామక్షేత్ర నిర్మాణంలో భక్తులకు స్వాగతం

శ్రీవేంకటేశం పాఠకులకు శ్రీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృప వల్ల మన చిరకాల కోరికలు నెరవేరగలవని మరియు సుఖశాంతులతో జీవించగలమని ఆశిస్తున్నాము. స్వామికృప ఈ సంవత్సరం మనందరిపై మరింత ఎక్కువగా ప్రసరించగలదని కూడా ఆశిస్తున్నాము. ఈ పరాభవ నామ ఉగాదితో మన "శ్రీవేంకటేశం" మాసపత్రిక 20 సంవత్సరములు పూర్తి చేసుకుని 21 వ సంవత్సరంలోనికి అడుగిడుతున్న సందర్భంగా, ఈ సేవను ప్రసాదించిన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి, ఆదరించిన వారి భక్తులకు, కోటి కోటి ప్రణామాలను అర్పిస్తున్నాము.

భగవంతుని ప్రతి లీల అర్థం, పరమార్థం కలిగి ఉంటుంది. కాని మానవ మాత్రులమై, క్షణిక సుఖాలకు అలవాటు పడ్డ మనం స్వామి లీలలలోని రహస్యమును అర్థం చేసుకోలేము. 2002 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్వామి కృపతో స్థాపించి, స్వామివారికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ అనే కార్యక్రమమును ప్రారంభించాము. ఆ తరువాత 2004 సంవత్సరంలో "నమో వేంకటేశాయ" అనే రథమును తయారు చేసి ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుండి తిరుపతి వరకు 25 రోజుల రథయాత్రను స్వామి కృపతో ప్రవేశపెట్టాము. ఇక 2003 సంవత్సరంలోనే స్వామివారు ఈ మాసపత్రికను మొదలుపెట్టమని చెప్పినప్పటికీ, ఈ పత్రికపై ఆసక్తి లేక రథాన్ని తయారు చేస్తున్నాము, తరువాత అనే సాకుతో పొడిగించాము. రథం సిద్ధమైన తరువాత కూడా ఆసక్తి లేక మరో 3 సంవత్సరాలు పొడిగించాము.

నిజానికి ఈ పత్రిక వల్ల కలిగే లాభాన్ని ఆ సమయాన గుర్తించలేదు. చివరికి స్వామివారి పట్టుదల వలన 2007 సంవత్సరం ఉగాది రోజున "నమో వేంకటేశాయ" అనే పేరుతో ప్రారంభించాము. ఆ తరువాత జనవరి 2008 నుండి "శ్రీవేంకటేశం" అనే పేరు మార్చి ప్రచురిస్తున్నాము. ఇలా స్వామివారి మాటను కాదని 4 సంవత్సరములు పొడిగించినందులకు చింతిస్తూ క్షమించమని వేడుకుంటున్నాము. ఈ రోజు ఈ పత్రిక ప్రభావం ఎంతుందో, ఎందుకు నాచే ఈ పత్రికను ప్రారంభింపచేశారో అర్థం అయింది. ముఖ్యంగా స్వామి సంకల్పం నెరవేర్చటానికి ఈ పత్రిక ఎంతో ఉపయోగపడుతుంది. హరినామ క్షేత్ర ఏర్పాటుకు తగిన యోగ్యత సాధించుటకు స్వామివారి అనుభూతుల ప్రచురణ ఎంతో ముఖ్యమైంది. "తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం" అనే పేరుతో గత 36 నెలల నుండి స్వామివారి అనుభూతులను ప్రచురిస్తూ భక్తుల సన్నిధికి ఈ పత్రిక ద్వారా చేరుస్తున్నాము. మరియు భాగవత ఆశీర్వాదములను పొందగలుగుచున్నాము. వీటిద్వారా స్వామివారి విశేష కృపను భక్తులు తెలుసుకుంటున్నారు. రాబోయే హరినామ క్షేత్ర మహిమతో పాటు అందులో పాలు పంచుకొనే అవకాశం భక్తులకు లభిస్తుంది. ఈనాటి కలియుగములో కూడా స్వామివారి విశేష కృపను తెలుసుకుంటూ ఎంతోమంది భక్తులు తన్మయులౌతున్నారు. భగవంతుడు ఎప్పటికీ భక్తప్రియుడు. భక్తుల ఉద్ధరణే ఆయన ఏకైక లక్ష్యం. మరో తిరుపతి లాగా చిన్నగుండవెల్లిలో వారి హరినామక్షేత్రం ఏర్పాటు చేసి నేటి తరముతో పాటు తరతరాల భక్తులను అనుగ్రహించుటకు మాచే ఈ శ్రీవేంకటేశం మాసపత్రికను ప్రారంభింపచేశారు. ఈ శ్రీ పరాభవ నామ సంవత్సరంలో, వచ్చే కొద్ది నెలలలో స్వామి కృపతో ఈ ఆలయానికి శంకు స్థాపన చేయగలమని ఆశిస్తున్నాము. ఈ క్షేత్రం ఒక దివ్యదేశం లాగా వెలుగొందగలదని, భక్తులు వారి కోరికలను సులభంగా తీర్చుకోగలరని చెప్పారు. మరియు పాఠకులందరినీ ఈ మరో తిరుపతిలో భాగస్వాములు కమ్మని సలహా కూడా ఇచ్చారు. పూర్వం రామసేతును నిర్మించినప్పుడు తన చిన్నపాటి సహాయానికి ఉడతను ఆశీర్వదించినట్లు తప్పక మనలను ఆశీర్వదించగలరని నమ్ముచున్నాము. ఈ అవకాశం ఎన్నో జన్మల పుణ్యఫలం వల్ల మాత్రమే లభిస్తుంది.

నమో వేంకటేశాయ

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ______________________

______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________


______________________


పిన్‌కోడ్: ______________________

చందా వివరాలు: ______________________


మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com


**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**





# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో ॥ సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్**
**సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్**

తాత్పర్యం – పాదముల నుండి శిరస్సు వరకు గల శరీర భాగముల అన్నింటి సౌందర్య సంపద చేత ప్రాణులందరికీ ఎల్లప్పుడు మోహమును కలిగించువాడగు వేంకటాచలపతికి మంగళమగు గాక!

**శ్లో ॥ నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే**
**సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్**

తాత్పర్యం – శాశ్వతమైనవాడు, దోషరహితుడు, సత్యమైనవాడు, ఆనందస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, సర్వప్రాణులందు అంతరాత్మగా ఉండువాడు అగు శ్రీనివాసునకు మంగళమగు గాక!

**శ్లో ॥ స్వత స్సర్వవిదే సర్వశక్తయే సర్వశేషిణే**
**సులభాయ సుశీలాయ వేంకటేశాయ మంగళమ్**

తాత్పర్యం – సహజంగా (ఇతర దేవతల వరముల వలన గాక) సమస్తమైన జ్ఞానమును, శక్తిని కలిగియుండి, అందరూ తనకు శేషవస్తువుగా కలవాడు, సులభముగా అనుగ్రహించువాడు, అందరి యెడ మంచి నడత గలవాడు అగు వేంకటేశ్వరునికి శుభములు కలుగు గాక!



# ముక్తిమార్గము


భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య




## శ్రీరాగం

కాకున్న సంసార గతులేల?
లోక కంటకములగు – లోభంబు లేల? ||పల్లవి||

1. వినికి గన వలసినను – విష్ణుకీర్తన చెవికి
వినికి చేసిన నదియె – వేదాంతబోధ,
మనికి గనవలసినను – మధురవైరిపై భక్తి
యునికి ప్రాణులకు బ్ర – హ్మోపదేశంబు ||కాకున్న||

2. చదువు గనవలసినను – శౌరినామము దిరుగఁ
జదువుటే సకల శా – స్త్రముల సమ్మతము,
నిదుర గనవలసినను – నీరజాక్షునికిఁ దన
హృదయ మర్పణ సేయు – టిది యోగ నిదుర
||కాకున్న||

3. ఆసవలసిన వేంక – టాధీశ్వరుని కృపకు
నాస సేయుటె పర – మానంద సుఖము,
వాసి గనవలసినను – వైష్ణవాగారంబు
వాసిసేయుట దనకు – వైభవస్ఫురణ ||కాకున్న||

**భావము:**

ఈ చెప్పబోవు కార్యములు చేయకపోయినప్పుడు సంసారములో ప్రవర్తించుటకెందుకు? లోకమున కుపద్రవకరములైన లోభములచే ప్రయోజనమేమి?

ఏదేని వినవలెనని కోరిక గలిగినచో విష్ణుకీర్తనమును వీనులవిందుగా వినవలెను. అదియే వేదాంతబోధ శ్రవణమై శ్రేయ మొనగూర్చును. అట్లు గాక లౌకిక గాథలెన్ని విన్నను ప్రయోజనము సున్న. ప్రయోజనకరమైన బ్రదుకు బ్రదుకవలెనని తలంపు గల్గినచో మాధవునిపై భక్తి గలిగి యుండవలెను. ఆ భక్తియే జీవులకు బ్రహ్మోపదేశమై ముక్తి కలిగించును. భగవదితరములైన పదార్థములపై భ్రాంతిపడి జీవించువాని జీవితము నిజమైన జీవితము కాదు.

చదువవలెనని వాంఛ యున్నచో శ్రీహరి నామమును మాటి మాటికీ నోరార చదువ (జపించ) వలెను. అట్లొనర్చుటే సకల శాస్త్ర సమ్మతమైన చదువై విద్యాఫలమైన అమృతత్వమును సిద్ధింపచేయును. 'విద్యయాఽమృత మశ్నుతే' అని మనువు. నిద్రింపవలెనని భావన కలిగినచో హృదయమును ఇతర వస్తువుల నుండి తొలగించి పద్మనేత్రునకు సమర్పింపవలెను. అట్లు చేయుట యోగనిద్ర యనబడును. అట్లు కానిది తమోగుణము పైకొనుటచే గల్గు మోహనిద్రయే యగును.

ఆశ పడవలసినచో కృపానిధియైన శ్రీవేంకటేశ్వరుని దయ కాసపడుటే యుక్తము. దానిచే పరమానంద సుఖము కలుగును. తదితరములపై పెంచుకొన్న ఆశ జీవుని బద్ధుని చేయును. లోకములో ప్రతిష్ఠ నొందవలెనని తలంపు గల్గినచో విష్ణ్వాలయమును ప్రతిష్ఠించి ప్రతిష్ఠ నొందవలెను. అది తన వైభవమును స్ఫురింపచేసి మేలు చేకూర్చును. ఇతర నిర్మాణములచే గలుగు పేరు ప్రతిష్ఠలు శాశ్వత సుఖము నొసంగ జాలవు.



# పరాభవ ఉగాదీ
## స్వాగతం – సుస్వాగతం

–చిల్లర సీతారామారావు

మనకు సంవత్సరములు అరవై. ప్రభవ నుండి క్షయ వరకు గల అరవై సంవత్సరాలలో 40వ సంవత్సరం పరాభవ.

శ్రీకృష్ణభగవానుడు 'ఋతూనాం కుసుమాకరః' అనగా ఋతువులలో ఉత్తమమైన వసంత ఋతువును నేనే అని చెప్పాడు. వసంత ఋతువులో ప్రకృతి అందంగా, ఆహ్లాదంగా ఉంటుంది. తరుశాఖలు చిగుర్లు వేస్తుంటాయి. సర్వత్రా పక్షుల కిలకిలా రావాలు మారుమ్రోగుతూ ఉంటాయి. కోకిలలు మామిడి చిగుళ్ళను ఆస్వాదించి పంచమ స్వరమును ఆలపిస్తూ ఉంటాయి. ఆ కోలాహలాల మధ్య ఉగాది వస్తుంది. తర తరాల తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది. ఉగాదిని దైవస్వరూపముగా భావించి ఆరాధించే పండుగ.

శ్లో ॥ "చైత్రమాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేహని
శుక్లపక్షే సమగ్రంత తథా సూర్యోదయేసతి"

సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు చైత్రశుక్ల పక్ష ప్రథమ దినాన, సూర్యోదయ వేళ ఈ జగత్తును సృష్టించాడు అని హేమాద్రి పండితుడు తన చతుర్వర్గ చింతామణిలో పేర్కొన్నాడని పై శ్లోకం ద్వారా తెలియుచున్నది. ఉగాదితో చాంద్రమానాన్ని పాటించే తెలుగువారికి నూతన సంవత్సరాది ప్రారంభమవుతుంది.

బ్రహ్మ సృష్టికి ఆరంభ దినంగా ఉగాదికి పర్వదిన ప్రాశస్త్యం కలిగింది. ఉగాది అనేది 'యుగాది' అను శబ్దమునకు వికృతి. యుగమునకు ఆది గావున యుగాది. ఉగాది పండుగ రాగానే కుటుంబాలలో నూతనోత్సాహం ఉరకలు వేస్తూ ఉంటుంది. ఆనందంగా గడుపుకోవటానికి ప్రణాళికలు వేసుకుంటూ ఉంటారు. ఆ రోజు ఎలా గడిచిపోతుందో అలాగే సంవత్సరమంతా గడిచిపోతుందని ప్రగాఢ విశ్వాసం. ఉగాదినాడు పది విధములైన ధర్మములను ఆచరించవలెనని ఉత్సవ చంద్రిక లోని ఈ శ్లోకం ద్వారా తెలియచున్నది.

శ్లో ॥ "ప్రాప్తే నూతన వత్సరే ప్రతిగృహే కుర్యాద్ధ్వజారోహణమ్
స్నానం మంగళ మాచరే ద్ద్విజవరై స్సార్ధం సుపూజోత్సవమ్
దేవానాం గురు యోషితాంచ శిశఽలంకార వస్త్రాధిభిః
సంపూజ్యో గణకః ఫలంచ శ్రుణు భూత్తస్మాచ్చలాభ ప్రదమ్"

నూతన సంవత్సరంలో ధ్వజారోహణము, తైలాభ్యంగన స్నానము, బ్రహ్మ పూజనము, నవ వస్త్ర ధారణము, మహాశాంతి, నింబ కుసుమ భక్షణము, పంచాంగ పూజ, పంచాంగ శ్రవణము, ప్రపాదాన ప్రారంభము, రాజదర్శనము మున్నగు

ఆచారాలను పాటించాలని శాస్త్రోక్తి. పూర్వకాలమున నూతన సంవత్సరాదినాడు ధ్వజారోహణము చేసెడివారు. ఆ రోజు బ్రహ్మ ధ్వజమును గాని, ఇంద్ర ధ్వజమును గాని పూజించాలి అని వ్రత గ్రంథములలో చెప్పబడింది. ఆ ఆచారము క్రమేపీ కాల మరుగున పడిపోయింది.

ఉగాది పండుగ రోజున వేకువ జాముననే లేవాలి. ఇంటిముందు గోమయమును కలిపిన నీళ్ళను చల్లాలి. ముగ్గులు పెట్టాలి. వాకిళ్ళను మామిడి ఆకుల తోరణములతో అలంకరించుకోవాలి. ఇంటిముందు ఒక కర్రను పాతాలి. దానికి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టాలి. తర్వాత హారతిని ఇవ్వాలి. ఈ కర్రను బ్రహ్మ ధ్వజము అని అంటారు. ఈ కర్రను ఏర్పాటు చేయడం ద్వారా వివిధ దేవతలను మన గృహములకు ఆహ్వానించుటకే అని శాస్త్ర వచనము. తర్వాత స్నానము చేయాలి. స్నానం చేసేముందు ఇంటి పెద్దవారితో తలపై నువ్వులనూనె పట్టించుకోవాలి. శరీరమునకు కూడా నూనెను రాసుకోవాలి. పెద్దల ఆశీస్సులను తీసుకుని కుంకుడుకాయల రసముతో తలను రుద్దుకోవాలి. నలుగుపిండితో శరీరమును రుద్దుకుని స్నానం చేయాలి. స్నానము చేయునపుడు ఈ క్రింది శ్లోకమును చదువుతూ స్నానము చేయాలి.

**శ్లో ॥ "గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి**
**నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"**

ఆ విధముగా స్నానము చేయుట వలన దారిద్ర్య పీడ తొలగిపోతుందని నమ్మకం. ఎవరైతే తలంటి స్నానము చేయరో, వారికి మరణానంతరం నరకలోక ప్రాప్తి కలుగుతుందని వశిష్ఠోక్తి. స్నానానంతరము నుదుట తిలకమును ధరించి, నూతన వస్త్రములను ధరించాలి. సూర్యభగవానునికి పుష్పార్చన, అర్ఘ్యము, ధూప దీపాలను సమర్పించాలి. బ్రహ్మను ఆరాధించాలి. ఆయనను పూజించితే సకల శుభాలు కలుగుతాయి. ఆ రోజు మహా శాంతిని జరిపించాలి. దాని వలన సమస్త దుఃఖాలు తొలగిపోతాయి.

ఉగాది అని పండగ పేరు చెప్పగానే మొదట గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడి. ఈ పచ్చడిని ఆరు వస్తువులను ఉపయోగించి చేస్తారు. అందుకే దీనిని షడ్రుచుల సమ్మేళనం అని చెబుతారు. వేపపూత, మిరియాలపొడి, మామిడిముక్కలు, క్రొత్త చింతపండు పులుసు, ఉప్పు, క్రొత్తబెల్లం – ఈ ఆరింటినీ కలిపి పచ్చడిని తయారు చేస్తారు. ఇవి క్రమంగా చేదు, కారం, వగరు, ఉప్పదనం, తీపిదనం, పులుపు అను షడ్రుచులతో కూడుకున్న ఉగాది పచ్చడిని స్వీకరించడం వల్ల సంవత్సరమంతా అన్ని రకాలైన ఆటుపోటులను ఎదుర్కొనే ధైర్య సాహసాలు కలుగుతాయి. ఋతుమార్పిడి వల్ల శరీరములో కలిగే మార్పులు, అనారోగ్యాలు కలగకుండా కాపాడే శక్తిని కలిగిస్తాయి. ఉగాది పచ్చడిని సేవించునపుడు ఈ క్రింది శ్లోకమును పఠించాలి.

**శ్లో ॥ త్వా మష్ట శోక నరాభీష్ట మధుమాస సముద్భవ**
**నచామశోక సంతప్తాం మా మశోకం సదా కురు**

ఉగాది పచ్చడిలో కలిపే పదార్థములన్నీ ఔషధ గుణములు కలిగి ఉన్నవే. పచ్చడిలో తియ్యదనము కోసం బెల్లమును కలుపుతారు. బెల్లము ఆకలిని అధికము చేస్తుంది. శరీరమునకు కావలసిన పిండి పదార్థములను అందిస్తుంది. వాత పిత్తములను అదుపులో ఉంచుతుంది. పులుపు కోసం క్రొత్త చింతపండును కలుపుతారు. క్రొత్త చింతపండు వాతములను పోగొడుతుంది. ఆహారం జీర్ణమవుతుంది. మలబద్ధకమును నివారిస్తుంది. పులుపును వాడకపోతే జీర్ణక్రియ దెబ్బతింటుంది. పులుపును మితముగానే స్వీకరించాలి. కారమును ఉపయోగించడము వలన, ఇది శరీరములో వేడిని పుట్టిస్తుంది. శరీరములోని క్రిములను నాశనము గావిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. కారమును అధికముగా తీసుకొనడం వలన కడుపులో మంట లాగా వస్తుంది. పిత్త సంబంధిత వ్యాధులు రావడానికి అవకాశం ఉన్నది. ఉప్పును రుచి కోసం కలుపుతారు. ఉప్పు వలన ఎముకలకు బలం చేకూరుతుంది. శరీరమునకు కావలసిన ఖనిజమును, లవణమును ఉప్పు అందిస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. ఉప్పును మితంగానే తీసుకోవాలి. అధికంగా తీసుకుంటే మూత్రపిండాలకు నష్టం కలుగుతుంది. కీళ్ళ వాతము, గ్యాస్ట్రిక్ మున్నగు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. చేదు ఆరోగ్యానికి మంచిది. దీనికోసం వేపపూతను వాడతారు. వేపపూత వల్ల శరీరములోని క్రిములు నశించిపోతాయి. రోగనిరోధక శక్తిని పెంపొందింప చేస్తుంది. రక్తమును శుద్ధి చేస్తుంది. వగరు రుచికోసం మామిడి ముక్కలను వాడుతారు. మామిడిముక్కలు లాలాజలము ఊరేలా చేస్తాయి. జీర్ణక్రియ సవ్యంగా జరిగేలా చేస్తాయి. శరీరం దృఢంగా ఉండటానికి, ఘాతముల ఉపశమనానికి ఇవి ఎంతగానో సహకరిస్తాయి. కారము కొరకు మిరియాలను ఉపయోగిస్తారు. మిరియాల వలన కఫము, శ్లేష్మములు తగ్గిపోతాయి. ఉగాది పండుగనాడు నిరాహారముగా నుండి షడ్రుచులు కలిసిన ఉగాది పచ్చడిని సేవించితే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

ఉగాది నాడు ఆచరించాల్సిన మరో ప్రధానమైన విధి పంచాంగ శ్రవణం. ‘‘తిథి ర్వారంచ నక్షత్ర యోగః కరణమేవచ పంచాంగమ్’’ అన్నారు. బ్రహ్మ తూర్పుముఖం నుండి తిథి, దక్షిణ ముఖం నుండి వారం, పశ్చిమ ముఖం నుండి నక్షత్రం, ఉత్తర ముఖం నుండి యోగం, ఊర్ధ్వముఖం నుండి కరణం ఉద్భవించాయని, వాటి కలయికే పంచాంగం అని పెద్దల ఉవాచ. ఈ అయిదు అంగాల నుండి కలిగే ఫలితాలను ఈ క్రింది శ్లోకం వెల్లడిస్తోంది.

**శ్లో ॥ "తిథేశ్చ శ్రియమాపోన్నతి వారాదాయుష్య వర్ధనమ్**
**నక్షత్రాత్హరతే పాపం యోగా ద్రోగ నివారణమ్**

**కరణాత్కార్య సిద్ధిస్తు పంచాంగ ఫలముత్తమమ్**
**కాల విత్కర్మ కృద్ధీమాన్ దేవతానుగ్రహం లభేత్"**

తిథి వల్ల శ్రేయస్సు, ధనము, వారం వల్ల ఆయుష్షు పెరుగుతాయి. నక్షత్రం వల్ల పాపాలన్నీ తొలగిపోతాయి. యోగం వల్ల సమస్త రోగాలు సమసిపోతాయి. కరణం వల్ల కార్యసిద్ధి కలుగుతుందని శ్లోక భావము. దేవాలయాల్లో గాని, ఆరుబయట గాని ఉగాది నాటి సాయంత్రం పంచాంగ శ్రవణం జరుగుతుంది. పంచాంగ శ్రవణం గావించిన వారికి గంగాస్నాన ఫలితం దక్కుతుంది. సమస్త సంపదలను, మంగళములను కలిగిస్తుంది. శత్రువులను దూరంగా తరిమేస్తుంది. గోవులను దానం చేస్తే, ఎంతటి పుణ్యం లభిస్తుందో అంతటి పుణ్యం కేవలం పంచాంగ శ్రవణం ద్వారా లభిస్తుంది. పంచాంగ శ్రవణం మనిషి ఆయుర్దాయమును పెంచుతుంది. అభ్యుదయాలను కలిగిస్తుంది. సకల శుభాలను కలిగిస్తుంది. ఆపదలో ఉన్నప్పుడు సముచిత మార్గాన్ని చూపుతుంది. ఇలా జీవితంలో అడుగడుగునా చేయూతను అందించే పంచాంగాన్ని నిత్యం అనుసరించాలి. పంచాంగ శ్రవణం ద్వారా సంవత్సరమంతా జరిగే శుభాశుభ ఫలితములను తెలుసుకుని దానికి తగ్గట్టు ముందస్తు చర్యలు తీసుకోవడానికి అవకాశమేర్పడుతుంది. ఆ సంవత్సరమునందు వచ్చు పండుగలు, పబ్బాలు, నోములు, వ్రతాలు మున్నగునవి ఎప్పుడు చేయాలో తెలుస్తుంది. ప్రయాణ విషయాలలో మంచి చెడ్డలు, ముహూర్తాలు, వర్ష యోగాలు, రాజపూజ్య అవమానాలు, ఆదాయ వ్యయాలు, కందాయ ఫలాలు, గ్రహణ కాలాలు, శ్రౌత స్మార్తాది కర్మలు మొదలైన వాటిని వివరంగా తెలుసుకోవచ్చు.

శ్లో|| **"సూర్యః శౌర్యమథేందురింద్ర పదవీం సన్మంగళః**
**సద్బుద్ధించ బుధోగురుశ్చ గురుతాం శుక్రస్సుఖం శం శనిః**
**రాహుర్బాహుబలం కరోతు సతతం కేతుః కులస్యోన్నితం**
**నిత్యం ప్రీతికరా భవంతు భవతాం సర్వే కిలత్ర గ్రహాః"**

పంచాంగ శ్రవణం చేసినవారికి, విన్నవారికి సూర్యుడి వల్ల శౌర్యము, తేజస్సు, చంద్రుడి వల్ల వైభవం, కుజుడి వల్ల సర్వ మంగళములు, బుధుడి వల్ల బుద్ధి వికాసము, గురుడివల్ల గురుకృప, జ్ఞానము, శుక్రుడి వల్ల సుఖము, శని వల్ల దుఃఖ రాహిత్యము, రాహువు వల్ల ప్రాబల్యము, కేతువు వల్ల ప్రాధాన్యత కలుగుతాయి.

ఉగాది సందర్భంగా కవి సమ్మేళనాలు జరుగుతూ ఉంటాయి. జనామోదమును పొందినవారు సత్కరించబడతారు. ఉగాదితో వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. శ్రీమాతను తొమ్మిది రోజులు పూజించి పదవనాడు ఉద్వాసన పలుకుతారు.

పరాభవ ఉగాదిని ఆనందోత్సాహాలతో జరుపుకొని, వచ్చే ఉగాది వరకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా సాఫీగా సాగిపోదాం. మన జీవితాలను ఆనందమయం గావించుకుందాం.


Statement about ownership and other particulars about **SRI VENKATESAM (Monthly)**

## FORM IV

See Rule 8

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | H.No.1-1-53, Street No.1, Habsiguda, Hyderabad - 500 007 |
| 2. Periodicity of it's Publication | : | Monthly |
| 3. Editor | : | **PULLAGURLA SAI REDDY** |
| 4. Printer's Name | : | **PULLAGURLA SAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 5. Editor's and Publisher's Name | : | **PULLAGURLA SAI REDDY** |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | H.No.1-2-63/10/1, (Plot no.9/3, M-block) Kakatiya Nagar, Habsiguda, Hyderabad - 500 007. |
| 6. Name and Address of Owner | : | **PULLAGURLA SAI REDDY** H.No.1-2-63/10/1, Kakatiya Nagar,Habsiguda, Hyderabad - 500 007. |

I P.Sai Reddy, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

HYDERABAD
Date : 1-03-2026

**(Sd.) P. SAIREDDY**
Signature of the Publisher




# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్ద్దేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**– గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**దిశా నిర్దేశం:** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 36 వ భాగపు లీలల ప్రచురణ. (మే 2021 నుండి ఆగస్టు 2021 వరకు).



## పూజగదిని పడకగదిగా చేసుకుని జీవిస్తున్నావనుట

గత కొన్ని రోజుల నుండి నేను శ్రీవేంకటేశ్వరునికి మరియు మా తండ్రి గారికి పదే పదే సాష్టాంగ నమస్కారములను చేస్తూ హరినామ క్షేత్రము ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాన్ని తెలపమని వేడుకుంటూ రకరకాలుగా ప్రార్థించాను. అత్యంత దీనంగా నా హృదయాంతరాళం నుండి భక్తి, ఆసక్తితో ప్రార్థించాను. కోవిడ్-19 లాక్ డౌన్ వల్ల ఇంట్లోనే ఉంటూ, ప్రతిక్షణం స్వామివారిని ప్రార్థించసాగాను. మళ్ళీ ఇలా ప్రార్థించాను. గతంలో నా ఇంటిని, ఆఫీసును నేను వాటిని కొనక ముందే నాకు కలలో చూపించినారని, ఇప్పుడు నాకు ఈ హరినామక్షేత్రం అంతకంటే ముఖ్యమని, దీనిని కూడా ఎక్కడ ఏర్పాటు చేయవలెనో తెలుపమని లేదా చూపమని వేడుకున్నాను. నాకు ఇప్పుడు ఇదొక్కటే ధ్యాస తప్ప మరోదానిపైన ఆసక్తి లేదు. ఇలా తిరుమల శ్రీవేంకటేశ్వరుని హరినామ క్షేత్రమును ఏవిధంగానైనా ఏర్పాటు చేయాలనే సంకల్పముతో తీవ్ర సాధన చేయసాగాను. మరియు మా తండ్రి గారి సహాయాన్ని కూడా అందించమని శ్రీవేంకటేశ్వరుని రోజుకు పదిసార్లు ప్రార్థించసాగాను. దీనినంతటిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు సంతుష్టుడైనాడు, మా తండ్రి గారి సహాయాన్ని కూడా అందిస్తూ నన్ను మరింత ప్రోత్సహించారు. ''పూజగదినే పడకగదిగా చేసుకుని నివసిస్తున్నావు'' అంటూ చమత్కరిస్తూ ఈ క్రింది విధమైన లీలను చూపారు.

**తేది 07-05-2021 కల:** ఈ కలలో మేము మా ఊరిలోని మా పాత ఇంటిలో ఉన్నాము. మా తండ్రి గారు కూడా జీవించి ఉన్నారు. అందరము ఈ ఇంటిలో నివసిస్తున్నాము. ఈ ఇంటిలో రాత్రి




పూజ గదిని పడకగదిగా చేసుకుని జీవిస్తున్నావనుట

పడుకోవటానికి అందరం భవంతిలో వారి వారి స్థలములో బిస్తర్ వేసుకుని పడుకుంటాము. ఇది రాత్రి సమయము. అందరము మా మా బిస్తరును పరచుకుని పడుకుంటున్నాము. మా నాన్న కూడా తన బిస్తరును పరచుకుని పడుకొనుటకు సిద్ధమౌతున్నాడు. నేను ఆయనను స్పష్టంగా చూచాను. అదే రూపురేఖలు, పంచ కట్టుకుని చనిపోవు రోజుల కంటె 20 సంవత్సరముల ముందటి రూపముతో ఉన్నారు. మొత్తం మా ఇంటిలో నలుగురైదుగురు సభ్యులు, మా అమ్మ, చెల్లెలు, నాన్నతో పాటు మరొకరు మరియు నేను ఉన్నాను. మా నాన్న తప్ప అందరూ అదృశ్య రూపములో ఉన్నారు. బహుశా నేను పదవ తరగతి లేదా ఇంటర్ చదివే రోజుల లాగా పరిస్థితులు ఉన్నవి. అందరం ఆ హాలులో బెడ్ షీట్లు పరుచుకుని ఏమో మాట్లాడుకుంటూ ఉల్లాసంగా ఉన్నాము. మా ఇంటిలో నైరుతి మూల 10' X 8' సైజు గల దేవుని గది ఉన్నది. ఈ గదిని కేవలం వ్రతాలు, పూజలకు మాత్రమే వాడుదుము తప్ప ఇతరమైన కార్యాలకు వాడము. పూజ సమయాన మాత్రమే తెరచి ఉంచుదుము. అలాంటిది ఈ సమయాన అంటే రాత్రి దాదాపు 9.30 – 10 గంటలకు పడుకునే సమయాన ఈ గది తెరచి ఉండుటను చూచాను. నేను పడుకోవటానికి నా బిస్తర్ ఈ గదిలో వేయబడ్డది. అందరూ వారి వారి స్థలములో పడుకొనుటకు సిద్ధపడుచూ ఏవో మాట్లాడుచున్నారు. ఇంతలో అశరీరవాణి ''సాయిరెడ్డి ఎక్కడ పడుకుంటున్నాడ''ని అడిగింది. అంతలో మా నాన్న ''వాడు పూజ గదిలో పడుకుంటున్నాడన్నారు''. నేను కూడా, అది రాత్రి పడుకునే సమయమైనప్పటికీ పంచ కట్టుకుని పూజ చేయుటకై పూజా మందిరమునకు వెళ్ళునట్లు వెళ్ళుచున్నాను. ఈ గదిలోనికి వెళ్ళకముందే నా పడక ఆ గదిలో పరచి ఉండుటను గమనించాను, మరియు లోనికి ప్రవేశిస్తున్నాను. నేను మాత్రము ఈ రోజు ఉన్న రూపముతో ధోవతి కట్టుకుని పూజ గది లోనికి వెళ్ళాను. కల చెదిరింది.

ఇక్కడ నేను నా పడకను పూజగదిలో ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నట్లు చూపాడు. మరియు నాకు సహాయము చేయుమని మా తండ్రిని ప్రార్థించినందున ఆయన నాకు తన సహాయాన్ని అందించారు. ఇక నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ మాత్రమే కావాలి. ఈ సంఘటనతో నాకు ఎంతో ఆనందము, ప్రోత్సాహము లభించింది. ఒకరకంగా నన్ను స్వామి వారు ''నీవు పూజ గదినే పడకగదిగా చేసుకుని జీవిస్తున్నావంటూ'' చమత్కరిస్తూ ప్రోత్సహించాడని భావించాను. మరియు నేను లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నానన్న నమ్మకం ఏర్పడ్డది.

## జీవిత ధ్యేయమును ఫలవంతము చేయుమని ప్రార్థన

**తేది 31-05-2021:** ఈ రోజు తేది 31-05-2021 శ్రవణా నక్షత్రపు రోజు. గత కొన్ని నెలల నుండి తిరిగి నేను ప్రతి శ్రవణా నక్షత్రము రోజు ఉదయం 3 గంటలకు స్వామివారికి నేతి దీపాన్ని పెట్టి ప్రార్థించే అలవాటు చేసుకున్నాను. గతంలో మహామంత్ర పీఠమును ఏర్పాటు చేయకమునుపు చేసేవాడిని, మీ సేవా భాగ్యాన్ని ప్రసాదించుమని వేడుకునే వాడిని. అప్పుడు నేను కోరినట్లు వారి సేవను ప్రసాదించారు. ఆ తరువాత దీనిని మానివేశాను. తిరిగి గత సంవత్సరం నుండి మళ్ళీ మొదలుపెట్టాను. బహుశా దీని ప్రభావం వలన కావచ్చు స్వామివారికి 111 కళ్యాణాల సేవ లభించింది. అయినప్పటికీ నేను ఈ నేతి దీపమును పెట్టే కార్యక్రమమును అలాగే కొనసాగిస్తున్నాను. మరింత మీ సేవాభాగ్యాన్ని పొందాలని, ముఖ్యంగా ''హరినామ క్షేత్రాన్ని'' ఏర్పాటు చేసి అందులో స్వామివారి అఖండ నామస్మరణ కార్యక్రమమును ఏర్పాటు చేయాలని కోరుచున్నాను. పైగా ఇది నా జీవిత ధ్యేయమని, దీనిని తప్పక ఏర్పాటు చేయాలని, అందుకు తమరు సహాయము చేయవలెనని వేడుకుంటున్నాను. ఒకవేళ నేను దీనిని ఏర్పాటు చేయని పక్షంలో నా జీవితానికి సార్థకత లేదని, ఈ జీవితములో ఓడిపోయిన వాడినగుదునని వాపోయాను. మరియు రోజులు గడుస్తున్నంతలో నా ఆయుష్షు తరిగిపోవుచున్నది, నాకు మీ అఖండ నామ సంకీర్తనను చాలా రోజులు నిర్వహించాలనే కోరిక ఉన్నది. ఎంత ఆలస్యంగా మొదలుపెడితే అంత తక్కువ కాలం నిర్వహించగలను. కాబట్టి ఆలస్యం చేయక వెంటనే సహాయము చేయుమని, దీనిని ఎక్కడ ఏర్పాటు చేయాలో తెలుపుచు, నిర్వహించుటకు కావలసిన శక్తి సామర్థ్యాలను ప్రసాదించుమని పదే పదే వేడుకున్నాను. నా కనుల నుండి నీరు కారుచుండగా నిన్న ప్రార్థించాను. శ్రీమాన్ బాలాజీ గారు ఇంకా రెండు పనులు అయిన తరువాత ఈ కార్యక్రమము ప్రారంభమవుతుందని స్వామివారు చెప్పారని చెప్పినప్పటికీ, అంత వరకు ప్రాణం నిలువక ప్రతిరోజూ వేడుకుంటున్నాను.

## దోషిగా స్వామి ముందు నిలబడుట

ఈరోజు అనగా 31-05-2021 నాడు స్వామివారిని నన్ను శిక్షించమని లేదా తరణోపాయం సూచించమని వేడుకున్నాను. ఎందుకంటే... కోవిడ్ కారణంగా నగరంలోని దుకాణాలు, ప్రింటింగ్ ప్రెస్సులు ప్రభుత్వ సూచన మేర మూసివేశారు. అందుకని నేను జూన్ 2021 నెల శ్రీవేంకటేశం మాసపత్రికను పబ్లిష్ చేయలేదు. నిజానికి ఈ పత్రికను డి.టి.పి చేయువారు మరియు ముద్రించువారు ఏదోవిధంగా చేస్తాము ఇవ్వమన్నారు. కాని నేను మార్కెట్ లేదని, లాక్ డౌన్ నెపముతో డబ్బులు మిగులుననే భావనతో మానేశాను. తరువాత బాధ పడ్డాను. ఒక్క తప్పు కూడా చేయనని మాట ఇచ్చిన నేను ఇలా తప్పుల మీద తప్పులు చేస్తున్నాను. ఒకటి రెండు తప్పులంటే మీరు క్షమిస్తారు కాని మళ్ళీ మళ్ళీ చేయువాణ్ణి క్షమించరాదు. శిక్షించాలని లేదా తరణోపాయం సూచించాలని పదే పదే వేడుకున్నాను. ఈ దోషి మీ ముందు తన తప్పులను ఒప్పుకుంటూ నిలబడ్డాడు, మీకు తోచిన విధంగా శిక్షించండని, నేను శిక్షకు అర్హుడనని చెప్పుచు వేడుకున్నాను. స్వామి ముందు నిలబడి వేచి చూడసాగాను. అనుకున్నట్లుగానే స్వామివారు పోలీసులను పంపి బెదిరించారు. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 01-06-2021 కల :** ఈ కలలో నేను ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుచు హాస్టల్ లో ఉన్నాను. ఏదో ఒక ఫంక్షన్ గురించి పాత విద్యార్థులు వచ్చారు. ఈ హాస్టల్లో గదులు ఒక ప్రక్క బాత్రూంలు మరోప్రక్క సెపరేట్ గా ఉంటాయి. నేను స్నానం చేయుటకై బకెట్ పట్టుకుని ఎన్నో బాత్రూములలోనికి వెళ్ళాను. ఒక్క దానిలో కూడా నీరు లేకపోవుటచే వేరే దానిలోనికి పోయాను. చివరికి నీళ్ళకని వెతుకుచు హాస్టల్ బయటికి వచ్చాను. అప్పుడు ఒక పాత విద్యార్థి, నేడు ఒక ఐ.పి.ఎస్ ర్యాంకులో ఉన్నవాడు, తెల్లని దుస్తులు ధరించి వచ్చాడు. ఈయనతో పాటు మరికొందరు పాత విద్యార్థులు ఉన్నారు. ఇంతే కల.

బహుశా నన్ను బెదిరించుటకు లేదా శిక్షించుటకు ఒక ఐ.పి. ఎస్ ను స్వామివారు పంపారని భావించుకున్నాను. ఇక్కడ ధనము మిగుల్చుకునే భావన వచ్చింది కాబట్టి ఇది దోషము క్రింద భావించుకున్నాను.

## శిక్షణ జరుగుచున్నదని తెలుపుట

**తేది 13-06-2021 కల :** ఆ మధ్యన అంటే 2009 సంవత్సరం ప్రాంతంలో, నాకు జ్ఞానాన్ని అందించడం కోసమని మరియు నేను 'నా' అన్నది వదలలేదనే విషయమును తెలుపుటకు తిరుపతినుండి స్వామివారు ఒక గురువు గారిని పంపారు. బహుశా అదే గురువుగారు సూచించిన ఇంటిలోనే నివసిస్తూ నేను విద్యాభ్యాసము చేస్తున్నానట. ఈ విద్యాభ్యాసము ఎంతవరకు చేశానని పరీక్షించుటకు ఇప్పుడు ఈ గురువుగారు తిరుపతి నుండి మళ్ళీ వచ్చారు. నన్ను ఆ గురువుగారు తరగతిలో పరీక్షించారు. ఆ తరువాత ఆ గురువుగారి అక్క ఒకరు ఇక్కడనే ఉంటున్నారు. నేను వారి ఇంట్లో ఉండే విద్యను అభ్యసిస్తున్నాను. వారికి నివసించుటకు నేనే నిర్మించిన ఒక గృహమును ఇచ్చానట. వారు అందులో నివసిస్తున్నారు. ఆర్భాటము లేని గృహము, ఒక పెద్ద హాల్, ప్రక్కన కిచెన్, ఒక డైనింగ్ హాల్, మరోప్రక్క బాత్రూమ్ సిమెంట్ ఫ్లోరింగ్ తో ఉన్నవి. ఈ ఇల్లు సాధన చేయువారు అంటే గురువులు మరియు బ్రాహ్మణులు నివసించే ఇల్లు మాదిరిగా ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సాధారణంగా ఉన్నది. ఈ ఇంటిలో గురువుగారి అక్క నివసిస్తున్నది. ఆమె దాదాపు 45-50 సంవత్సరముల వయస్సు వరకు ఉంటుంది. ఈ గురువుగారు




గురువు గారి బంధువు ఇంట్లోకి
కాళ్ళు కడుక్కొని వెళ్ళుట.

సుమారు 30-35 సంవత్సరముల వయస్సు వరకు ఉంటారు. జీన్ ప్యాంట్, తెలుపు గీతలు కల బ్లూకలర్ షర్టుధరించి దాదాపు 5 అడుగుల 9 అంగుళాలు ఎత్తు కలిగి ఉన్నారు. నా పరీక్ష అయిన తరువాత ఈ గురువుగారు వారి అక్క ఇంటికి విశ్రాంతి కోసం వచ్చారు. ఒక కుర్చీలో కూర్చుండి ఏదో ఒక పుస్తకం చదువుచున్నారు. ఇంతలో నేను కూడా నా క్లాస్ అయిపోయిన తరువాత ఇదే ఇంటికి వచ్చాను. కాని నా రూపము ఇప్పటిది కాదు. ఇప్పుడు నా వయస్సు 60 సంవత్సరములు. కలలో నేను చూచిన వయస్సు మాత్రం 9-10 వ తరగతి చదివే పిల్లల వయస్సు ఉన్నది. అంటే 15-16 సంవత్సరాల వయస్సులో నిక్కరుతో వీపు పైన పుస్తకముల సంచి పెట్టుకుని ఇంటిలోనికి ప్రవేశించాను. అప్పుడు నేను ఒక హైస్కూల్ విద్యార్థి మాదిరిగా ఉన్నాను. నేను ఇంట్లోకి రాగానే, ఈ గురువుగారు కుర్చీలో కూర్చుని ఏదో చదువుచున్నారు. మరియు వీరి అక్కగారు ఏదో

పని చేస్తూ కనబడ్డారు. నేను ఈ ఇంటివాడినే కావున ఎలాంటి బిడియము లేకుండా నేరుగా బాత్రూమ్ లోనికి వెళ్ళి నా కాళ్ళు కడుక్కున్నాను. నాకు డయాబెటిక్ న్యూరోపతి ఉంది కావున ఎల్లప్పుడు నా పాదాలకు సాక్స్ వేసుకుంటాను. ఇప్పుడు కూడా సాక్స్ తోనే బాత్రూమ్ లోనికి వెళ్ళి సాక్స్ పైనుండే కడుక్కున్నాను. ఈ సాక్స్‌ను ప్రత్యేకంగా చూచాను. ఆ తరువాత ఇంటిలోనికి వెళ్ళాను. కల చెదిరింది.

అంటే... నేను ఇంటిలోనికి రాగానే కాళ్ళు కడుగుకొనుట అనే శిష్టాచారాన్ని నేర్చుకున్నాను. మరియు నేను గురుకులంలో నివసిస్తూ గురువు సన్నిధిలో విద్యనభ్యసిస్తున్నాను. నా విద్యాభ్యాస విషయమును నా స్వామివారు ఎప్పటికప్పుడు పరీక్షించి తెలుసుకుంటున్నారు. ఈ వచ్చిన గురువుగారు గత కొన్నేళ్ళ క్రితం వచ్చిన గురువుగారు ఒక్కరేనా? అనే విషయము అంతగా తెలియదు. సరిగా వారితో వీరిని పోల్చుకోలేదు. కాని రూపురేఖలు ఒకటిగానే కన్పించాయి.

మొత్తం మీద నా విద్యాభ్యాసము మీద స్వామివారికి ప్రేమ ఉన్నది. ఒక పనిని నిర్వహించేందుకని శిక్షణ ఇస్తున్నట్లు కనబడింది. మరియు గురువుగారు తృప్తి చెందుచున్నట్లు కూడా కనబడ్డది.

## అతిథులను ఆహ్వానించుట

**తేది 16-06-2021 కల :** ఈ కలలో నేను ఇంజనీరింగు కళాశాలకు సంబంధించిన హాస్టల్ లో ఉన్నాను. ఆ కళాశాల వారు ఒక పెద్ద ఉత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనికిగాను చాలామంది బయటివారు వివిధ ప్రదేశాల నుండి వచ్చారు. ఈ కార్యక్రమం దాదాపు రెండు మూడు రోజులు జరుగును కావున ఆ ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు, మేము నివసించే హాస్టల్ లో మా గదులలోనే వారికి ఆశ్రయము ఇవ్వడం జరిగింది. ఎవరికి తెలిసిన వారు వారి వారి గదులలో ఈ బయటివారిని పెట్టుకున్నారు. మా గదులు చాలా పెద్దవి. ఒక్కొక్క గదిలో అప్పటికే మేము నలుగురు ఆరుగురము ఉంటున్నాము. నేను ఉన్న గది కూడా పెద్దది, నాకు తెలిసిన ఎక్స్ ఎం.ఎల్.ఏ శ్రీమాన్ ప్రభాకర్ గారు కూడా తన మిత్రులతో ఈ సమావేశానికి వచ్చారు. వీరు నాకు తెలుసు కాబట్టి నా గదిలోకి వచ్చి స్నానాదులు ముగించుకుని నేల మీదనే బిస్తర్ పరచుకుని పడుకున్నారు. ఏదో విషయాలు మాట్లాడుకుంటున్నాము. నా గది నిండా జనాలే ఉన్నారు. మొత్తం మీద ఈ ఫంక్షన్ కి కొన్ని వేల మంది వచ్చినట్లున్నది. ఇంతలో 4.45 గంటలు కావటంతో నా గదిలోని అలారం మ్రోగడంతో కల చెదిరింది.

దీనర్థం – ఉత్సవాలు జరిగే సమయాన తెలిసిన చాలామందిని ఆహ్వానించాలని మరియు వారికి భోజన, వసతి సదుపాయాలు తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. బహుశా హరినామక్షేత్రము ఏర్పడిన తరువాత అనుసరించే విధానాలను సూచించారని భావించాను.

## అందుబాటు రచనలతో పత్రిక నడపమనుట

సంకల్పములో ఓడిపోయిన తరువాత స్వామివారు చెప్పినట్లు వినాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరింది. శ్రీవేంకటేశం మాసపత్రికను స్వామివారు 'చాలు' అనేవరకు నడుపుదునని ప్రమాణం చేశాను. కోవిడ్ సందర్భములో ఒక నెల ప్రచురించనందుకు క్షమాపణలు చెప్పాను. అయితే పత్రిక నడుపుటకు ఈ మధ్యన మంచి ఆర్టికల్స్ రావటం లేదు, మరియు ఎక్కువ పాఠకులు చదువుట లేదు. తద్వారా నాకు సంతోషము లేదు కాబట్టి కనీసం ఈ పత్రికకు మంచి ఆర్టికల్స్ వచ్చే ఏర్పాటు, ఎక్కువ మంది భక్తులు చదివే ఏర్పాటు చేయమని స్వామివారిని పదే పదే ప్రార్థించాను. ఇది నిన్న సాయంత్రం అంటే తేది 17-06-2021 నాడు జరిగింది. దీనికి జవాబుగా ఈ రోజు ఉదయం 5.30 గంటలకు నేను ప్రాణాయామం చేయు సందర్భంలో, నేను మాత్రమే చూడగలిగే ఒక లీలను ప్రసాదించారు.

**తేది 18-06-2021 లీల :** ఈ లీలలో స్వామివారు నాకు శ్రీవేంకటేశం మాసపత్రిక ప్రారంభించుమని తెలిపే సంఘటనను చూపారు. కొండపైన ఉన్న శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రమే చూస్తూ, క్రింద పడినప్పటికి లేచి అంటిన మట్టి కూడా దులుపుకోకుండా, దెబ్బలు తాకినా పట్టించుకోకుండా వెళ్ళమని బోధించిన, కలలో చూపిన మొత్తం సీను మళ్ళీ నా కళ్ళముందు మెదిలింది. అంతే కాదు నాలో ఏదో శక్తి ఆవహించినట్లు మనస్సులో ఆ ఘటనలను చూస్తూ క్రింద పడ్డా, దెబ్బతాకినా, పట్టించుకోక అదే వేగంగా మునికాళ్ళపై వెళ్ళు అని నా నోటితో ఎవ్వరికో చెబుతున్నట్లు గట్టిగా పలికాను. ఇవి అప్రయత్నంగా నా నోటినుండి వచ్చిన మాటలు. మరియు ఆనాటి మొత్తం సీను నా కళ్ళముందు మళ్ళీ కనిపించింది. దీనితో నా కర్తవ్యం బోధ పడ్డది. అంటే... ఎలాంటి ఆర్టికల్స్ రాకున్నా కాని నిరుత్సాహ పడక ఉన్నవాటితోనే సర్దుతూ పత్రికను నడపడమే నా ముఖ్యోద్దేశంగా ముందుకు సాగమని ఆజ్ఞాపించారన్నమాట.

ఇలా శ్రీవేంకటేశం గురించి అడిగిన ప్రశ్నకు స్వామివారు 12 గంటల లోపే కావలసిన జవాబు ఇచ్చారు.

## మధు కల - నూతనోత్సాహం

ఎలాగైనా స్వామివారిని సంతోషపరచుటే ధ్యేయంగా గత కొన్ని నెలల నుండి కఠిన సాధన చేస్తున్నాను. ముఖ్యంగా కళ్యాణాల కార్యక్రమము త్వరగా మొదలు కావాలని ప్రార్థిస్తున్నాను. నా మనస్సును అన్య విషయాలపై ఎంతమాత్రము పోనివ్వడం లేదు. ఇలా చాలా రోజుల నుండి చేస్తున్నాను కాబట్టి కొంత అలసిపోయాను. దీనిని గమనించిన స్వామివారు వారి యొక్క

భక్తునికి ఒక కలను ప్రసాదించి దానిని నాతో పంచుకునేటట్లు చేసి మళ్ళీ నాలో నూతనోత్సాహం నింపారు. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 20-06-2021 కల :** మధు అని ఒక మిత్రుడు ఉన్నాడు. ఈ రోజు ఫోన్ చేసి ఇలా అన్నాడు. ఆ మధ్య ఉదయం 5 గంటల ప్రాంతంలో కల వచ్చిందట. అందులో ఈ మధు, ఆయన భార్యా పిల్లలు కలిసి తిరుపతికి పోయారట. స్వామివారి దర్శనార్థం ఆనంద నిలయంలో స్వామివారి ముందు ఉన్నారట. అప్పుడు నేను స్వామివారి గర్భగుడి లోనికి వెళ్ళి ఒక పూజారి మాదిరిగా మూలమూర్తికి పూజ చేయుటను తను కళ్ళారా చూచానని, నేను ఇక్కడ ఎందుకున్నానని కలలోనే అనుకున్నాడట. దర్శనం చాలా తృప్తిగా జరిగిందట. ఆ తరువాత కల చెదిరిందట. మిమ్ములను ఈ కలలో బహు బాగా చూచాను, అది కూడా శ్రీవేంకటేశ్వరుని గర్భగుడిలో చూచాను. మీపై స్వామివారి కృప దండిగా ఉన్నది అని నాతో చెప్పాడు. తను చాలా సంతోషించానని కూడా చెప్పాడు.

ఈ కల విన్న తరువాత నాలోని నిరుత్సాహం పోయి మళ్ళీ జోష్ నిండినట్లైంది. ఉత్సాహం ఉరకలేసింది. స్వామివారు నా ప్రతి కదలికను గమనిస్తూ మార్గదర్శనం చేస్తున్నారనిపించింది.

## హెచ్చరికలు

ఇలా నా మనస్సు దారి తప్పినప్పుడల్లా స్వామివారు తన లీలల ద్వారా హెచ్చరించుట చేయసాగరు. ఇలాంటివి మరో రెండు కలలు ఈ క్రింది విధంగా కన్నాను.

**తేది 22-06-2021 కల :** ఈ కలలో ఒక గోడకు శ్రీ జగన్నాథుని ఫొటో ఒకటి ఉండుటను చూచాను. ఈ ఫొటో చాలా దగ్గరగా, స్పష్టంగా కనబడ్డది. ఆ తరువాత కూడా కొన్ని లీలలను చూచాను కాని వాటిని మరచాను.

**తేది 23-06-2021 కల :** ఈ కలలో శ్రీకృష్ణుడు బాలకుడిగా ఆడుకుంటున్నాడు. వారి ఇంటిలో ఉన్న ఎవరో మగవారు ఎంత ప్రయత్నించినప్పటికీ ఈయనను అదుపు చేయలేకపోయారు. కాని ఒక స్త్రీ బహుశా యశోద ఈయనను చాలా సులభంగా అదుపు చేసింది. ఆ స్త్రీ రాగానే ఈయన అల్లరి మాని ఆమె వెంట వెళ్ళాడు. కల చెదిరింది. ఈ విధమైన కలలు కన్నాను. బహుశా స్వామివారితో ప్రేమపూర్వకంగా వ్యవహరించితే పని జరుగుననే సంకేతం కావచ్చును.

**24-06-2021:** నేను స్వామివారి లక్ష్యం వైపు కాకుండా ఎప్పుడైనా బోర్ కొట్టి అన్య విషయాలపై మనస్సు పెట్టినచో స్వామివారు ఏదో ఒక పద్ధతి ద్వారా నా మనస్సు మార్చుచుందురు. దీనిని పట్టించుకోక అలాగే ప్రవర్తిస్తే శారీరక ఇబ్బందులు మొదలగును. చివరికి శరణు జొచ్చి మళ్ళీ యథాస్థితికి చేరుదును. ఇలా చాలాసార్లు జరిగింది, ఏమి చేయుదు ఎప్పటికీ ఒకే రకంగా మనస్సు నిలవదు, ఏదో క్రొత్త క్రొత్త ఆలోచనలు వస్తుంటాయి, అందులో ఆనందం ఉంటే అక్కడే చిక్కుకుంటుంది. గత 2-3 రోజుల నుండి వేరే ఆలోచనలు వస్తున్నాయి. నేను అందులోనే మునిగిపోయాను. అనుకోకుండా నేటి ఉదయం 3 గంటల నుండి నా ఎడమ పాదముపై జిల్ జిల్ మని కరెంట్ షాక్ లాగా న్యూరోపతి సమస్య ప్రారంభమైంది. నిముషానికి 2-3 సార్లు ఇలా రావడంతో నిద్ర పట్టలేదు. చివరికి స్వామివారిని శరణు వేడాను, తప్పును క్షమించమని వేడుకున్నాను. ఆ తరువాత చక్కటి నిద్ర పట్టింది. ఆ తరువాత ''నీవు ఎల్లప్పుడు నీ ఆశయంపై మాత్రమే దృష్టి నిలిపి దానినే ఆలోచిస్తూ ఉండాలనే'' ఒక హృదయాంతర సందేశమును పొందాను.

## రక్షించమని తీవ్రంగా వేడుకొనుట

గత కొన్ని రోజుల నుండి నా మనస్సు అప్పుడప్పుడు ప్రక్కదారి పట్టుట వలన నా స్వామివారు నొచ్చుకున్నారు కాబట్టి చాలా బాధ కలిగింది. దీనిని శాశ్వతంగా దూరము చేయమని స్వామివారిని ఇలా ప్రార్థించాను.

**తేది 25-06-2021 :** ఈ రోజు స్వామివారితో నా పరిస్థితిని అతి దీనంగా తెలియజేశాను. నాకు అప్పుడప్పుడు మతి చలించునని, లోకములోని విషయాలపై మనస్సు లాగునని, వాటిని నేను పొందితే బాగుండుననే అభిప్రాయము కలుగునని, వాటి ఆలోచన రాగానే సంతోషం కలుగునని, తద్వారా మీ యొక్క స్మరణ నుండి దూరమైపోతున్నానని తెలిపాను. ఇలా చేయకూడదని మీరు ఎన్నోసార్లు చెప్పినప్పటికీ కొన్నిసార్లు నా ప్రమేయము లేకుండానే జరుగుచున్నదని చెప్పాను. మీ లీలలు పొందిన నాలుగు నుండి ఆరు రోజులు బాగుంటాను, ఆ తరువాత మరుస్తున్నానని, మళ్ళీ లౌకిక విషయాలు గుర్తుకు వచ్చి అట్లుంటే బాగుండు, ఇట్లుంటే బాగుండు అనే విధంగా ఆలోచించుదునని తెలిపాను. చివరికి నన్ను ఆ రకమైన మోహపు ఆలోచనల నుండి రక్షించవలసిందని ప్రార్థించాను. మరియు నా మనస్సును సంపూర్ణంగా మీ చరణ కమలాలపైననే ఉండునట్లు చూడవలసిందిగా దీనంగా ప్రార్థించాను. నా కళ్ళ వెంట నీరు ధారలుగా ప్రవహిస్తుండగా అత్యంత దీనంగా వేడుకున్నాను. ఆ తరువాత స్వామి కృప వల్ల ఈ స్థితి నుండి బయట పడ్డాను. మరియు స్వామివారిని అత్యంత ఇష్టంగా ప్రార్థించుట ప్రారంభించాను.

స్వామివారి రెండవ సంకల్పంగా శ్రీనివాస కళ్యాణాలను స్వీకరించాను. జప సమర్పణ సంకల్పము, దసరా 2002 లో ప్రారంభమై సెప్టెంబర్ 2020 లో ముగిసింది కాబట్టి నేను ఎల్లప్పుడు స్వామివారికి ఋణపడి ఉండాలని భావించి, 2020 దసరా నుండి ఈ సంకల్పము అమల్లో ఉంటుందని భావించుకున్నాను. సంకల్పం ప్రకారం 2021 దసరా వరకు నేను కనీసం 7 కళ్యాణాలనైనా చేసి తీరాలి, లేనట్లైతే ఈ రెండవ సంకల్పములో

ఓడిపోవుట ఖాయం. దసరా ఇంకా మూడున్నర నెలలే ఉంది. కాని లోకంలో ఇంకా కోవిడ్ ప్రభావం పూర్తిగా తగ్గలేదు. మనిషి ఎదుటి మనిషిని చూచి భయపడుతున్నాడు. ఆధ్యాత్మిక సమావేశాలను ప్రభుత్వము నిషేధించింది. విగ్రహాలను తయారు చేయించాను కాని కావలసిన సింహాసనాలు మాత్రం ఇంకా సిద్ధం కాలేదు. పనివారు చాలా ఇబ్బంది పెడుతున్నారు. ఆ మధ్యన స్వామివారిని ఈ కార్యక్రమము త్వరగా మొదలుపెట్టండని ప్రార్థించాను. అప్పుడు స్వామివారు నీవే వెనుక ఉన్నావు అని నన్నే అన్నారు. దీనర్థం – కావలసిన పనిముట్లు సిద్ధం చేయించు, అప్పుడు కళ్యాణం జరిపించు పరిస్థితి ఏర్పాటు చేయిస్తాను అని స్వామివారు చెప్పారు. కాబట్టి నా పక్షాన సిద్ధం చేయించవలసిన సింహాసనాలు, స్టేజి, బ్యానర్, ఆభరణాలు మొదలగు వస్తువులను సిద్ధం చేయుటకు పూనుకున్నాను. కాని ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయాను. కాబట్టి ఈ సంకల్పములో ఓడిపోతాననే భయము పట్టుకుంది. కాళ్ళు చేతులు వణకసాగాయి. అందుకని ఎలాగైనా కళ్యాణాల కార్యక్రమము ప్రారంభించేవరకు స్వామివారిని ప్రార్థనా పూర్వకంగా ఒక్క ఉదుం పట్టు పట్టాలని భావించి తీవ్రంగా ప్రార్థించసాగాను.

రోజంతా స్వామివారి ప్రార్థన తరువాత సాయంత్రము మా ఆఫీసులో మానసికంగా స్వామివారిని ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రార్థించుట ప్రారంభించాను. ముందు స్వామివారిని అత్యంత ఆర్తితో ప్రార్థించి నా ముందుకు ఆహ్వానించేవాడిని. అప్పుడు స్వామివారు నా ముందున్నట్లు భావించి ఆయన నల్లని పాదాలను స్పష్టంగా చూచేవాడిని. ఆ తరువాత స్వామివారి పాదాలు కడగాలనే ఉద్దేశ్యముతో బ్రహ్మదేవుని ప్రార్థించి ఆయన కమండలములోని గంగా నీటిని, మానస సరోవరమును ప్రార్థించి అందునుండి కొంత నీటిని తీసుకొని స్వామివారి పాదాలను కడిగేవాడిని. ఆ తరువాత స్వర్గములో నున్న కామధేనువును ప్రార్థించి కొన్ని పాలను సేకరించి పాదాలు కడిగేవాడిని. ఆ తరువాత మంచి తేనెతో, గంధముతో, సుగంధ ద్రవ్యాలతో పాదాలను పూజించేవాడిని. ఇలా మళ్ళీ మళ్ళీ జలమును, పాలను, తేనెను వాడుతూ నా రెండు చేతులతో స్వామి పాదాలను ఎంతో ఇష్టంగా రాస్తూ నా తనివితీరా కడిగేవాడిని. చివరికి దేవేంద్రుణ్ణి ప్రార్థించి స్వర్గంలోని పారిజాత పుష్పాలు మరియు తులసిదళాలు, గులాబి పుష్పాలు సమర్పించి పాదాభివందనం చేస్తూ ప్రార్థించేవాడిని. దీని ద్వారా నేనెంతో పులకరించిపోయేవాడిని. స్వామివారి పాదాలు కడిగే సమయాన నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు తప్పక వచ్చేవి. గత 20 రోజుల నుండి ఈ క్రియ చక్కగా జరుగుతోంది.

తేది 01-07-2021 రోజున ఈ విధంగా పాదపూజ చేసిన తరువాత నేను ఆయనను ఒక వరము కోరాను. అది ఏమిటంటే నాకు ''మహాభారతములో సంజయునికి లభించినటువంటి వరమును ఇవ్వమని'' కోరాను. అంటే... నేను ఎక్కడున్నప్పటికీ రోజుకు ఒకసారి, లేదా వారానికి ఒకసారి లేదా మీకు ఇష్టమొచ్చినట్లు, నాకు తిరుమలలో ఉన్న మీరు స్పష్టంగా కనపడాలి. నేను ఆ సమయాన ఈ భూమి మీద ఎక్కడున్నప్పటికీ ఒక పది నిముషాల కాలము ఆనంద నిలయంలో ఉన్న మిమ్మల్ని స్పష్టంగా చూడగలగాలి. ఈ వరాన్ని ప్రసాదించమని వేడుకున్నాను. దీనికి నేను సంజయ వరము అని పేరు పెట్టి స్వామివారిని ప్రతి రోజూ ప్రార్థించసాగాను. వచ్చే తొలి ఏకాదశి అంటే తేది 20-07-2021 వరకు ప్రతిరోజు స్వామివారి పాదాలు కడుగుచు ఇలా ప్రార్థించి వరాన్ని పొందాలనుకున్నాను. నాకు యోగ్యత, ప్రాప్తము ఉంటే తప్పక లభించుననే భావముతో ఉన్నాను.

దీని ద్వారా నాకు సంజయ వరము లభించలేదు కాని కోవిడ్, మరికొన్ని ఆటంకాల వల్ల నా రెండవ సంకల్పము నెరవేరదనే భయము తొలిగిపోయి కళ్యాణాల కార్యక్రమము మొదలైంది.

## మొదటి కళ్యాణానికి నాంది

**తేది 06-07-2021 :** గత కొంత కాలంగా కళ్యాణాలు ప్రారంభించుటకు నేను చేసే ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి తేది 05-07-2021 వచ్చింది. ఇది నాకు ఎంతో ముఖ్యమైన రోజు. ఒకప్రక్క ఇది ఇంగ్లీష్ క్యాలండర్ ప్రకారం నా పుట్టిన రోజు. మరోప్రక్క నన్ను స్వామివారు ''సాయిరెడ్డి నావాడు'' అని పిలిచిన రోజు. శ్రీవేంకటేశ్వర మహామంత్రస్థూపం నిర్మించాలని సంకల్పించిన రోజు. స్వామివారి సేవాభాగ్యమును పొందిన రోజు కాబట్టి నిన్న అనగా తేది 05-07-2021 నాడు స్వామివారిని రకరకాలుగా ప్రార్థించి నాకు సహాయం చేయమని వేడుకున్నాను. నాకంటూ ఎలాంటి శక్తి లేదని, నా ప్రతి శక్తి, ఆలోచన స్వామివారేనని, మీరు లేకుంటే, శక్తి ప్రసాదించకుంటే నేను ఏమీ చేయలేనని, ఒక గడ్డిపోచ లాగా ఉండిపోదునని తెలిపాను. మరియు గతంలో మీరు, నేను తృప్తి చెందేవరకు సేవాభాగ్యాన్ని ప్రసాదించారని, నాకు ఇంకా తమకు సేవ చేయాలనే కోరిక ఉన్నదని, అందులకై మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలు మరియు హరినామ క్షేత్రములను స్థాపించాలని భావించానని చెప్పాను. ఈ రెండింటిని సాధించుటకు నేను గత కొంతకాలంగా ప్రయత్నించినప్పటికీ ముందుకు వెళ్ళలేకపోయానని, కాబట్టి దయచేసి నాకు సహాయం చేసి ఈ కార్యక్రమములు తొందరగా జరిగే ఏర్పాట్లు చేయమని వేడుకున్నాను.


అనుకున్నట్లే తేది 05-07-2021 సాయంత్రం నుండి పనులు తొందరగా అగు చిహ్నాలు కనబడ్డాయి. సింహాసనాలను తయారు చేయువారు కూడా తేది 06-07-2021 ఉదయం కొన్ని పూర్తైన రేకులు తెచ్చి తేది 15-07-2021 వరకు పూర్తి చేయుదుమన్నారు. కర్టెన్లు తయారు అవుతున్నాయి. గతంలో ఒక సందర్భంలో డా||

కె.వి.రమణాచారి గారితో మాట్లాడుతూ నేను మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల సంకల్పమును తీసుకున్నానని, వాటిని నెరవేర్చుటకు సహాయం చేయవలసిందిగా కోరాను. ఈనాడు డా|| రమణాచారి గారు మొదటి కళ్యాణాన్ని వచ్చే తొలి ఏకాదశి తేది 20-07-2021 నాడు భజగోవిందంతో కలిపి హిమాయత్ నగర్ లోని టి.టి.డి హాలులో చేయవలెననే విషయాన్ని తెలిపారు. టి.టి.డి హాలు ఇప్పించే బాధ్యత కూడా వారే తీసుకున్నారు. దీనితో నేను ఎంతో సంతోషించాను. మరియు కళ్యాణాల ఏర్పాట్లు ప్రారంభించాము. ఈ కళ్యాణాల ఏర్పాట్లు ఎవరు ఏమేమి చేయాలనే విషయమై ఇంతకుముందు స్వామివారు కొన్ని సూచనలిచ్చారు మరియు నేను కూడా కొన్ని వ్రాసుకున్నాను. అందులో 1. స్వామివారితో పాటు కళ్యాణాల సామానును తీసుకుని 'నమోవేంకటేశాయ' రథంలో వెళ్ళాలి. 2. ఈ రథమును మేళతాళాలతో ఎదుర్కోవాలి. 3. చక్కని డ్రెస్ కోడ్ సంప్రదాయాన్ని మా స్వామిసేవకులు పాటిస్తూ శంఖు చక్రాల్లాంటి హిందూ చిహ్నాలను ధరించి ఊరేగింపు చేయాలి. 4. పెండ్లికొడుకుగా వచ్చిన స్వామివారికి వేదిక ముందు కాళ్ళు కడగాలి. 5. ఈ కళ్యాణం తిరుమల సాంప్రదాయమైన వైఖానస పద్ధతిలో, శాస్త్రోక్తంగా, లాజహోమ యుక్తంగా జరగాలి. స్వామి తత్త్వాన్ని మధ్య మధ్యన బోధించాలి. 6. ఈ కళ్యాణం కేవలం కొద్దిమంది కళ్యాణ కర్తలకే పరిమితం కాకుండా మాస్ కళ్యాణములాగా ఎక్కువ మంది భక్తులు వీక్షించేటట్లు ఉండాలి. అందుకని మేము ఇంటి లోపల కళ్యాణమును చేయరాదు. విశాలమైన ప్రాంగణములో చేయాలి. 7. మేము ఈ కళ్యాణమును ఉచితంగా నిర్వహించాలి. అంటే నమో వేంకటేశాయ రథం యుక్తంగా స్వామివారిని తీసుకుని స్వామి సేవకులతో కలిసి వెళ్ళడము. స్టేజి పైన అరేంజ్మెంట్ చేయడంతో పాటు బ్రాహ్మణ సంభావన కూడా మేమే భరించాలి. ఒక రకంగా ఇది మేము మరియు కళ్యాణ కర్తలు కలిసి నిర్వహించు కళ్యాణం. ఈ కళ్యాణం ఆహ్వానితుల అనువైన రోజున వారు సూచించే ప్రాంతములో జరిపించాలి (కాని హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలోనే అని నిర్ణయించుకున్నాము). మొత్తం మీద కళ్యాణ కర్తలతో పాటు అధిక భక్తులు స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలన్నది మా ప్రధాన సంకల్పం. ఇలాంటి నియమాలను ఏర్పాటు చేసుకున్నాము. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం పై నియమాలతో పాటు నా భార్య సురేఖకు కళ్యాణ వేదిక పైన సామానును సర్దిపెట్టే ఏర్పాటును ఈ క్రింది లీల ద్వారా ప్రత్యేకంగా ప్రసాదించారు.

## సురేఖ బాధ్యత - స్వప్నం

తేది 20-07-2021 తొలి ఏకాదశి రోజున మేము తలపెట్టిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా మొదటి కళ్యాణమును నిర్వహించాలని భావించాము. కాని మేము స్వామివారి కళ్యాణమును ఇంతకుముందు ఈ విధంగా నిర్వహించలేదు. మరియు ఇంతవరకు ఏమీ సిద్ధం చేయలేదు. బట్టలు కొనుట లాంటి ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కాని తేది 20-07-2021 నాడు స్వామివారి కళ్యాణమును చేయాలనే కోరికతో ఉన్నాము. తెలిసిన వారికి మరియు హైదరాబాద్ లోని శ్రీవేంకటేశ్వర భక్త సమాజంలో స్వామివారి కళ్యాణమని ఆహ్వానాలను పంపాము. సంకల్పించిన 111 కళ్యాణాలలో ప్రథమ కళ్యాణమని, మిగిలిన వాటిని మీరు మీ మీ ప్రాంతాలలో చేయవలెనని, కళ్యాణం ఏవిధంగా గొప్పగా ఉండునో చూచుటకు ప్రత్యేకంగా రమ్మన్నాను. సమయం దగ్గర పడ్డది. కాబట్టి సురేఖ ఈ కళ్యాణం ఎలా చేయాలి, ఏమీ సిద్ధం చేయలేదనే బెంగతో ఉన్నది. దీనిని గమనించిన స్వామివారు ఈ క్రింది లీలను ప్రసాదించారు.

**తేది 17-07-2021 కల** : సురేఖకు సంబంధించిన అతి దగ్గరి వ్యక్తిది పెండ్లి ఉన్నదట. దానికై మొత్తం బాధ్యత ఈమెనే తీసుకోవలసి ఉన్నదట. కాని ఈమె ఇంతవరకు ఎలాంటి




పంతులు గారు కళ్యాణ సామాగ్రి ఇవ్వమని సురేఖను అడుగుట

వస్తువులు కొనడం కాని, ఏర్పాట్లు కాని చేసుకోలేదు. ఎలా చేయాలి అని ఆలోచించే లోపల పెండ్లి ఘడియ వచ్చేసింది. పెండ్లి స్టేజి పైన ఎలాంటి ఆర్భాటం లేకుండా, చివరికి క్రొత్త చీర కూడా ధరించకుండా, ఇంట్లో కట్టుకునే మామూలు బట్టలు ధరించి, ఎలాంటి అలంకరణ కాని, ఏర్పాట్లు కాని లేకుండా ఉన్నదట. ఇంకా కొంతసేపైతే పెండ్లి ఘడియ వస్తుంది. ఇంతలో ఆ వేదికపైన ఉన్న పురోహితుడు కళ్యాణం గురించిన వస్తువులను ఒక్కొక్కటి అందించమని అడుగుచున్నారట. కాని ఈమె ఏమి చేయాలో తెలియక తికమక పడుచున్నది. ఎలాంటి ఏర్పాట్లు

చేయలేదు. ఏమి చేయాలని ఆలోచిస్తున్నది. దీనిని గమనించిన పురోహితుడు అతి సౌమ్యంగా ఇలా అన్నారట. ''ఎలాంటి చింత అవసరం లేదు, ఏది ఉంటే దానితోనే జరిపిద్దాము, నీవు బెంగ పెట్టుకోకమ్మా'' అని అన్నారట. మరియు ఉన్న సామానును ఆ వేదికపై అక్కడ ఇక్కడ సర్దిపెట్టారట. ఇంతే కల. స్వామివారు మా మానసిక పరిస్థితిని గమనించి ఉన్నపళంగా మమ్ములను ముందుకు పొమ్మని ప్రోత్సహించారు. ఈ కలతో సురేఖ సంతోషించింది. మరియు రెండు రోజులలో కావలసిన ఏర్పాట్లు అత్యంత ఉత్సాహంగా సమకూర్చాము. ఈ కల అర్థం ఇంతటితో అయిపోలేదు, తరువాత కళ్యాణాలలో సురేఖ స్వయంగా అత్యంత ఉత్సాహంతో వేదికపై కావలసిన ఏర్పాట్లు స్వయంగా చేయుట ప్రారంభించింది. అంటే... వేదికపై సామానును సర్దే బాధ్యతను సురేఖకు అప్పగించాడన్న మాట.

## రెండవ సంకల్పం ప్రారంభం

**స్వామివారికి 111 కళ్యాణాలలో భాగంగా ప్రథమ కళ్యాణం**

దాదాపు ఒక సంవత్సరము క్రిందటి నుండి వేచి చూస్తున్న నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 111 కళ్యాణాల సంకల్పములో భాగంగా మొదటి కళ్యాణమును తొలి ఏకాదశి తేది 20-7-2021 రోజున జరిగింది. ఇది హైదరాబాద్, హిమాయత్ నగర్ లోని టి.టి.డి కళ్యాణ మండపములో అత్యంత వైభవంగా సాయంత్రం పూట జరిగింది.



సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు భజగోవిందం, తరువాత శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధిపతి గారి మంగళాశాసనములు మరియు ప్రత్యక్ష పర్యవేక్షణలో కళ్యాణం జరిగింది. డా|| కె.వి. రమణాచారి, డా|| పులిగడ్డ విజయలక్ష్మి, శ్రీమాన్ కసిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు శ్రీమాన్ మరింగంటి కులశేఖరాచార్యులు గారు ప్రసంగించారు. ఆ తరువాత పురోహితులు శ్రీమాన్ ప్రహ్లాదాచారి గారి ఆధ్వర్యములో కళ్యాణోత్సవం ఆనందంగా జరిగింది. భక్తులు దాదాపు 400 పైగా వచ్చారు. ఈ కళ్యాణానికి శ్రీవేంకటేశ్వరుణ్ణి, శ్రీదేవి, భూదేవిని నమో వేంకటేశాయ రథములో ఊరేగింపుగా మా ఇంటి నుండి మంగళ వాయిద్యములతో తీసుకెళ్ళాము. మధ్యాహ్నం దాదాపు 3 గంటల ప్రాంతమున హాలుకు చేరుకున్నాము. ఆ తరువాత కార్యక్రమము సాయంత్రం 5 నుండి ప్రారంభమైంది.

కళ్యాణము చాలా బాగా, ఆనందంగా, సంతృప్తికరంగా జరిగింది. నా జీవితములో మరో అధ్యాయము ప్రారంభమైనది. నా ప్రభువుకు నేను సేవ చేస్తూ, ఇతరులకు సేవా భాగ్యమును కలుగజేసే అవకాశమును స్వామివారు కల్పించారు. ప్రతి సంవత్సరము 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను చేయాలి. మరియు ఈ కార్యక్రమము గత సంవత్సరం 2020 విజయదశమి రోజు మానసికంగా ప్రారంభించాను. కాని మొదటి కళ్యాణం తేది 20-07-2021 నాడు జరిగింది. నా సంకల్పం పూరించుటకు నేను మొత్తం నా స్వామిపైన ఆధారపడి ఉన్నాను. ఈ రోజు తొలి ఏకాదశి, నా పుట్టిన రోజు, నా వాడని స్వామివారు నన్ను పిలిచిన రోజు కావడం నా అదృష్టం. ఇలా అతి కష్టం మీద కళ్యాణాల సేవ ప్రారంభించాము కాని... వచ్చే విజయదశమి అంటే తేది 15-10-2021 లోపల కనీసం 7 కళ్యాణాలను చేయాలి, లేకుంటే ఈ రెండవ సంకల్పములో ఓడిపోతాననే బెంగ నన్ను వెంటాడుతోంది. అందుకని రక్షించమని స్వామివారిని దీనంగా ప్రార్థిస్తున్నాను.

రెండవ సంకల్పం ప్రారంభించిన సందర్భంగా స్వామివారు కళ్యాణ కార్యక్రమాల కొరకు చూపిన లీలలను ఈ క్రింది విధంగా మరోసారి విశ్లేషించుకున్నాను.

**తేది 24-07-2021 :** 2002 సంవత్సరం నుండి 2020 సంవత్సరం వరకు 18 సంవత్సరాలు స్వామివారికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును సమర్పించాము. 2 సంవత్సరాల ఫలమును మా అమ్మకు ధారపోయుటచే 16 సంవత్సరాల సంకల్పము 18 సంవత్సరాలు పట్టింది. అంటే... 2018 సంవత్సరానికి బదులు 2020 సంవత్సరంలో సంకల్పం పూర్తైంది. పైగా 2020 తొలి ఏకాదశికి నా వయస్సు 60 నిండగానే ఏదేని మాకు చేతనైన మరో సేవను ప్రసాదించి, మీ సేవాభాగ్యమును కొనసాగించమని ప్రార్థించాము. దానికి అనుగుణంగా స్వామివారికి మొత్తం 111 కళ్యాణాలను వివిధ భక్తులచే నిర్వహించ దలపెట్టాము. ఈ కార్యక్రమమును చాలా చక్కగా గంభీరంగా నిర్వహించుటకు చక్కని కళ్యాణ సింహాసనములను కూడా తయారు చేయించాము. ఈ కళ్యాణ కార్యక్రమము చివరికి తేది 20-07-2021, తొలి ఏకాదశి రోజున మొదటి కళ్యాణముతో ప్రారంభమైనది. కాని విజయదశమి 2020 నాడే ఈ కళ్యాణ కార్యక్రమమును మానసికంగా ప్రారంభించాను. మరియు దీనిని శ్రీవేంకటేశ్వర మహా మంత్రపీఠం ఖాతాలో జమ చేశాను.

కళ్యాణాల కోసమని కుంభకోణంలో చక్కని విగ్రహాలను తయారు చేయించాను. వాటికి బంగారు పూత కూడా పూయించాను. మరియు హైదరాబాద్ లో కళ్యాణ సింహాసనములను చేయించి వాటికి బ్రాస్ తొడుగులను తయారు

చేయించాము. కళ్యాణము జరిగే సింహాసనాల వెనకాల టి.టి.డి లో మాదిరిగా శంఖు, చక్ర, నామములు కలిగిన ఒక చక్కని ముఖమల్ క్లాత్ ను తయారు చేయించాము. కళ్యాణ వేదికపై అరటి చెట్లు నిలుపుటకు కావలసిన ఏర్పాట్లను శాశ్వతంగా ఏర్పాటు చేశాము. మరియు వేదిక పైన పూలు మరియు ముఖమల్ క్లాత్ కట్టుటకు కావలసిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు విప్పుకునే విధంగా నట్ బోల్ట్ సిస్టమ్ లో ఏర్పాటు చేశాను, సింహాసనములు కూడా నట్ బోల్ట్ సిస్టమ్ తో శాశ్వతంగా ఉండునట్లు తయారు చేశాము. మరియు స్వామివారికి నచ్చే విధంగా, స్వామి, అమ్మవారు, అందరిలో సుందరంగా, అందగాడుగా చాలా చక్కగా కనబడేవిధంగా చక్కని ఆభరణాలను కొన్నాము. ఈ విధంగా ప్రతిరోజు ఈ కార్యక్రమము గురించిన ఆలోచనలతో గడిపేవాడిని. ఈ రకరకాల వస్తువుల తయారీకి, సేకరణ కొరకు ఎంతో తిరగాల్సి వచ్చింది. ప్రతి సందర్భములో నా స్వామి అమ్మవార్లు చక్కగా ఉండవలెననే నా కోరిక, వారిపైన నా ఆత్రుత నన్ను ఆనంద పరవశుణ్ణి చేసింది. ఈ కళ్యాణాల కార్యక్రమము అతి తొందరగా మొదలు కావాలని ఎన్నోసార్లు స్వామివారిని వేడుకున్నాను. కాని పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండేవి. కరోనా-19 విజృంభణ అధికంగా ఉన్నది కాబట్టి మరింత ఆలస్యము అగుచుండుట చేత నాకు ఊపిరి ఆడక, ఏమి చేయాలో తెలియక స్వామివారినే శరణు వేడుచు ప్రార్థించసాగాను. పరిస్థితులను చక్కబరచి తొందరగా నిర్వహించే పరిస్థితిని తీసుకు రమ్మని పదే పదే వేడుకున్నాను. చివరికి నా మొర విని స్వామివారు ఒకసారి ఇలా చెప్పారు. ''ముందు నీవు తయారు చేస్తున్న సింహాసనములను, ఇతర సామగ్రిని తయారు చేయి, ఇంత లోపల పరిస్థితులను చక్కబెట్టగలను. నీవే వెనక ఉన్నావు, నేను ముందు ఉన్నాను'' అని తేది 24-10-2020 నాడు ఒక లీలలో చెప్పారు. ఈ లీల అనుసారం తేది 20-07-2021 నాటి మొదటి కళ్యాణమును తర్కించి చూచాను. ఈ కళ్యాణ సమయాన ప్రభుత్వము కోవిడ్19 నిబంధనలను కొద్దిరోజుల ముందే సడలించింది, ఆధ్యాత్మిక సభలను ఏర్పాటు చేసుకోవచ్చును, కాని నేను తలపెట్టిన కళ్యాణ సింహాసనములు ఇంతవరకు పూర్తి కాలేదు. ముఖమల్ క్లాత్ ఒకరోజు ముందు మాత్రమే తయారైంది. చివరికి అతి కష్టము మీత సింహాసనములను టెంపరరీగా, పాలీష్ కాకుండానే మొదటి కళ్యాణమునకు వాడాము. అరటి చెట్లు పెట్టుటకై సామాను బయటినుండి తెచ్చాము. స్టేజి ఏర్పాటుకు సిస్టమ్ ఒక రోజు ముందు సిద్ధం చేశాము. ఈ విధంగా స్వామివారు చెప్పినట్లే, సూచించినట్లే మొదటి కళ్యాణము జరిగింది.

ఇక నా పరిస్థితి స్వామివారు సూచించినట్లే ఉన్నది. పూర్తిగా స్వామి సేవలోనే ఉండాలి, కుటుంబ విషయాలు వదిలివేయాలి అనే సూచన కూడా నా మానసిక స్థితికి అనుగుణంగా ఉన్నది. గతంలో నా పుత్రుని తిరస్కరణ వల్ల ఏర్పడిన ప్రభావము నాపై అధికంగా ఉండుట వలన స్వామి సేవను మరింత ఉత్సాహంగా ఆర్థిక విషయాలలో వెనుకంజ వేయకుండా జరిపించాలనే పట్టుదలతో చేస్తున్నాను. స్వామిసేవను సులభంగాచేయుట నాకు నచ్చదు, కత్తిమీద సాము లాంటి నిబంధనలను విధించుకుని వాటిని పూరించుమని స్వామివారిని దీనంగా వేడుకుంటాను. అప్పుడే నేను తృప్తి చెందేవాణ్ణి.

## మా సేవ – ఒక ఆట

ఈ విధంగా నా మానసిక స్థితి స్వామివారు సూచించినట్లు చక్కగా ఉన్నది. పైగా నేను కళ్యాణాల కార్యక్రమము ఒక్కటే కాకుండా 'హరినామక్షేత్రము'ను సాధించాలనే సంకల్పమును కూడా జత చేసి సాధన చేస్తున్నాను. బహుశా ఈ విషయమే స్వామివారికి బహు బాగా నచ్చింది. ఈ మొత్తం విషయమును ఒక ఆటలాగా చిత్రిస్తూ నా భార్య సురేఖకు ఒక చక్కని లీలను ఈ క్రింది విధంగా చూపారు.

**తేది 03-08-2021 కల :** నేను, ఉండటానికి ఒక క్రొత్త ఇల్లును నిర్మించానట. పాత ఇల్లు ఉండగానే కొత్తది నిర్మించి అందులోనికి మారుదామని నా భార్యతో చెప్పానట. కొత్త ఇంటిలోనికి మారుటకు మంచిరోజు చూచుకుని ముహూర్తం పెట్టి మారటానికి సిద్ధంగా ఉన్నామట. సురేఖ మాత్రం పాత ఇల్లు బాగానే ఉన్నది, ఈ కొత్త ఇల్లు ఎందుకని అడిగిందట, కాని నేను లేదు లేదు కొత్త ఇంటిలోనే ఉందామని చెప్పి కొంచెము బలవంతాన అందులోనికి మారే విధంగా తయారు చేశానట. సురేఖ నా మాటలతో మారిపోయి ఈ క్రొత్త ఇంటిలోనికి మారుటకు అన్ని ఏర్పాట్లు చేసిందట. రేపే నూతన గృహ ప్రవేశం. ఇంతలో నేను ఇది వద్దని మరో ఇల్లును నిర్మించుటకు ఏర్పాట్లు చేస్తున్నానట. ఈ మరో ఇల్లును ప్రారంభించాను కూడా, దీనితో సురేఖకు ఏమీ తోచలేదు. మొదటి ఇల్లే బాగుంది, రెండవది నిర్మించి దీనిలోనికి మారుదామన్నాడు, తీరా మారే సమయానికి ఇది వద్దని 3వ ఇల్లు నిర్మిస్తున్నాడు. ఏంటి ఇది అని నన్ను అడిగిందట. అప్పుడు నేను ఇదే ఆఖరుది, దీనిని ఒప్పుకోమని బలవంతపెట్టానట. చివరికి సురేఖ కూడా నా మాట ప్రకారం ఒప్పుకున్నదట. కల చెదిరింది.

పై కల నిజమైన అర్థం ఈ విధంగా ఉంది. ముందు మాకు జప సమర్పణ సేవ ఉన్నది. ఇప్పుడు శ్రీనివాస కళ్యాణములు అనే కొత్త సేవలోకి సురేఖను బలవంతంగా మార్చాను. ఇంతలో 'హరినామ క్షేత్రము' అనే మరో సేవలోనికి మారే అవకాశము ఉన్నదని లేదా నేను ప్రయత్నిస్తున్నానని స్వామివారు సూచించారు.

ఈ భాగం డి.టి.పి చేస్తున్నప్పుడు రెండవ భావం ఈ విధంగా ఏర్పడ్డది : మేము నివసించుటకు హైదరాబాద్ లో చక్కని ఇల్లు

ఉన్నది. కాని ఈ సమయాన సురేఖను ఒప్పించి మా ఊరిలోని ఇల్లును రినోవేషన్ చేసి సిద్ధం చేయు లోపల స్వామివారి ఆదేశానుసారం, హరినామ క్షేత్రం వద్ద మరో ఇల్లును కట్టుటకు ప్రయత్నించవచ్చును.

## మానసిక ఆందోళన

నా సాధనలో భాగంగా గత కొన్ని నెలల నుండి ప్రతి శ్రవణా నక్షత్రము నాడు తెల్లవారుజాము 3 గంటలకు స్వామివారికి నేతి దీపము పెట్టి ప్రార్థించే వాడిని. తేది 21-08-2021 నాడు శ్రవణా నక్షత్రం కాబట్టి తెల్లవారు ఝూము 3 గంటలకు మా ఇంటిలోని పూజగదిలో దీపం పెట్టవలసి ఉంది. కాని అంతకంటే ఒకరోజు ముందు తేది 20-08-2021 సాయంత్రం మా ఆఫీసులో ఈ క్రింది ఆందోళనకు గురైనాను.

గతంలో జరిగిన అన్ని విషయాలు ఒక్కసారి స్ఫురణకు వచ్చాయి. అంటే... స్వామివారు నన్ను ఎన్నుకుని సంకల్పాన్ని నెరవేర్చమని చెప్పడము, నేను సంకల్పంలో ఓడిపోయినప్పుడు దుఃఖించడం గుర్తుకు వచ్చాయి. చివరికి స్వామివారు నేను భాగవతుల ఆశీర్వాద ఫలము వలన విజయము సాధించినట్లు చెప్పారు. అప్పుడు ఈ విజయానికి కారకులు భాగవతులే కాబట్టి ఈ ఫలితాన్ని వారికి పంచిపెట్టమన్నాను. మరియు నాకు మరో సంకల్పమును ఇవ్వమని ప్రార్థించాను. ఫలితంగా స్వామివారు కళ్యాణాల కార్యక్రమమును ప్రసాదించారు. కాని... దీనినంతటిని నేను నా హృదయంలో బహుశా ముద్రించుకోలేదు. మరచాను. అందుకని మళ్ళీ ఒకసారి గతంలో జరిగింది గుర్తుకొచ్చింది. నేను సంకల్పము నెరవేర్చక, స్వామివారిని పొందలేననే భావము నన్ను దహించి వేసింది. నా అసమర్థతను గుర్తించుకుంటూ ఒక్కసారిగా నేను అథోలోకానికి పడిపోయాను. తీవ్రమైన దుఃఖము ఆవహించింది. నాలో ఒక నిస్సహాయ భావము, నేను ఎందుకూ కొరగానివాడిననే భావముతో పాటు, నాకు ఏమాత్రం శక్తి సామర్థ్యాలు లేనట్లనిపించింది. నేను ఒక అసమర్థుడైన వాడిని, ఇంతటి అసమర్థుడు దేవాధి దేవుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సేవకుడుగా ఉండుటకు అర్హత లేదు. అర్హత లేనప్పటికీ ఆయన నన్ను తన సేవకుడిగా కొనసాగిస్తున్నాడంటే... ఆయన మహా మహా దయ కలవాడు. లేకపోతే నన్ను త్యజించేవాడని దుఃఖించాను. స్వామీ! నేను అసమర్థుడను, నా సంకల్పములో ఓడిపోయాను, నాకు ఎలాంటి శక్తి సామర్థ్యములు లేవు, తెలివి లేదు, ఏ పని ఏ విధంగా చేయాలో తెలియదు. నన్ను మీరు సేవకుడిగా పెట్టుకుంటే మీకు అవమానము అని చెప్పుచు ఉన్న నాకు చటుక్కున ఒక ఆలోచన వచ్చింది. ఒకవేళ స్వామివారు నన్ను త్యజించితే... నా గతేమి కావాలి? అప్పుడు నా పరిస్థితి ఏ విధంగా ఉంటుందన్నది ఊహించుకున్నాను. చాలా దుఃఖించాను. నా కళ్ళ నుండి నీటి ధారలు కారుతుండగా వేడుకున్నాను. నన్ను త్యజించకండి ప్రభూ... అంటూ భోరుమన్నాను. నాకు శక్తిని ఇవ్వండి, మీ సేవను కొనసాగించుకోండని ప్రార్థించాను. మరియు ఆ సమయాన నా మానసిక స్థితి ఏ విధంగా ఉన్నదంటే ఈ లోకంలో నేను అత్యంత అల్పుడనని, ఎలాంటి శక్తి సామర్థ్యములు లేనివాడినని, నూటికి నూరుపాళ్ళు పరాన్న జీవునిగా ఉన్నాను. ఈ భావం మానసికంగా అత్యంత బలంగా ఉన్నది కాబట్టి స్వతహాగా నాకు శక్తి లేక ఒక పర్యాయం నిలబడలేకపోయాను, చతికిలబడ్డాను. చివరికి ఆఫీసులో ఏదోలా నిలదొక్కుకుని ఇంటికి పోయాను.

ఆ రాత్రి దుఃఖకరమైన ఆలోచనతో పడుకున్నాను. తెల్లవారు ఝూము తేది 21-08-2021 నాడు శ్రవణా నక్షత్రం. కావున రాత్రి 2.30 గంటలకు లేచి స్నానాదులు ముగించుకుని 3 గంటలకు స్వామివారిని అత్యంత ఆర్తితో ప్రార్థిస్తూ, ఆహ్వానించాను. ఈ దీనుణ్ణి క్షమించమని వేడుకుంటూ దీపం వెలిగించుటకై పూజగదిలో ఉన్నప్పుడు స్వామివారు బహుశా నా అవస్థను చూచి ఒక చక్కటి నేను మాత్రమే చూడగలిగే లీలను క్రింది విధంగా ప్రసాదించారు.

**తేది 21-08-2021 లీల:** నేను దీపము వెలిగిస్తూ స్వామివారిని దీనంగా ప్రార్థించు సమయాన నాకు తిరుమల శ్రీవారి ఆలయము స్పష్టంగా కనిపించింది. నేను మహాద్వారము ముందు ఏకాంతంగా నిలబడి ఉన్నాను. మహాద్వారము తెరచి ఉంది. మహాద్వారము, గుడి పరిసరాలు ధగద్ధగాయమానంగా మెరుస్తున్నాయి. స్వామివారు నన్ను లోనికి వచ్చి దర్శించుకోమని చెప్పుచున్నారనే భావమేర్పడ్డది. కాని నేను మాత్రం స్వామివారి ఆలయ మహాద్వారం ముందు నిలబడి స్వామివారికి దండం పెట్టుచు లోన ఉన్న స్వామివారిని ఊహించుకుంటూ దుఃఖిస్తూ ఉన్నాను. ప్రభూ! నాకు మీ గడప దాటి లోనికి వచ్చే అర్హత లేదు, దానిని నేను నా అసమర్థత వల్ల కోల్పోయాను. అందుకని బయటనుండే మీకు నమస్కరిస్తున్నాను. నా ప్రణామాలను స్వీకరించండని పదే పదే వేడుకున్నాను. మరియు నేను ఒక దౌర్భాగ్యుడనని, నన్ను నేను నిందించుకుంటూ, దుఃఖిస్తూ గడప బయటనే ఉండిపోయాను. ఇంతే కల.

ఇది కల కాదు, నేను స్పృహలో ఉండి స్వామివారిని ప్రార్థిస్తున్నప్పుడు నా కళ్ళకు ప్రత్యక్షంగా కనబడిన చిత్రం. మళ్ళీ ఈ విధంగా ప్రార్థించాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా నేను మీకు మొత్తం 111 కోట్ల జపము సమర్పించి మీకు బొట్టు పెట్టి, మా ఇంటికి ఆహ్వానించి, మీ పాదపూజ చేయాలనే నా సంకల్పములో నేను 18 సంవత్సరాలు కష్టపడినప్పటికీ నా విధి రాత వల్ల ఓడిపోయాను. చివరికి మీరు నాపైనున్న ప్రేమతో ''భాగవతుల ఆశీర్వాదముతో సాధించావు'' అని చెప్పినప్పటికీ, ఆ భాగవతుల ఆశీర్వాదము కేవలము మీ కృప వల్ల లభించినదే! నేను మాత్రం నిజానికి ఓడిపోయాను. అందుకని నేను సంకల్పములో గెలిచిన

వాని మాదిరిగా ''ప్రభూ! నేను నా సంకల్పములో గెలిచాను, మీకు 111 కోట్ల జపము సమర్పించాను'' అని బొట్టుపెట్టి మిమ్ములను ఆహ్వానించలేను. మిమ్మలను ఆహ్వానించే సామర్థ్యమును కోల్పోయాను. ఒకవేళ మీరు నా కోరికను మన్నించి మా ఇంటికి వచ్చి, పాదపూజ స్వీకరించి నన్ను ఆశీర్వదించి వెళితే అది మీ కృపకు, భక్తులపైన ఉన్న వాత్సల్యానికి నిదర్శనమే కాని నేను సాధించుకున్నది ఎంతమాత్రమూ కాదు. ఇది నిజము, నిజము, ముమ్మాటికీ నిజమని చెప్పాను. నా కళ్ళనుండి నీరు ధారలుగా కారుచుండగా అప్పటికి 3 గంటలు అవుతోంది కాబట్టి నేతి దీపమును వెలిగించి, చివరికి హారతి ఇచ్చి మరోమారు ప్రణమిల్లి పూజగది బయటకు వచ్చాను. సంకల్పములో గెలిచాను కాబట్టి నా కోరిక నెరవేర్చుమని స్వామివారిని ఎప్పటికీ అడగకూడదని నిర్ణయించుకున్నాను. ఆయన దయ ఉంటే, నాకు అదృష్టముంటే తప్ప ఇది నెరవేరదు. మొత్తానికి నేను అసమర్థుడైన సేవకుడినే! ఇదే భావనతో తిరిగి పడుకున్నాను. కాని దుఃఖము ఉబికి ఉబికి వస్తుండటం వలన కొంతసేపటికి నిద్రపోయాను.

అనర్హుడినని తెలిసినప్పటినుండి పొందిన అనుభూతులను చదువమనుట

## చింతను వదిలించుట

గతంలో నా మొదటి సంకల్పములో ఓడిపోయి దుఃఖించు సమయాన ఒక లీలలో స్వామివారు ఎంతో మంది భాగవతులచే తిరుపతి లడ్డూలను తేది 22-12-2020 నాడు బహుమతిగా ఇప్పించారు. కాని దీని అర్థమును తెలుసుకోలేక నేను ఓడిపోయాననే భావంతో చాలా రోజులు దుఃఖించాను. చివరికి తేది 13-02-2021 నాడు తిరుపతి లడ్డూలను ఎందుకు బహుమతిగా ఇప్పించారనే విషయమును తెలుసుకున్నాను. మరియు నేను నా స్వశక్తితో గెలవలేదు, భాగవతుల ఆశీర్వాద ఫలితముగా గెలిచాను. కాబట్టి దీని సంపూర్ణ ఫలితాన్ని ఈ 18 సంవత్సరాలు 7 కోట్ల జపములో భాగస్వాములైన ప్రతి భక్తునికి చెందుతుందని, వారికే సమర్పిస్తున్నానని ప్రతిజ్ఞ చేశాను. మరియు ఈ భక్తులకు పంచిపెట్టమని స్వామివారిని వేడుకున్నాను కూడా. కాని దీనిని నేను నా మనస్సులో ముద్రించుకోలేదు. లేదా ఇది నా మూలంలో మార్పు జరగలేదు. నేను 18 సంవత్సరాలు రాత్రింబవళ్ళు కష్టపడ్డాను, చివరికి భగవంతుణ్ణి పొందలేకపోయాననే బాధ నా లోపల నుండి పోలేదు. తేది 13-02-2021 నుండి తేది 20-08-2021 వరకు దాదాపు 6 మాసముల కాలము ఈ బాధ నా మనస్సులో నివురు కప్పిన నిప్పులా ఉన్నది. చివరికి తేది 20-08-2021 నాడు ఈ బాధ బయటకు వచ్చింది. నేను ఎందుకూ కొరగాని వాడినని, అసమర్థుడనని, స్వామి సేవకుడనని చెప్పుకునే అర్హత లేనివాడినని, సంకల్పములో ఓడిపోయిన దౌర్భాగ్యుడనని రకరకాలుగా విచారిస్తూ నాలో నేను కుమిలిపోయాను. బహుశా ఈ రకమైన భావము నా మనస్సులో నిక్షిప్తమై ఉన్నది. కాబట్టి ఒక్కసారి బయటకు వచ్చి నన్ను బాధించాయి. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు తేది 23-08-2021 నాడు నాకు ఒక హృదయాంతర భావాన్ని కలిగించి ఈ బాధను శాశ్వతంగా దూరం చేశారు.

**తేది 23-08-2021 లీల :** ''ఓయీ! నీవు సంకల్పములో అనర్హునివిగా తెలిసినప్పటి నుండి పొందిన అన్ని అనుభూతులను వెంటనే చదువు'' అని ఒక హృదయాంతర భావాన్ని కల్గించారు.

స్వామివారు చెప్పారు కాబట్టి వెంటనే చదివాను. అప్పుడు తెలిసింది. తేది 13-02-2021 నాడే నేను స్వామి సంకల్ప మొత్తం ఫలితాన్ని 18 సంవత్సరాలు 7 కోట్ల జపములో భాగస్వాములైన వారికి సమర్పించానని, ఆ తరువాత మళ్ళీ నేను తేది 20-08-2021 నాడు తిరిగి దానిని ఆశించుట అవివేకమని భావించాను. మళ్ళీ ఈ రకమైన ఆలోచన మనస్సున రానీయకూడదని భీష్మించుకున్నాను. ఇంతకుముందు బహుశా నేను దీనిని గుర్తుంచుకోలేదు కాబట్టి మళ్ళీ ఈ భావనను కలిగించి నేను ఓడిపోయినప్పటి నుండి పొందిన అన్ని అనుభూతులను తిరిగి చదివించి నన్ను నేను అర్థం చేసుకునే విధంగా చేశారు తిరుమల స్వామివారు. వెంటనే స్వామివారిని దీనంగా ప్రార్థించాను. క్షమించమని వేడుకున్నాను. జపము వ్రాసిన భక్తులందరికీ వెంటనే ఈ ఫలితమును పంచిపెట్టమని అత్యంత ప్రార్థనా పూర్వకంగా విన్నవించాను. మరియు ఇకనుండి దీనిని తిరిగి అడగనని కూడా ప్రమాణం చేశాను. ఒకరకంగా ఈ మార్పు ఇప్పుడు నా మూలంలో జరిగినట్లనిపించింది. మరియు రాత్రి నేను దీనిపై అంతర్మథనం చేసుకున్నాను. నేను స్వామి సంకల్పములో ఓడిపోయానని బాధపడే అర్హత నాకు ఉన్నదా? నేను స్వామివారి సేవకుడిని, వ్యక్తిత్వము కోల్పోయిన వాణ్ణి, ఆయన ఏవిధమైన భావాలు కల్పిస్తే అదేవిధంగా నడుచుకుంటానని, నేను నీవాడనని ప్రతిజ్ఞ చేసి గోవిందదాసుగా జీవిస్తున్న నేను, మళ్ళీ ఎలా నా వ్యక్తిత్వాన్ని నిలుపుకొనుటకు ప్రయత్నిస్తాను? ఓడిపోయాననే బాధ ఎందుకు? ఈ జప సమర్పణ సంకల్పము పుట్టించింది స్వామి వారే. నేను కేవలం ఒక పనిముట్టు మాదిరిగా పని చేశాను. ఆయన ఈ సంపూర్ణ ఫలితాన్ని ఆయన భక్తులకు ఇచ్చుకున్నాడు. దానికి నాకెందుకు అభ్యంతరము? నేను ఆ జపములో వ్రాసి భాగస్వాములైన వాణ్ణి కాబట్టి నేను జపము వ్రాసినంత ప్రమాణము మేర నాకు ఆ సంకల్ప ఫలితము లభిస్తుందని భావించాను.

కాని మరోప్రక్క సేవకుడికి కూడా మనస్సు ఉంటుంది. నా మనస్సులోని భావాల ప్రకారం గతంలో నన్ను సంతోషపెట్టారు. మరి ఇప్పుడు ఆయన్ను పొందుటను నిరోధిస్తున్నందుకు దుఃఖము కలిగినప్పటికీ ఇది శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞగా భావించి

శిరసా వహిస్తాననుకున్నాను. ఇక నేటి కర్తవ్యంపై దృష్టి సారించాలని దృఢ నిశ్చయము చేసుకున్నాను.

## ప్రసాదమును భక్తులకు పంచుట

మళ్ళీ ఈ రకమైన భావాలతో నేను బాధ చెందకుండా స్వామివారు గత సంకల్ప ఫలితమును తేది 25-08-2021 నాడు వారి భక్తులందరికీ పంచిపెట్టారు. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 25-08-2021 కల :** అది ఒక శ్రీవేంకటేశ్వర ఆలయ క్షేత్రం. బహుశా హైదరాబాద్ లోని నాచారంలో ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయం లాగా అనిపించింది. ఏదో బ్రహ్మోత్సవము లాంటి గొప్ప ఉత్సవము అప్పుడే జరిగింది. ఆలయం మొత్తం పందిళ్ళతో, అరటి ఆకులతో, పూలతో చక్కగా అలంకరించబడి ఉన్నది. ఎంతో మంది భక్తులు సాంప్రదాయ వస్త్రాలు ముఖ్యంగా పట్టువస్త్రాలు ధరించి వచ్చారు. ముఖముపై చక్కటి తిరునామము కూడా ధరించి ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఆ తరువాత వారు ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదపు పెట్టెను చేతిలో పట్టుకొని పోవుచున్నారు. మా ఇంటిముందు నివసించు శ్రీమాన్ వేంకటరత్నం గారు కూడా ఈ ఉత్సవానికి హాజరయ్యారు. తిరిగి వెళ్ళేటప్పుడు ఒక ప్రసాదపు డబ్బాను పట్టుకొని వెళ్ళుటను స్పష్టంగా చూచాను. ఉత్సవ కార్యక్రమము ముగిసిన తరువాత స్వామివారి ఆశీర్వాదముగా ప్రసాదమును తీసుకొని పోవుచున్నారు. దీనిని ఆలయ ప్రధాన పూజారిగారు అందిస్తున్నారు. ఆ ప్రధాన పూజారిని కూడా స్పష్టంగా చూచాను. ఈయన నాచారం హెచ్.ఎం.టి నగర్ శ్రీవేంకటేశ్వర ఆలయ ప్రధాన పూజారే! కాని ఈ ప్రసాదమును ఇచ్చునప్పుడు నేను చూడలేదు. నేను మరొక శ్రీవేంకటేశ్వరుని ఆలయమునకు ఎందుకో వెళ్ళి వచ్చాను. కాబట్టి కొంచెము ఆలస్యంగా వచ్చాను.




16 సంవత్సరాల జపసమర్పణ ఫలితమును భక్తులకు పంచుట.

నేను వచ్చి చూచేసరికి శ్రీమాన్ వేంకటరత్నం గారు, మరికొందరు వారి ప్రసాదపు డబ్బాలతో ఆలయం వెనుక భాగం నుండి వెళ్ళుటను చూచాను. మరియు భక్తులందరూ వెళ్ళిపోయారు. దీనిని గమనించి నేను కూడా ముందు రాలేకపోయానని అనుకున్నాను. మరియు నాకై కూడా ప్రసాదం సిద్ధంగా ఉన్నదనిపించింది. కాని నేను ఇంకా తీసుకోలేదు. అంటే... ప్రసాదం పొందుటలో భక్తులే ముఖ్యం. భక్తులే మొదటివారు, నీవు రెండోవాడివని స్వామివారు తెలిపారు. ఇంతే కల.

బహుశా నిన్న నేను కోరినట్లు గత సంకల్ప పూర్తి ఫలితమును తన భక్తులకు పంచిపెట్టారు. మరియు నేను మరోసారి ఈ ఫలితమును ఆశించకుండా చేశారు. నేను కూడా నా ఇష్టా ఇష్టాలను ప్రక్కన పెట్టి స్వామివారి ఆదేశానుసారము పని చేయాలని నిర్ణయించుకున్నాను.

**ఒక విశ్లేషణ :** భాగవతుల ఆశీర్వాద ఫలముతో గెలిచావని స్వామివారు తేది 13-02-2021 నాడు చెప్పినప్పుడే నేను ఈ ఫలితమును వారికి పంచిపెట్టమన్నాను. కాని ఈ భావము నా మూలంలో మార్పు జరుగనందున స్వామివారు 6 మాసాలు ఫలితమును పంచిపెట్టలేదు. కాని తేది 23-08-2021 నాడు నా మూలంలో ఈ మార్పు జరిగింది కాబట్టి వెంటనే పంచిపెట్టారు. ఇలా స్వామివారు ఆశించే ప్రతీది నా మూలంలో మార్పు జరగాలని ఆశించేవారు.

**నా దిశ :** స్వామివారు నా సాధనను ప్రోత్సహించారు. శిక్షణ జరుగుచున్నది. మరియు ఎప్పటికప్పుడు నూతనోత్సాహాన్ని నింపసాగారు. చివరికి కళ్యాణాల కార్యక్రమము మొదలైనది. మొదటి సంకల్ప ఫలితాన్ని భక్తులకు పంచిపెట్టారు. మొదటి కళ్యాణాన్ని మేమే నిర్వహించాము.

ఈ కాలంలో జరిగిన కళ్యాణాలు : 1 వ కళ్యాణం నుండి 4 వ కళ్యాణం వరకు మొత్తం 4 కళ్యాణాలు జరిగాయి.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# పరాభవ నామ ఉగాది

– డా|| దేవులపల్లి పద్మజ, 9849692414

ఈ సృష్టి యావత్తు బ్రహ్మదేవుడు తన భూత సృష్టిని ప్రారంభించిన 'సృష్ట్యాది' నుంచి లేక ఈ కలియుగం ప్రారంభం మొదలు నుండి గాని పంచాంగాలలో లెక్కించటం వాడుకగా వస్తున్న ఆచారం. ఈ బ్రహ్మ సృష్టిలో ప్రళయం అయిపోయిన తరువాత తిరిగి ఆరంభించే అధ్యాయాన్ని బ్రహ్మ కల్పం అని అంటూ ఈ ప్రారంభ కాలాన్ని 'కల్పాది' అని వ్యవహరిస్తారు. ప్రతీ కల్పంలోనూ మొదట వచ్చే 'ఆది' సమయమే 'ఉగాది' పండుగ. దీనిని గురించి 'సూర్య సిద్ధాంతము' అనే జ్యోతిష్య గ్రంథంలో స్పష్టంగా చెప్పబడింది. నాటినుండి నేటివరకు ఈ పద్ధతినే అనుసరిస్తూ ప్రతీ తెలుగు సంవత్సర ఆరంభ దినం నాడు మనం ఉగాది పర్వదినం జరుపుకునే ఆచారం ఏర్పడినది. 'యుగాది' అన్న సంస్కృత పదము యొక్క ఉచ్చారణ భేదం వలన 'ఉగాది' అనే తెలుగు మాట ఏర్పడినది.




**చైత్రమాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమే అహని**
**వత్సరాదౌ వసంతాదౌ రసరాద్యే తథైవచ**

సృష్టి ప్రభవం అయిన మొదటి సంవత్సరం నుండి చరితార్థంగా "ప్రభవ" అని నామకరణం చేసి అక్కడి నుంచి "క్షయ" నామ సంవత్సరం క్రమంలో 60 నామాలతో సంవత్సర గమనం సాగుతుంది. క్షయ నామ సంవత్సరంతో సమాప్తమవుతుంది. కనుకనే మనం జనించిన మొదలు ఈ నామచక్రం మనకు 60 సంవత్సరముల వయస్సుకు చేరినపుడు తిరిగి అదే సంవత్సరంచే పూర్తి అగుటచే షష్టి పూర్తి జరుపుకుంటాం.

వేదాలను హరించిన సోమకుడు అనే రాక్షసుని వధించి శ్రీమహావిష్ణువు తిరిగి పునరుద్ధరించిన రోజుగా కూడా ఉగాది ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. తెలుగు సంవత్సరం చైత్రం నుండి శిశిరం వరకు ఆరు ఋతువులుగా విభజించబడినది. సంవత్సరం పొడవునా అనేక ఒడి దుడుకులను అనుభవించిన ప్రకృతిలో చెట్లు శిశిర ఋతువులో ఆకులు రాల్చి జడత్వాన్ని పొందుతాయి. చైత్రమాసంలో క్రొత్త చిగుర్లు తొడిగి చైతన్యవంతంగా కనిపిస్తాయి. ఈ విధంగా ప్రకృతిలో సంభవించే నూతన వత్సరం చైత్రమాసం. అందుకే ఈ

మాసారంభానికి ఉగాది అని పేరు వచ్చిందని చెప్పుకోవచ్చు. ఇది మనలో కూడా నూతన ఉత్తేజాన్ని కలిగించి నవ నవోన్మేషంగా ముందుకు తీసుకుపోవటానికి దోహదం చేస్తుంది.

ఉగాది పర్వదినాన అభ్యంగనము, పుణ్యకాల సంకల్పం, ఉగాది పచ్చడి సేవనం, ధర్మకుంభం, సృష్టిక్రమ వర్ణన, కల్పాది వైవస్వత మన్వంతర వివరములతో కూడిన పంచాంగ శ్రవణం అనే ముఖ్యమైన విధులను అనుసరించవలసి ఉంటుంది.

**అభ్యంగనము** : సూర్యోదయానికి పూర్వమే నువ్వులనూనె తలకి పట్టించి, ఉసిరిక, పెసరపిండి, మ్రానిపసుపు, భావపంచాలు, కచ్చూరాలు మొదలైన వాటిని ఉపయోగించి శిరస్నానం చేయాలి. ఈ దినం వేడినీటి స్నానం శ్రేష్ఠం. అనంతరం తిలకం దిద్దుకుని, నూతన వస్త్రములు ధరించి సంకల్పం చెప్పుకొనవలెనని ధర్మసింధువు తెలియజేస్తోంది.

**పుణ్యకాల సంకల్పము** : సూర్యోదయానికి ఒక ముహూర్తకాలం (20 నిముషాలు) మాత్రమే పాడ్యమి ఉన్నా సరే ఆ రోజునే పండుగ సందర్భ సంకల్పం చెప్పుకుని ప్రారంభించాలి. సూర్యునికి అర్ఘ్యము, దీపం, ధూపం, పుష్పాంజలి సమర్పించాలి.

ఈ సంకల్పంలో ముఖ్యమైన దేశము, కాలము ధ్యానించి, బ్రహ్మ యొక్క సృష్టి సంకల్పము యొక్క సంకల్ప సిద్ధిని ధ్యానించి, మనము తలపెట్టిన కార్యక్రమాలకు శుభ ఫలితాలను ఇవ్వాలని కోరుకుంటారు. హైందవ సంకల్ప మంత్రాలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ సాంప్రదాయ కృత్యములో ముందుగా స్మరించే 'శ్వేత వరాహ కల్పం' అనబడే ఈ 'బ్రహ్మ కల్పము' యొక్క సంకల్పము. ఇది పంచాంగ గణితమంతటికీ ఆధారభూతమైనది.

''శ్రీమహావిష్ణో రాజ్ఞాయ ప్రవర్తమానస్య ఆద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహ కల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే.....'' అని వేద కాలమానము తెలుపుతూ ఆచరించవలెను.

ప్రస్తుతం నడిచే వైవస్వత మన్వంతరం ఏడవది. సూర్యుని పుత్రుడైన వైవస్వత మనువు పరిపాలన ప్రారంభమైన ఈ మన్వంతరంలో 2 మహాయుగములు గడిచినవి. ప్రస్తుత కలియుగము 18-12-3102 బి.సి లకు సరిపోయినవని చెప్పబడినది. ఏడుగురు మనువులు ప్రారంభ తిథులు కూడా వేదమునకు ఉపాంగమైన జ్యోతిష్య శాస్త్రము వల్ల నిరూపించబడింది. ఈ విధముగా ఒక మహాయుగములో 43,20,000 సంవత్సరములు ఉండునని శాస్త్రీయముగా ఖగోళ పండితుల వలన నిరూపితమైనది.

**ఉగాది పచ్చడి సేవనం** : తరువాత జరిపే అత్యంత ముఖ్యమైన కార్యక్రమం ఉగాది పచ్చడి స్వీకరణ. దీనిని పరగడుపునే స్వీకరించాలి. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడికి ఎంతో ప్రాముఖ్యం ఉంది.

తీపి, వగరు, చేదు, కారం, పులుపు, ఉప్పు వంటి షడ్రుచుల కలిసిన ఉగాది పచ్చడి మన సొంతం. ఈ పచ్చడి ప్రాముఖ్యాన్ని వర్ణించటం బహు కష్టము. ఎంతో మంది కవులు, పండితులు, శాస్త్రకారులు ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని అమోఘంగా వివరించారు. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనుభవాలకు ప్రతీకగా దీనిని భావిస్తారు. ఈ పచ్చడి తయారు చేసుకోవటానికి చెరుకు, మామిడికాయలు, వేపపువ్వు, అరటిపళ్ళు, లవణం, చింతపండు, బెల్లం, పచ్చిమిరప మొదలైనవి వాడతారు. చూత కుసుమము, అశోక చిగురులు కలిపి సేవించే సాంప్రదాయం మనకు ఇప్పటికీ కనిపిస్తూ ఉంటుంది.

**శాతయుర్వజ్రదేహాయః సర్వ సంపత్కరాయచ**
**సర్వారిష్ట వినాశాయ, నింబ కుసుమ భక్షణం ।**
**త్వామష్టశోక నరాభీష్ట! మధుమాస సముద్భవ**
**విభావి శోక సంతప్తాం మామశోకం సదాకురు ॥**

ఈ వేప పూత లేహ్య భక్షణం సర్వారిష్టాలను నివారించి సర్వ సంపదలను కలిగించే అదృష్టాన్ని వృద్ధి చేసి, దీర్ఘాయువు, వజ్రము వంటి దేహము ప్రసాదిస్తుందని తెలియజేస్తుంది. వసంతంలో చిగురించే ఓ అశోక కలికమా! జీవితంలో శోకాలతో బాధపడుతున్న నాకు శోకములే లేకుండా చేయగలవు గాక!

**ధర్మ కుంభము** : రానున్న రోజులలో పూర్ణ మనోరథ సిద్ధి మరియు సకల సౌభాగ్యాలు కలుగుతాయనే సంకల్ప బలంతో పంచలోహాల పాత్ర గాని, మట్టికుండ గాని కలశముగా తీసుకొని సుగంధ జలము, చందనము మరియు పుష్పాక్షతలు వేసి ఆవాహన చేసి ఉణ్యాహ మంత్రములతో బియ్యము పోసిన ఒక పళ్ళెములో కలశము ఉంచి నూతన వస్త్రము చుట్టి ఉపరిభాగమున నారికేళము ఉంచి, కుంకుమ, పసుపు, చందనములు సమర్పించి పురోహితునకు గాని, గురువునకు గాని లేక గుడిలోని ఇష్ట దైవమునకు గాని దానమిచ్చి, వారి ఆశీర్వాదములు పొందాలి. దీనినే ''ధర్మ ఘట దానం'' లేక ''ప్రపాదనం'' అంటారు. ఈ విధి నేటికీ పల్లెలలో ఆచరిస్తున్నారు.

**పంచాంగ శ్రవణము** : మహా పర్వదినాలైన కల్పాది తిథులు, మన్వంతర తిథులు, దశావతార పుణ్యతిథులు మొదలైనవి పంచాంగంలో తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ మొదలైన 5 అంగముల కలయికగా చూపబడుతాయి. ఈ విధమైన పంచ అంగముల శ్రవణము వలన భవిష్యత్తులో మనకు రానున్న విశేషాలు, పండుగలు, గ్రహణాలు, వర్ష వివరాలు, కాల నిర్ణయాలు మొదలైనవి తెలుసుకోవటం జరుగుతుంది. పంచాంగ శ్రవణంలో ఆ సంవత్సరంలో సాగే ధరవరలు, వర్షపాతములు మొదలైన ముఖ్య సమాచారము కూడా పొందుపరచబడి ఉంటుంది. ఇది రైతులకు, వ్యాపారస్తులకే కాక సామాన్య జనులకు దిక్సూచిగా ఉపయోగపడుతుంది. ఇది ఉగాది రోజును విశేష విధిగా భావించాలి. కనుక హైందవ

సాంప్రదాయంలో పంచాంగ శ్రవణం ఉగాది తిథి రోజున ప్రాముఖ్యత సంతరించుకున్నది.

**తిథేచ్చ, శ్రియమాప్నోతి వారాధాయుష్య వర్ధనమ్**
**నక్షత్రాత్తరతే పాపం, యోగాద్రోగ నివారణమ్**
**కరణాత్కార్య సిద్ధిస్తు, పంచాంగ ఫలముత్తమమ్**
**కాల విత్కర్మ కృద్ధీమాన్ దేవతానుగ్రహం భవేత్**

తిథి వలన సంపద, వారము వలన ఆయుష్షు, నక్షత్రము వలన పాప పరిహారము, యోగము వలన వ్యాధి నివృత్తి, కరణము వలన కార్యానుకూలత సిద్ధించును. కాలము తెలిసి కర్మము చేయు ఆస్తికులు భగవత్ అనుగ్రహము పొంది సుఖమనుభవింతురు.

**తిథిర్వారం, నక్షత్రం యోగః కరణమేవచ**
**పంచాంగస్య ఫలం శృణ్వన్ గంగాస్నాన ఫలం లభేత్**

రామాయాణాది పవిత్ర గ్రంథ పఠనము వలన వచ్చే విశేష ఫలము ఈ పంచాంగ శ్రవణము వలన కూడా పొందవచ్చును.

కన్యావనా కాంచన దిగ్గజానాం సహస్ర మయుతం సతతం
**ద్విజేభ్యః దత్వా ఫలం యల్లభేతే మనుష్యః**
**తత్తత్ఫలాన్యబ్ద ఫలంచ శృణ్వాన్**
**ఆయుర్వృద్ధ్యం పుత్ర పౌత్రాభి వృద్ధిం నిత్యారోగం సంపదం చానపాయం**
**అచ్ఛినానామక్సదానా మహసిం యచ్ఛంత్యేతీ వత్సతే రాధీశ ముఖ్యా**

భూమి, స్వర్ణము, ఏనుగులు, గోవులు, సర్వలక్షణ యుక్తమైన కన్యను ఉత్తముడైన పాత్రునకు దానం చేస్తే కలిగినంత ఫలితముతో సమానం. శాస్త్రవిధిగా పంచాంగ శ్రవణం చేయుట వలన సూర్యునిచే శౌర్య తేజస్సులు, చంద్రునిచే భాగ్య వైభవములు, కుజునిచే సర్వ మంగళములు, బుధునిచే బుద్ధి వికాసము, గురునిచే గురుత్వ మరియు జ్ఞానములు, శుక్రునిచే సుఖము, శని దేవునిచే దుఃఖ రాహిత్యములు, రాహువుచే ప్రాబల్యము, కేతువుచే తన వర్గములో ప్రాముఖ్యత కలుగునని శాస్త్ర వచనము.



తెలుగు వారు ఉగాది పర్వదినాన్ని అత్యంత ఉత్సాహంతో, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ రోజు తమ తమ ఇంటిని పరిశుభ్రం చేసుకుని మామిడి తోరణాలతో, రంగు రంగుల రంగవల్లులతో శోభాయమానంగా అలంకరించుకుంటారు. ప్రాంతాలవారీగా తమ తమ పంచాంగాలను, ఆచార వ్యవహారాల ననుసరించి జరుపుకుంటున్నప్పటికీ. క్రొత్త మాసారంభ సంకేతంగా మాత్రం ఉగాది జరుపుకుంటున్నారని మాత్రం గుర్తించవచ్చును. ఋతువులు కాలధర్మానికి సంబంధించినవి. రామాయణ కాలంలో వైశాఖ, జ్యేష్ఠాలు వసంత ఋతువుగాను, మహాభారత కాలంలో చైత్ర, వైశాఖ మాసాలు వసంత ఋతువుగాను పరిగణింపబడేవి అని మనకు తెలుస్తోంది. తెలుగువారు చాంద్రమానాన్ని ప్రమాణంగా స్వీకరిస్తారు. జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించి పూర్ణిమ తిథిలో సంభవించే నక్షత్ర ఆధారంగా మాస నిర్ణయం జరుగుతుంది. ఆ విధంగా చిత్తా నక్షత్రంతో కలిసిన పూర్ణిమ తిథిని మనం చైత్రమాసంగా భావించటం జరుగుతుంది. కొన్ని ప్రాంతాలలో సౌరమానం కూడా ప్రామాణికంగా తీసుకోవటం జరుగుతుంది. ఏది ఏమైనా తెలుగువారు జరుపుకునే ఉగాది పర్వదినం చైత్రమాస తొలిరోజుతో ప్రారంభం అవుతుంది.

మన హైందవ సంప్రదాయంలో పండుగలకు విశేష స్థానం ఉంది. బంధు మిత్రుల సమాగమం, దైవ సందర్శనం, పేదలకు దాన ధర్మాలు, పశుపక్ష్యాదుల పూజలు మొదలైనవి ముఖ్యంగా కనబడతాయి. స్నేహ సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తాయి. ధార్మిక వాతావరణం అభివృద్ధి చెంది సామరస్య భావాలు పెరుగుతాయి. భగవంతుడు సృజించిన ఆహారంతో అందరికీ బ్రతికే అధికారం ఉంటుంది కనుక పేదలు కూడా తగిన ఫలాలు అనుభవించగలుగుతారు. ప్రకృతి పరిరక్షణ కూడా ఒక అంశమౌతుంది కనుక వాతావరణ సమతుల్యత ఏర్పడుతుంది. క్రొత్త రుచులతో ఆహారం సేవించటం వల్ల శారీరక దౌర్బల్యాలు తొలగి కొత్త ఉత్సాహం పెరుగుతుంది. అభ్యంగన స్నానం చేయటం, క్రొత్త దుస్తులు ధరించటం వలన శారీరక కాంతి వృద్ధి చెందుతుంది. పండుగల వలన ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అనేకమంది వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.


ఈ పరాభవ నామ సంవత్సరం ప్రారంభం తెలుగు సంవత్సర క్రమంలో 40 వది. ప్రభవాది అరువది సంవత్సరములలో ఈ క్రొత్త వత్సరం ఉత్తరాభాద్ర నక్షత్రంతో మొదలైంది.

సంవత్సర ఫలితాలు సాధారణంగా నవ నాయకుల సంచారం, గ్రహణాలు, మౌఢ్యాలు మొదలైన వాటిననుసరించి నిర్ధారితమవుతాయి. ఆయా సంవత్సరాలలో జన్మించిన వ్యక్తుల యొక్క స్థూల జాతక ఫలితాలను కూడా ఆయా సంవత్సరాల లక్షణాలను కొంతవరకు ప్రతిబింబిస్తాయి. కాని ప్రధానంగా జన్మించిన సమయానికున్న వారి జాతకాల ననుసరించి ఫలితాలు నిర్దేశమవుతాయి.

విశేషమైన సత్ఫలితాలను అందించే ఉగాది అందరి మనోభీష్టములను నెరవేర్చి, సుఖ శాంతులు అందించాలని కోరుకుందాం.

**సర్వేజనాః సుఖినోభవన్తు – శుభం భూయాత్**

ధారావాహికం



# మార్గదర్శకులు మహర్షులు

డా|| శివానందమూర్తి

**గత సంచిక తరువాయి**

రావణ వధ అయిపోయిన తరువాత పుష్పక విమానంలో అయోధ్యకు తిరిగి వస్తూ, మళ్ళీ అగస్త్యాశ్రమం దగ్గర దిగి, ఆయనకు నమస్కరించి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రాముడు. యుద్ధం పరిసమాప్తి చేసి విజయం సాధించిన రాముడికి అక్షింతలు వేసి, ఆశీర్వదించి, ఒక విచిత్రమైన ఆభరణం ఇచ్చాడు. అది గొప్పగా వెలుగుతున్న ఆభరణము. రాముడేమో ధర్మసూక్ష్మం తెలిసినవాడు. ఆయనకు ధర్మం ప్రధానం. అందుకని అగస్త్యుడితో ''అయ్యా! నేను క్షత్రియుణ్ణి. దానం పుచ్చుకోకూడదు. అలా చేస్తే క్షత్రియుడి క్షాత్రానికే తప్పు. బ్రాహ్మణుడు దానం పుచ్చుకోవచ్చు. ధర్మం అలా ఉంది కదా!'' అన్నాడు. అప్పుడు అగస్త్యుడు ''రామా! దీనిని క్షత్రియుడు పుచ్చుకోవచ్చు. ఎందువల్లనంటే క్షత్రియుడు లోకాన్ని పరిపాలించే ప్రభువు. కాబట్టి ఎవరైనా తమ ప్రభువుకు ఏదైనా సమర్పిస్తారు. అది దానం కాదు. సమర్పణం. తేడా ఉంది కదా! దేశాన్ని ఏలే ప్రభువుకు ప్రజలెవరైనా ఆభరణాల లాంటి కానుకలు సమర్పించటము, ప్రభువులు స్వీకరించటం ధర్మమే కదా. అయితే బ్రాహ్మణుడు దాని తీసుకుని ఆశీర్వదిస్తాడు. చెయ్యి చాపి అడుగుతాడు, తీసుకుంటాడు. దానం తీసుకునేటప్పుడు బ్రాహ్మణుడి చెయ్యి కింద ఉంటుంది. ఇచ్చేవాడి చెయ్యి పైన ఉంటుంది. కాని రాజు స్వీకరించేటప్పుడు ఇచ్చేవాడి చెయ్యి క్రింది ఉంచి అందిస్తే, రాజు చెయ్యి పైన ఉంచి స్వీకరిస్తాడు క్షత్రియుడు కాబట్టి. అలా తేడా ఉంది. నువ్వు ఈ దేశాన్ని ఏలే ప్రభువవి కాబట్టి క్షత్రియుడివయినా నా దగ్గర తీసుకోవాల్సిందే! ఇస్తున్నాను తీసుకో'' అన్నాడు అగస్త్యుడు.

రాముడు ఆయనను ఆ ఆభరణం ఎక్కడినుంచి వచ్చింది అని అడిగాడట కూడా. అగస్త్యుడు అందుకు, ''పూర్వం ఒక క్షత్రియుడు ఉన్నాడు. ఆయన తపస్సు చేసి రాజర్షి అయినాడు. ఆయన పేరు సూతుడు. ఆయన నా ఆశీర్వాదం తీసుకోవటానికి వచ్చినప్పుడు ఈ భూషణాన్ని నాకిచ్చాడు. నేను దీన్నేం చేసుకుంటాను? దీన్ని స్వీకరించటానికి యోగ్యుడయిన వానికోసం చూస్తుంటే నీవు వచ్చావు, నీకిచ్చాను'' అన్నాడు.

నహుషుడు అనే పేరుగల పండితుడైన ఒకానొక రాజు కోటి యజ్ఞాలు చేసి గొప్ప జ్ఞానియై, పండితుడై, చాలా దానధర్మాలు చేసి ఇంద్రపదవికి కావలసిన అర్హత సంపాదించాడు. అయితే ఆ పదవి అక్కడ ఖాళీగా లేదు. ఇంద్రుడున్నాడక్కడ. ఇంద్రపదవికి అతడికి అర్హత అయితే వచ్చింది కాని, ఇంద్రుడు అక్కడ లేనప్పుడు కదా వెళ్ళి ఆ పదవిని మనం సంపాదించాలి.

విశ్వరూపుడు అనేటటువంటి ఒక పండితుడు, బ్రాహ్మణుడు రాక్షస లక్షణాలు కలిగి ఉండటం చేత, ఇంద్రుడు వెళ్ళి అతడిని చంపాడు. అందువలన ఇంద్రుడికి పాపం వచ్చింది. అతడు ఇంద్ర సభలో ఉండగా, ఆ పాపం అతడిని పీడిస్తున్నది. తేజోహీనుణ్ణి చేస్తున్నది. ఆ అవమానం భరించలేక ఇంద్రుడు పారిపోయాడు. స్వర్గాన్ని వదిలిపెట్టి ఎక్కడికో వెళ్ళి దాక్కున్నాడు. ఆ సమయంలో మహర్షులు అందరూ వచ్చి, పదవిలో ఎవరో ఒకరు ఉండాలి కాబట్టి అర్హత కలిగివున్న నహుషుణ్ని తీసుకెళ్ళి ఇంద్రపదవిలో ప్రతిష్ఠ చేశారు.

స్వర్గలోకానికి వెళ్ళగానే నహుషుడికి మళ్ళీ మనుష్య బుద్ధి పుట్టింది. అంటే చెడ్డబుద్ధి పుట్టింది. ''ఇంద్రసింహాసనం ఒక్కటే నాకు వస్తే ఎట్లా? ఇంద్రుడి భార్య శచీదేవి కూడా నన్ను వరించాలి'' అన్నాడు. అప్పటికి ఇంద్రపదవి సంపూర్ణం అవుతుంది. మళ్ళీ ఇంద్రుడు రాడు కదా! అదీ వాడి దురాలోచన. పాపం! ఆవిడ చేసేదేమీ లేక బృహస్పతికి కబురు పెట్టింది.

దేవగురువుతో ఆమె, ''ఇతడు ఇలా అడుగుతున్నాడేమిటి? చాలా చిత్రంగా ఉంది. సమస్త ధర్మాలూ తెలిసి యజ్ఞ యాగాది క్రతువులు చేసి ఇంద్రపదవికి అర్హత సంపాదించి కదా పదవిని అధిష్ఠించింది! అతడికి ధర్మం తెలియాలి కదా! ఇంద్రభోగాలకే కదా అతడు అర్హుడు'' అన్నది.

బృహస్పతి ఆమెతో ''అతడి అర్హత అజ్ఞానంతో కూడి ఉన్నది. ఇంద్రపదవికి రాక్షసులు రాలేదా? అలాగే ఇతడు కూడా వచ్చాడు. పుణ్యం చేసి వచ్చినా కూడా అతడిలో అజ్ఞానం ఉంది. కాబట్టి అతడి చేత పాపం చేయించినప్పుడే అతడి తపస్సు క్షీణిస్తుంది. అప్పుడు అతణ్ణి వెనక్కు పంపవచ్చు. ఒక పని చెయ్యి. లేకపోతే వాడు నిన్ను అవమానించవచ్చు. సరే అని చెప్పి కబురు




చెయ్యి. మహర్షులు మోసేటటువంటి పల్లకిలో నా దగ్గరికి వస్తే, నిన్ను నేను వరిస్తాను అని కబురు చెయ్యి'' అన్నాడు. ఆమె అలా చేసింది.

నహుషుడు అప్పుడు సప్తర్షులను పిలిపించి ''శచీదేవి నన్ను వరిస్తుంది. నేను శాశ్వత ఇంద్రుణ్ణి. మీరు నన్ను పల్లకీలో కూర్చోబెట్టుకుని మోసుకుని తీసుకెళ్ళండి'' అని ఆజ్ఞాపించాడు. ఇంద్రపదవిలో ఉన్న సమయంలో అతడి ఆజ్ఞను ఎవరైనా శిరసా వహిస్తారు. ఋషులు కూడా ఆ ధర్మాన్ని పాటించి, ''నువ్వు ఇంద్రపదవిలో కూర్చుని మాట్లాడుతున్నావు కాబట్టి అలాగే చేస్తాం'' అన్నారు.

సప్తర్షులు పల్లకీ తెప్పించి, అతణ్ణి అందులో కూర్చోబెట్టి శచీదేవి మందిరానికి తీసుకుని వెళుతున్నారు. అతడికి, అప్పటికప్పుడే సంపాదించిన పుణ్యంలో నిల్వ చాలా తరిగిపోయింది. మోసేవాళ్ళు సప్తర్షులు. వాడికి మతి కుదురు పోయింది. శచీదేవి జ్ఞాపకం వచ్చింది. చప్పున వెళ్ళాలనిపించింది. పల్లకీ మోసే సప్తర్షులలో, అగస్త్యమహర్షి ముందు ఉన్నాడు. ''సర్ప సర్ప'' అని ఆయనను కర్రతో పొడిచాడు నహుషుడు. 'సర్ప' అంటే 'తొందరగా' అని అర్థం. (పాముకు సర్పం అనే పేరు ఉంది. వేగంగా కదులుతుంది కాబట్టి).

అప్పుడు అగస్త్యుడు అతడితో, ''నీ పుణ్యం ఇప్పటితో అయిపోయింది. సర్పమై భూలోకంలో పడి ఉండు'' అని శపించాడు. అలా అగస్త్యమహర్షి చేత శపించబడి ఆ నహుషుడు, భూలోకంలో మహా భయంకరమైన సర్పంగా మారిపోయి, అడవిలోని చీకటి గుహలో భయంకరమైన చోట పడ్డాడు.

ఎక్కడి దేవేంద్ర పదవి? ఎక్కడి భూలోకం? భూలోకంలోనూ పట్టణం కాదు, అడవి. ఆ అడవిలోనూ సర్పమై కొండగుహలో పడ్డాడు. నహుషుడికి సుజ్ఞానం ఎప్పుడైతే కలుగుతుందో, అప్పుడే ఆ శాపం వదిలిపెడుతుంది. అది ధర్మసూక్ష్మం. ధర్మమనేటటువంటి జ్ఞానం ఎప్పుడు కలుగుతుందో అప్పుడు అతడు అందులోంచి బయటకు వస్తాడు. కాబట్టి తరువాత ద్వాపరయుగంలో ధర్మదేవత యొక్క అంశలో పుట్టిన, ధర్మసూక్ష్మాలు తెలిసిన ధర్మరాజు యొక్క దర్శనంతో, ఆయనతో సంభాషణం చేయటం చేత ధర్మజ్ఞానం కలిగి వాడికి ఆ సర్పరూపం పోయింది.

ఆ నహుషుణ్ణి అంత భయంకరంగా శిక్షించగలిగిన తపోబలం కలవాడు అగస్త్యమహర్షి. 'సర్ప సర్ప' అంటూ కాలితో తన్నాడని అరణ్య పర్వంలో ఉందని ఒక అభిప్రాయం. కాలితో తన్నటానికి గల కారణం, మరొక వాదం ప్రకారం ఏమిటంటే – ఆ మోసేటటువంటి బ్రాహ్మణులతో నహుషుడు, వేదంలోని భాగాలను గురించి చర్చ చేశాడని; ఒకానొక ధర్మ విషయంలో, గోవులను సంప్రోక్షణం చేసే మంత్రములు బ్రాహ్మణములలో కొన్ని ఉండగా, ఆ మంత్రాలు ప్రమాణములే కావు అని వాదించి, వాళ్ళను, ''మీకేమీ తెలియదు, మూర్ఖులు మీరు'' అన్నాడట. అప్పుడు అగస్త్యుడు, ''నీవు మూర్ఖుడివలె మాట్లాడుతున్నావు. అది ప్రమాణం. ఆ మంత్రములు బ్రహ్మ వాక్కులు'' అని అంటే; ''నాకే ఎదురు చెప్తావా?'' అని కాలితో తన్నాడని, అందుకు అగస్త్యుడు శపిస్తే కింద పడ్డాడని పాఠాంతరము.

అగస్త్యుడి మహత్తు తెలియజేసే కథ మరొకటి ఉంది. ఆయన 12 సంవత్సరముల పాటు ఒక యజ్ఞం చేశాడట. ఆ యజ్ఞాన్ని చేస్తున్న సమయంలో అనేకమంది మహర్షులు, మునులు వచ్చి సమస్త వేదములతో యజ్ఞాన్ని నిర్విఘ్నంగా, వైభవంగా నడిపించారు. అయితే ఏ కారణం చేతనో ఆ 12 సంవత్సరాల కాలంలో, ఇంద్రుడు మాత్రం వర్షించలేదు. యజ్ఞం జరుగుతూ ఉండగా, లోకోపద్రవంగా తుఫాను రాకూడదు. వర్షం మాత్రం పడాలి. అది కూడా ప్రసన్నంగా, నాజూకుగా వర్షం పడటం యజ్ఞానికి శుభ సూచన. యజ్ఞాన్ని, పాకలను లేవగొట్టేటటువంటి వర్షం కురవటం శుభం కాదు. సాత్త్వికంగా ఉండాలి ఆ వర్షం.

అగస్త్యమహర్షి యజ్ఞం చేయటమేమిటి? దేవేంద్రుడు

వర్షించకుండా ఉండడమేమిటి? అటువంటిది, వర్షం లేక ఆ చుట్టుప్రక్కల ఓషధులు, వనస్పతులు అన్నీ వాడిపోయి, ఎండిపోయాయి. ఓషధులు లేకపోతే అన్నదానం చేయటం సాధ్యం కాదు. యజ్ఞానికి వచ్చిన వారందరూ భోజనం చేసి వెళ్ళడం ముఖ్యం. యజ్ఞంలో మంత్ర స్వాహాకారం ఎంత ముఖ్యమో, అందరికీ భోజనం పెట్టడం అంత ముఖ్యం. అలా జరగకపోతే యజ్ఞం నిష్ఫలమయిపోతుంది. అందరినీ పిలిచి ఆదరించి అన్నం పెట్టవలసిన బాధ్యత యజ్ఞం చేసేవాడికి ఉంటుంది. అక్కడ ఎవరికీ వివక్షత ఉండకూడదు. ఎవరొచ్చి ఏమి అడిగినా కూడా అందరినీ యజ్ఞపురుషుడితో సమానంగా గౌరవించి, భోజనం పెట్టడం సంప్రదాయం.

12 సంవత్సరములు వర్షమే లేకపోతే అగస్త్యమహర్షి అన్నం ఎక్కడ నుంచి పెడతాడు? పంటలు ఎలా పండుతాయి? ఇక మనకు గ్రాసం దొరికే అవకాశం లేదని అందరూ సంశయించడం



మొదలుపెట్టారు. ''రేపు సాయంకాలం లోపల దేవేంద్రుడు మంచి వర్షం ఇవ్వకపోతే నేను స్వయంగా వెళ్ళి నా తపోబలంతో ఇంద్రపదవిని అధిష్ఠించి, ఆయన అధికారాలు నేను చేతిలో పుచ్చుకుని, భూలోకానికి సువృష్టిని ఇస్తాను. రేపు సాయంకాలం దాకా గడువు ఇస్తున్నాను'' అని అన్నాడు అగస్త్యుడు. అంటే అప్పుడు కూడా, ఉన్న బలాన్నే వాడుకుంటాడన్నమాట. కానీ తపస్సు చేత వర్షాన్ని సృష్టించడట.

అప్పుడు యజ్ఞానికి వచ్చిన మునులందరూ, ''మాకు తపస్సులు ఉన్నాయి. మా భోజనం కోసం మీ వంటి మహాత్ములు ఈ లోకాన్ని వదిలిపెట్టి ఇంద్రలోకానికి వెళ్ళి అంత శ్రమపడాలా? మేము ఎలాగో మా మంత్రశక్తితో వర్షాన్ని రప్పించుకుంటాము. వర్షం ఎందుకు రావటం లేదు అని ఆదుర్దాగా అడిగాము కాని, సందేహం చేత కాదు. మీరు ఎలాగూ మాకు భోజనం పెడతారు'' అని అన్నారట. అలాగ వాళ్ళు వర్షం కోసం వరుణ దేవుణ్ణి స్తోత్రం చేసి, ఆహారం కోసం వాళ్ళ ప్రయత్నం వాళ్ళు మొదలుపెట్టారట.

ఒక ప్రక్కన ఋత్విక్కులను, యజ్ఞం నడిపించేవాళ్ళను సేవించవలసిన ధర్మం యజమానికి ఉంది. వాళ్ళ భోజనాదులు ఎలా కావాలో అలా చూడవలసిన బాధ్యత అతడికి ఉంటుంది. అలాంటిది, వాళ్ళకు యజమాని అన్నం పెట్టకపోవటం, వాళ్ళ అన్నం కోసం వాళ్ళే తిప్పలు పడటం యజ్ఞానికి చాలా అవమానకరం కదా! అగస్త్యుడికి కోపం వస్తుందేమోనని భయం వేసి, ఇంద్రుడు బృహస్పతితో సహా వచ్చి ఆయన కాళ్ళ మీద పడి ''మహర్షీ! నా చేత అపరాధం జరిగింది. మీ శక్తి ఎట్లాంటిదో చూద్దామనే చాపల్యం చేత ఇలాంటి పని చేశాను. మీ ఋత్విక్కులకు, ప్రజలకు – అందరికీ సుభిక్షంగా కావలసినవన్నీ సమగ్రంగా నేనిస్తాను'' అన్నాడు. వెంటనే సువృష్టిని ఇచ్చి, సద్యః ఫలాన్ని – అప్పటికప్పుడు మొలిచే ధాన్యమైన శక్తివంతములైన బీజములను ఇంద్రుడు సృష్టించి, అన్నం ఇచ్చాడట ఆయనకు భయపడి. అగస్త్యుడు ఏమీ క్రోధం లేకుండా, ఇంద్రుణ్ణి సన్మానించి ''నీకు స్వాహాకారాలిచ్చి నేను యజ్ఞం చేయాలి కదా. సాక్షాత్తు నువ్వే వస్తే నేనేమి అనగలను? నీ అపరాధాన్ని లెక్కచేయను'' అని చెప్పి, ఇంద్రుడిని, వరుణుడిని, బృహస్పతిని సన్మానించి పంపివేశాడు. అంతటి శాంతమూర్తి అగస్త్యుడు.

పూర్వం వింధ్యపర్వతం విపరీతంగా పెరిగిపోవటం మొదలుపెట్టింది. ఇప్పుడు కూడా హిమాలయాలు పెరుగుతున్నాయని ఆధునిక శాస్త్రవేత్తలు అంటున్నారు. దానికి భౌగోళిక కారణాలు చాలా ఉన్నాయి. వింధ్య పెరగడం



విషయంలో ఒక చమత్కారమైన కథ ఉంది. సూర్యుడు ఒకప్పుడు మేరుపర్వతం చుట్టూ తిరుగుతుంటే, నా చుట్టూ ఎందుకు తిరగటం లేదని వింధ్య పర్వతానికి కోపం వచ్చిందట. ఇది ప్రతీకాత్మకమైన వర్ణనగా అర్థం చేసుకోవాలి మనం. అలా వింధ్యపర్వతం పెరుగుతూ ఉంటే, దేవతలందరూ అగస్త్యుడి వద్దకే వెళ్ళి తమను కాపాడమని కోరి, ఆయనతో ''భారతదేశంలో దక్షిణాపథానికి, ఉత్తర దేశానికి సంబంధం లేకుండా గోడలాగా వింధ్యపర్వతం పెరిగిపోతున్నది'' అని మొరపెట్టుకున్నారు. అప్పుడు అగస్త్యుడు ఆ పర్వతం దాటి దక్షిణానికి వెడుతూ వింధ్యపర్వతాన్ని, ''నేను మళ్ళీ వెనుకకు తిరిగి వచ్చేదాకా నువ్వు పెరగకుండా ఇలాగే ఉండు'' అని ఆదేశించాడట. ఆయన మళ్ళీ ఉత్తరానికి రాలేదు. దక్షిణంలోనే ఉండిపోయాడు. దాంతో అది పెరగటం మానివేసింది. ఇది ఆయన మహత్తుకొక నిదర్శనం.

శ్రీనాథుడు తన 'కాశీఖండం'లో అగస్త్యమహర్షిని ప్రస్తుతించాడు.

**'పంచాక్షరీ మంత్ర పారాయణమునకు**
**నెవ్వాని మానసం బేడుగడయు...'**

(నిరంతరమూ పంచాక్షరీ మంత్రము ఆయన మనస్సులో అలా ఉంటూనే ఉంటుంది. నేలలో వృక్షంలా పెరుగుతూనే ఉంటుంది).

**'దర్పోద్ధతులగు వాతాపీల్వలులకును**
**వధశిలాస్థాన మెవ్వానికుక్షి...'**

**(ఆయన కడుపు వాతాపి, ఇల్వలులకు వధ్యశిల).**

**'ఆదినెవ్వాని దివ్యావతారమునకు**
**బూర్ణంబు భాండంబు పురిటి ఇల్లు**
**మెరసి లోపాముద్ర మెరుగు బాలిండ్లపై**
**బవళించు నెవ్వాని భవ్యమూర్తి**
**కసరి ఎవ్వాని కంఠహుంకారరవము**
**కొండచిలువల కులములో గూల్చె నహుషు...**
**నట్టి పరమ మహాతేజు నలఘుతేజు**
**వెదకిరానందవనములో విబుధమునులు'**

-ఆనందవనం అంటే కాశీ. కాశీలో మునులు, ఈయన కాశీలోనే ఎక్కడో ఉండి ఉంటాడని చెప్పి వెతుక్కుంటూ వచ్చారట! అగస్త్య మహర్షిని అలా వెతుక్కుంటూ వచ్చి ఆయన ఆశ్రమానికి చేరారు.

అక్కడ అనేక జంతువులు వాటి సహజమైన వైరాన్ని మరిచిపోయి దివ్యంగా భవ్యంగా ఆడుకుంటున్నాయి. ఈ ప్రకారంగా ఉన్నటువంటి ఆశ్రమాన్ని చూచారు ఆ మునులు. తరువాత దేవతలు కూడా అక్కడికి వచ్చారు. కాశీలో ఆయన ఆశ్రమాన్ని చూసేసరికి తమ జన్మ పావనమయిందని వాళ్ళందరూ అనుకున్నారు. ఆయన శివధ్యానంలో ఉండి శివస్తోత్రం చేస్తున్నాడట. ఆ స్తోత్రాన్ని దేవతలందరూ విన్నారు. దానివల్ల వాళ్ళు తో శాంతిని పొందారని చెప్పబడింది. అగస్త్యుడు వాళ్ళతో, ''మీరందరూ నన్ను వెతుక్కుంటూ ఎందుకు



వచ్చారు?'' అని అడిగాడట.

దేవగురువైన బృహస్పతి ఆయనతో ఇలా అన్నాడు. ''ఓ మహర్షీ! నీవు ప్రణవమే. ఓం కారమే నీవు. ఈ లోపాముద్రాదేవి వేదరాశి. ఈ లోకంలో తపస్సువే నీవు. నువ్వు తపస్సు చేస్తున్నావని కాదు. తపస్సువే నీవు. తపస్సు వల్ల కలిగే శాంతి ఏదంటే, ఈ లోపాముద్రాదేవే ఆ శాంతి. ఆమె పుణ్యరాశి. సత్క్రియ. తత్ఫలమే నీవు. నీవు సూర్యుడవు. ఈమె ఆ తేజోస్వరూపిణి. ఈమెయే లక్ష్మి. నీయందు బ్రహ్మతేజస్సు ఉంది''. పతివ్రత అంటే (ఇక్కడ చమత్కారం ఏమిటంటే) ఆయన బ్రహ్మతేజస్సు అయితే, ఆమె పతిని అనుసరించేది. అంటే బ్రహ్మను అనుసరిస్తుందని. అంటే బ్రహ్మజ్ఞాన స్వరూపిణి అని అర్థం. పతి బ్రహ్మ వస్తువయితే, దాన్ని అనుసరించే పతివ్రత బ్రహ్మజ్ఞాని అని దేవతల ఉద్దేశ్యం. అదే అందులోని చమత్కారం.

''ఒకేసారి మీ ఇద్దరినీ దర్శనం చేయటం చేత మార్గము – గమ్యము, సత్క్రియ – దాని ఫలము, సూర్యుడు – దాని తేజస్సు; ప్రణవ మూర్తిలో పుట్టిన వేదరాశి – ప్రధానము రెండూ కూడా ఏక కాలమందే మాకు దర్శనమయినవి. మేము ధన్యులమయినాము'' అని బృహస్పతి అన్నాడు.

అప్పుడు వాళ్ళు ఈ వింధ్యపర్వతము యొక్క చరిత్ర ఆయనతో చెప్పారు. ''భూమి చాలా భయంకరమైన స్థితిలో ఉంది. జీవకోటి బ్రతికే ఆస్కారం కనబడటం లేదు. వింధ్యపర్వతం పెరిగిపోతోంది. జీవకోటికి ఏదో భయంకరమైన ఒక పెద్ద ఆపద రాబోతున్నది. దానిని గ్రహించి భూమిని క్షేమకరం చెయ్యవలసింది'' అని ఆయనను అడిగారు వాళ్ళు. ఆయన తక్షణమే ఆ పని చేశాడు.

**-శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**

**(ఇంకా ఉంది)**

# ముక్తికి సోపానం - శ్రీరామ నామం

: చింతలపాటి శివశంకర శాస్త్రి




శ్లో ॥ ''శ్రీ రాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం
ఆజానుబాహుం అరవింద దళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి''

లక్ష్మీ సహితుడైన రాఘవుని, దశరథుని కుమారుడు, అప్రమేయుడు, సీతాపతిని, రఘువంశంలో రత్నదీపంలా ప్రకాశించేవాడిని, రాక్షసులను నశింపచేసిన వానిని, ధర్మమూర్తియైన శ్రీరామచంద్రుడికి నమస్కరించుకుంటున్నాను.

''ధర్మ సంస్థాపనకు ప్రతి యుగంలోనూ నేను పుడుతున్నాను'' అంటాడు గీతాచార్యుడు. ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి, అసత్యానికి సంఘర్షణ జరిగినప్పుడు ధర్మాన్ని నిలబెట్టడానికి, సజ్జనులను సంరక్షించడానికి భగవంతుడు దశావతారాలు ధరించాడు. ప్రతి అవతారానికి ఒక లక్ష్యం ఉంది. ప్రతి ఆకృతికీ ప్రత్యేకత ఉంది. అధర్మ పాలనలో దురాచారాన్ని ప్రబలింప చేస్తున్న రాక్షస సంహారం కోసం నారాయణుడు దాల్చిన అవతారాలలో రామావతారం మహోన్నతమైంది.

యుగాలు నాలుగు. అవి కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం. యుగ యుగాలు గడిచినా రామ శబ్దం నశించక, శ్రీరామ శబ్దంలోని ప్రతి ఒక్క అక్షరం జన్మ జన్మల దుఃఖ రాహిత్యాన్ని, సర్వ పాప కర్మల నుండి విముక్తులను చేస్తుంది. 'రామ' అంటే ''రమణీయ త్వాత్ రామః'' అనగా రమణీయమైనవాడు రాముడు. రమణీయం అంటే అందం. క్షణ క్షణానికీ నిత్యనూతనంగా ఉండే సౌందర్యాన్ని రమణీయమని అంటారు. తన సద్గుణాలచేత ఎల్లరనూ సంతోషింప చేయువాడు కనుక రాముడని పేరు.

అంతేకాకుండా రామ అంటే 'ర-అ-మ' అనే మూడు బీజాక్షరాల సంపుటి. మంత్రశాస్త్రంలో 'ర' అంటే అగ్నిబీజం. అంతరంగాన్ని శుద్ధి చేస్తుంది. 'అ' అంటే సూర్యబీజం. జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. 'మ' అంటే చంద్రబీజం. శాంతి, ఆనందాలనిస్తుంది. రామనామం జపించడం వల్ల ఆ మూడు బీజాక్షరాల శక్తి, శుద్ధి, జ్ఞానం, శాంతి, ఆనందాలు లభిస్తాయి.

మర్యాదా పురుషోత్తముడు, సకల గుణాభిరాముడు, మూర్తీభవించిన ధర్మము ఆయన. కోసల దేశాన్ని పాలించే దశరథునికి, కౌసల్యకు శ్రీరాముడు జన్మించాడు. బ్రహ్మర్షి

వసిష్ఠుడు నామకరణం చేశాడు. ''ఓం నమో నారాయణాయ'' అనే మంత్రం లోంచి 'ర' అనే బీజాక్షరాన్ని, 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రంలోంచి 'మ' అనే బీజాక్షరాన్ని స్వీకరించి 'రామ' అని పేరు పెట్టాడు. ఆ నామమే లోకానికి తారకమంత్రమయింది. ''రకారో బ్రహ్మ వాచకః మకారో జీవ సంజ్ఞకః'' ర కారం బ్రహ్మను సూచిస్తుంది. మ కారం జీవుణ్ణి సూచిస్తుంది. జీవేశుల మాదిరిగా 'రామ' లోని ఆ రెండు బీజాక్షరాలకు అవినాభావ సంబంధముంది.

"లోకాభిరామం రణరంగధీరం రాజీవనేత్రం రఘువంశ నాథమ్
కారుణ్యరూపం కరుణాకరం తం శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే"

మానవ రూపంలో అవతరించిన దేవుడు రాముడు. మానవజాతికి ఆదర్శప్రాయుడు.

రామనామం కలియుగ కల్పవృక్షం. అందరి కోరికలను తీర్చి ఆనందాన్ని అందిస్తుంది. కలకండ, పంచదార, చెరుకురసం కంటే రామనామం తియ్యగా ఉంటుంది. రుచిగా కూడా ఉంటుంది. 'రామ నామమే మేలు – రామ చింతనే చాలు' అన్నాడు త్యాగరాజస్వామి. దశరథ నందనుడైన శ్రీరామ చంద్రుని లోకమంతా కీర్తిస్తుంటే, నేను మాత్రం రామనామంలోని అంతరార్థాన్ని, మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నాను అన్నాడు కబీరుదాసు. జనన – మరణ భయాలను దూరం చేసే రామ రసాన్ని తనివితీరా తాగండని ప్రబోధించాడు సదాశివ బ్రహ్మేంద్రయోగి.

శ్రీరామచంద్రమూర్తి చైత్రశుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రాన, నాలుగవ పాదాన, కర్కాటక లగ్నంలో మధ్యాహ్న సమయాన శ్రీమహావిష్ణువు అవతారంగా జన్మించాడు. రాముడు పుట్టిన రోజునే శ్రీరామ కళ్యాణోత్సవాన్ని జరుపుకుంటారు. అవతార పురుషుడు శ్రీరాముడు ఈ లోకాన అవతరించడమే మంగళప్రదం; ఆనంద దాయకమైన ఈ రోజున లోక కళ్యాణాన్ని ఉద్దేశించి సీతారాముల కళ్యాణోత్సవం జరపాలని పెద్దలు నిర్ణయించారు.

శ్రీరాముడు మర్యాదా పురుషోత్తముడు. సీతామనోభిరాముడు, సత్యసంధుడు, ప్రజారంజకుడు, ఆజానుబాహుడు, ధర్మపరిపాలకుడు, సర్వజన మనోభిరాముడు. అందువలననే ఆయన రాజ్యం సుపరిపాలన, దక్షత కలిగి రామరాజ్యంగా విలసిల్లింది. సుసంపన్నమైన, ఆనందమయమైన రాజ్యం రామరాజ్యం. ఆ రాజ్యంలో ప్రజలు ధర్మబద్ధమైన జీవితాలను గడిపేవారు. సమస్త జీవరాశులకు కూడా సమన్యాయం లభించేది.

వాల్మీకి మహర్షి 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నాడు. శ్రీరాముడు పురాణ పురుషుడు. ధర్మమును తాను చెప్పడమే కాక ఆచరించి చెప్పినవాడు. ధర్మమే తానుగా, తానే ధర్మంగా నడచి చూపిన ధార్మిక ప్రభువు. ఆనందరూపుడు, పూర్ణుడు, లోక రమణుడైనందువలన రాముడు అన్నారు. ఇతనికి అనుపమానమైన నామాలెన్నో కలవు. అయినా ఏ పరమానంద సింధు బిందు మాత్రాన ముల్లోకాలు ఆనంద పరవశమౌతాయో, ఆ అఖిల లోక కళ్యాణ కారకుడు, సుఖదాముడు, శ్రీరాముడు జగదానందకారకుడు. కుమారునిగా, సోదరునిగా, రాజుగా, భర్తగా, మిత్రునిగా, ప్రజా సేవకునిగా అన్ని అంశాలలో ఆనంద, ఆదర్శ పురుషుడై, సకల మానవ జాతికి ఆరాధ్య దైవంగా నిలిచాడు.

ధర్మం కొరకు సర్వాన్ని త్యాగం చేయగలవాడే ప్రభువు. ధర్మ సంస్థాపన కోసమే తన జీవితమంతా తపించిన వాడు శ్రీరాముడు. బంధువులతో, స్నేహితులతో, తమ్ముళ్ళతో, శత్రువులతో, జంతువులతో, ఆటవికులతో సత్యస్ఫూర్తితోనే పాలన చేశాడు. కాబట్టి అంత గొప్ప వ్యక్తి నామాన్ని జపించడం వలన మనసుకు సాంత్వన కలుగుతుంది. శరీర పోషణకు ఆహారం, మనసుకు రామనామ సంకీర్తనం అవసరం.

వాల్మీకి జీవితం రామనామ మహిమకు చక్కని నిదర్శనం. కిరాతకునిగా ఉన్న సమయాన తన దగ్గరకు గాలి తరంగంలా వచ్చిన నారదమహర్షి ఉపదేశంతో రామనామాన్ని జపిస్తూ ఘోర తపమాచరించాడు. కొన్నాళ్ళకు అతని చుట్టూ పుట్టలాగా ఏర్పడగా (వల్మీకం) అందులో నుండి వెలుపలకు వచ్చి వాల్మీకిగా మారి రామాయణాన్ని రచించి లోకానికి అందించాడు. రామ కథను రచిస్తూ తన వద్దకు వచ్చిన నారదాది మహర్షులను చూసి –

"కోన్వస్మిన్ సంప్రతంలోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్ ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ"

అంటూ పదహారు లక్షణాలు చెప్పి ఇవన్నీ కలిగినవాడు మీ ఎరుకలో ఎవరైనా ఉన్నారా? అని అడుగగా వారంతా ముక్తకంఠంతో దశరథ రాముని గురించి తెలియచేశారు. ఆ పదహారు లక్షణాలు పరమేశ్వర కళలని, శివశక్తి కళలని – ఆ గుణాలన్నీ కౌసల్య రామునిలో ఉన్నాయని తెలియజేశాను. ఆ పదహారు కళలను దాల్చినవాడు (లేదా) కలిగినవాడు శ్రీరాముడు. షోడశ కళావిభావంతో విరాజిల్లే కళాప్రపూర్ణుడు – శ్రీరామచంద్రుడు అని నొక్కి వక్కాణించారు. మహర్షుల రచనామృతమును గ్రోలి రామకథను రచించి జగద్విఖ్యాతుడయ్యాడు వాల్మీకి.

''ఆపదామప హర్తారం దాతారం సర్వసంపదాం
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం''

ఆపదలను పోగొట్టేవాడు, సర్వసంపదలను ఇచ్చేవాడు, లోకాభిరాముడు అయిన శ్రీరామునికి మాటి మాటికీ నమస్కరిస్తున్నాను అని పై శ్లోకానికి అర్థం – శ్రీరాముడు త్రికరణశుద్ధిగా తనను నమ్ముకున్న వారిని తాదాత్మ్యముతో స్మరించిన వారిని ఆపదల నుండి కాపాడి సంపదలను ఇస్తాడని దృఢ విశ్వాసం యుగ యుగాలుగా మానవ జాతిలో

వేళ్ళూనుకుంది. అందువలననే ప్రజలందరూ ప్రభువుగా కాకుండా, తమ వానిగా భావించి తరించారు.

రామనామ మహిమ అపారం – రామ మంత్రశక్తి అప్రమేయం. కళ్యాణ గుణ రాముని మనసారా కీర్తించిన వారంతా తరించారు. వసిష్ఠ విశ్వామిత్రులే కాకుండా మారీచుడు సైతం రాముని గుణ గణాలను మెచ్చుకున్నాడు. సీతాపహరణానికి సాయపడమని రావణుడు కోరినప్పుడు ''ఓ ప్రభూ! నిన్ను స్తుతిస్తూ పొగడ్తలతో ముంచెత్తేవారు ఎక్కడైనా, ఎప్పుడైనా దొరుకుతారు. కాని అప్రియమైనా హితవచనాలు చెప్పేవారు అరుదుగా లభిస్తారు. రాముడంటే సత్య పరాక్రమవంతుడు. రాముడు బాలుడిగా ఉన్నప్పుడు విశ్వామిత్రుని యాగ సంరక్షణ కోసం వచ్చి నన్ను చావుదెబ్బ కొట్టాడు. ఆ దెబ్బలను ఇప్పటికీ మర్చిపోలేదు. మొన్నటికి మొన్న దండకారణ్యంలో మరోసారి ఆయన చేతిలో దెబ్బ తిన్నాను. అప్పటినుండి నాకు నిద్రలో, కలలో కూడా రాముడు కనిపిస్తున్నాడు. ఇప్పుడు నువ్వు సాయపడటానికి రా అని పిలిచినప్పుడు కూడా రాముడు గుర్తొచ్చి ఉలిక్కిపడుతున్నాను'' అన్నాడు. 'రా' అనే అక్షరం వినిపించినప్పుడల్లా రాముడు గుర్తొస్తున్నాడంటే మారీచుడు ఎంతటి భాగ్యవంతుడో అనిపిస్తుంది. అది పురాకృత సుకృత విశేషం. 'రామ' అనే రెండక్షరాలు బీజాక్షరాలు. వాటి శక్తి అపరిమితం. అమోఘం. 'రామ' అనే రెండక్షరాలు రాస్తే బండరాళ్ళు సైతం సముద్రంపై తేలి వారధిగా నిలిచాయి.

''శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే''

రామ రామ రామ అని మూడు సార్లు పలికితే అది వెయ్యి నామాలతో విష్ణువును స్తుతించిన పుణ్యం వస్తుందని సాక్షాత్తు పరమశివుడు పార్వతీదేవితో చెప్పాడంటే రామనామం ఎంత గొప్పదో వేరే చెప్పనక్కరలేదు. అందువలననే వాగ్గేయకారులు రామనామం పలకడంలోని మాధుర్యాన్ని అనుభూతి చేసుకొని, ఆ మాధుర్యాన్ని ఆస్వాదించి ఆనందిస్తూ ''ఓ రామ శ్రీరామ నీ నామమెంతో రుచిరా'' అని పలవరించారు. కాశీ క్షేత్రంలో మరణించినవారికి విశ్వనాథుడు రామ మంత్రాన్ని స్వయంగా ఉపదేశిస్తాడట. అందుకే వారందరికీ ముక్తి లభిస్తోందని పురాణాలు చెబుతున్నాయి.

శ్రీరామ నామం శుచి, రుచి, కృషి వైభవాన్ని కల్గిస్తుంది. మనిషిని మనీషిగా తీర్చ దిద్దుతుంది. మనుగను మలుపులు తిప్పుతుంది. జీవితాలను ధన్యత గావిస్తుంది.

**సర్వేజనాః సుఖినో భవంతు**

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుచుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

# శ్రీ సీతారాముల కళ్యాణ అక్షతలు

## [తలంబ్రాలు]

– డా॥ మునిపల్లె బాలసుబ్రహ్మణ్య శర్మ



క్షతము కానిది అక్షతము. అంటే నశించనిది అని అర్థము. వివాహ సమయంలో చేసుకునే వేడుకలలో తలంబ్రాలు ఒకటిగా మారాయి. కాని తలంబ్రాల వెనుక ఉన్న భారతీయ సదాచారము, సాంప్రదాయాలలో అక్షతలు ఎంతో పవిత్రంగా ఆరాధింపబడుతున్నాయి. ఎలాగంటే – పెద్దలు చిన్నవారిని ఆశీర్వదించేటప్పుడు తలపై అక్షతలు ఉంచుతారు (వేస్తారు అనకూడదు). అలానే భగవంతుని పూజించేటప్పుడు భక్తితో భగవంతుని పాదాల వద్ద అక్షతలు సమర్పిస్తాము.

ఈ అక్షతలను వివిధ సందర్భాలలో ఏ విధంగా ఉపయోగించి ఎలాంటి కోరికలు కోరుకుని ఫలితాలు పొందుతున్నామో ప్రామాణికంగా తెలుసుకుందాం. ముందుగా విఘ్నేశ్వరుని ఐశ్వర్య ప్రాప్తి కొరకు –

శ్లో ॥ "గజానన నమస్తేఽస్తు అక్షతైశ్వర్య దాయక।
రత్నాక్షతా మయాదత్తాః స్వీ కురుష్వ హరాత్మజ" ॥

ఓ శివపుత్రుడవైన విఘ్నేశ్వరా! రత్నములతో కూడిన అక్షతలను నేను నీకు సమర్పిస్తున్నాను. వీటిని స్వీకరించి నశించని సంపదలనిచ్చి నన్ను అనుగ్రహింపుమని ప్రార్థిస్తున్నాను – అని అక్షతలు సమర్పిస్తాము.

అలానే తులసి పూజలో –

శ్లో ॥ "అక్షతాశ్చ మహాదేవి తులసి భాగ్యదాయికే।
అర్పయామి సదా భక్త్యా సుఖ సంతతి లబ్ధయే" ॥

భాగ్యదాయినివైన ఓ తులసి మహాదేవీ! నేను నీకు భక్తితో సమర్పించే అక్షతలతో సుఖ సంతానమును అనుగ్రహింపుము.

ఇలా ఎన్నో రకాలుగా అక్షతలను సమర్పిస్తూ మనం ప్రయోజనాలను పొందుతున్నాము.

వివాహ సమయంలో అక్షతలను పెద్దల చేతికి అందించేటప్పుడు మంగళప్రదములైన వేదమంత్రములతో పూజింపబడిన మాంగల్య సహితముగా తాకిస్తూ ఇస్తారు.

ఎందుచేతనంటే ఆ మాంగల్యమునకు ఆపాదించబడిన (ఆవాహన చేయబడిన) మంత్రశక్తి వలన మంచి మనస్సు కలవారి తపశ్శక్తి మాత్రమే ఆ మాంగల్యమును చేరి, దురాలోచనపరుల చెడు ఆ మాంగల్యమును చేరదు. పూజింపబడిన అక్షతల శక్తి, మాంగల్యశక్తి ఆ నూతన వధూవరుల జీవితమును సుఖవంతం చేయగలుగుతుంది.

వివాహ సమయంలో పెద్దలచే ఆశీర్వాద పూర్వకముగా తలపై ఉంచబడేవి అక్షతలు.

వివాహం చేసుకునే వధూవరులు ఒకరి తలపై ఒకరు ఉంచుకునే అక్షతలు తలంబ్రాలు. ఇవి తండులాలలో అనగా బియ్యములో శ్రేష్ఠమైనవి మాత్రమే ఎంచుకోవాలి. అంటే విరిగినవి, నలిగినవి కాకుండా చూచుకోవాలి. నిండుగా ఉన్న గింజలనే తీసుకోవాలి. వాటిలో మంగళ ద్రవ్యములైన ఆవునేయి, ఆవుపాలు ఉపయోగించి, పసుపు కూడా కలిపి అక్షతలను (తలంబ్రాలను) తయారు చేసుకోవాలి. నవధాన్యాలలో బియ్యం చంద్రునికి సంబంధించిన ధాన్యం. చంద్రుడు మనస్సుకు, బుద్ధికి కారకుడు. పసుపు శుభ సూచకం.


ఈ తలంబ్రాలను వధూవరులు ఒకరి తలపై ఒకరు ఉంచుకునేటప్పుడు వారి ఇద్దరి జీవితం ఒక్కటే అయింది గదా! అందుకని వారిద్దరి చేత చేయబడే పుణ్యం వర్ధిల్లాలని, శాంతి కలగాలని, సుఖసంతోషాలతో ఉండాలని, ఆయుష్షు, ఆరోగ్యం ఇలా అన్నీ తమకు అనుకూలంగా ఉండాలని మంత్రాలను చదువుచుండగా జరుపుకుంటారు. అంటే ఇంత గొప్ప సంస్కారం భారతీయ వివాహ వ్యవస్థలో దాగి ఉన్నదన్నమాట.

ఇప్పుడు శ్రీ సీతారాముల కళ్యాణ ఘట్టంలోని తలంబ్రాలను గురించి తెలుసుకుందాం.

శ్లో॥ ''జానక్యాః కమలాంజలియాః పద్మరాగాయితా
న్యస్తా రాఘవమస్తకే తు విలసత్కుంద ప్రసూనాయితాః।
స్రస్తా శ్యామల కాయ కాంతి కలితాయా ఇంద్రనీలాయితాః
ముక్తాస్తా శ్శుభదా భవంతు భవతాం శ్రీరామ వైవాహికాః॥

- **శ్రీరామ కర్ణామృతము**

సాక్షాత్తూ విష్ణువే శ్రీరామచంద్రుడు. విష్ణుపత్నియైన లక్ష్మీదేవియే సీతమ్మ. సీతమ్మ యొక్క ఎర్రనైన దోసిలితో శ్రీరాముని తలపై ఉంచుటకు ముత్యాల తలంబ్రాలు తీసుకోగా ఆ తెల్లనైన ముత్యాలు సీతమ్మ చేతుల ఎర్రదనానికి పద్మరాగ మణులలాగా ప్రకాశించాయట. మరి ఆ తలంబ్రాలు శ్రీరాముని తలపై గదా సీతమ్మ ఉంచింది. అప్పుడు పద్మరాగమణుల లాగా ప్రకాశించే ఆ ముత్యాలు శ్రీరాముని తలను చేరగానే (తలపైనున్న నల్లని తలవెంట్రుకల మీద) మల్లెపూల లాగా ప్రకాశించాయట. ఆ తలంబ్రాలు తలపై నుండి జారుతూ నీలమేఘశ్యాముడైన శ్రీరాముని శరీరకాంతిని పొంది ఇంద్రనీల మణులలాగా ప్రకాశించాయట. అటువంటి ముత్యాల తలంబ్రాలు మీకు శుభమును కలిగించుగాక అని చెప్పిన పై శ్లోకాన్ని ధ్యానం చేసుకుంటూ అప్పుడు జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవమును శ్రీరామనవమి నాడు మనము కూడా నిర్వహించుకుని తాదాత్మ్యము చెందుచూ భగవంతునికి కళ్యాణ అక్షతలను సమర్పించి, కళ్యాణమైన తరువాత భగవదనుగ్రహ రూపమైన ఆ అక్షతలను మనం కూడా శిరస్సుపై ఉంచుకుని – అంతేకాదు వాటితో మరికొన్ని అక్షతలను కలిపి కళ్యాణమును చూడలేకపోయిన మన బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఇంకా ఎందరెందరికో పంచి, మన మనస్సులను భగవంతునికి అర్పించుకుని, శిరస్సు వంచి నమస్కరించి శ్రీ సీతారాముల అనుగ్రహానికి పాత్రులమవుదాము.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 99వ కళ్యాణం

ఇది తేది 01-02-2026, ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది మాదాపూర్, దుర్గం చెరువు రోడ్ లోని అప్సైర్ అపార్ట్మెంట్స్, క్లబ్ హౌస్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ ఎం.కె.శ్రీనివాస్, రత్నావతి దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, అత్యంత వైభవంగా జరిగింది.

## 100వ కళ్యాణం

ఇది తేది 08-02-2026 ఆదివారం ఉదయ 10.30 గంటల నుండి జరిగింది. ఎ.ఎస్.రావు నగర్, సికింద్రాబాద్ లోని కైజన్ జూనియర్ కళాశాలలో జరిగింది. దీనిని కైజన్ జూనియర్ కళాశాల యాజమాని శ్రీమాన్ శ్రీనివాస్ గారు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, వేదపఠనంతో అంగరంగ వైభోగంగా జరిగింది.



# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు



### 398. వివిధారిచ్ఛలోద్విగ్న బ్రాహ్మణేషు దయాపరాయ నమః

పలు విధములుగ శత్రు మాయల చేత భయపెట్టబడిన బ్రాహ్మణుల యందు మిక్కిలి దయ గలవాడు కృష్ణుడు. వివిధారిచ్ఛలోద్విగ్న బ్రాహ్మణులపై దయా పరుడైన కృష్ణుని అవతారమగు వేంకటేశునకు నమస్కారము.

### 399. జరాసంధ బలద్వేషిణే నమః

జరాసంధుని (కంసుని మామ) బలమును ద్వేషించినవాడు కృష్ణుడు. ఉపాయముతో భీముని చేత జరాసంధుని కృష్ణుడు చంపించినాడు.

ఒకనాడు కృష్ణుడు, భీమార్జునులు ముగ్గురు బ్రాహ్మణ వేషధారులై ఆతిథ్యవేళ జరాసంధుని వద్దకు వెళ్ళిరి. బ్రాహ్మణ భక్తుడైన జరాసంధుడు వారికి ఆతిథ్యమిచ్చి వారి కోరిక ఏమి? అని అడిగినాడు. అంత కృష్ణుడు మేము క్షత్రియులము. మాకు ద్వంద్వ యుద్ధము భిక్షగానిమ్ము అని చెప్పి పిమ్మట కృష్ణుడు నేను నీ శత్రువైన కృష్ణుడ, ఇతడు భీముడు. ఇతడు అర్జునుడు అని చెప్పినాడు. అంతట జరాసంధుడు వారి సమ బలశాలియైన భీమునితో ద్వంద్వ యుద్ధము చేయ నిశ్చయించినాడు.

పిమ్మట జరాసంధుడు భీమునికి పెద్ద గదను ఇచ్చి, తాను వేరొక పెద్ద గదను తీసికొని యుద్ధము చేయుటకై పురము వెలుపల ఉన్న మల్లయుద్ధ రంగమునకు చేరినారు. భీమ జరాసంధులు గదా యుద్ధము చేయుచుండగా గదలు ధ్వంసమై పోయినవి. అంత వారు ముష్టి యుద్ధము చేయసాగిరి. వారు సమస్కంధులై పోరాడిరి. భీమ జరాసంధులు రాత్రుల యందు మిత్రుల వలె ప్రవర్తించుచు పగటి వేళలలో పోరాడుచుండిరి. వారి ద్వంద్వ యుద్ధము 27 దినములు కొనసాగెను.

28వ నాడు భీముడు కృష్ణునితో నేను జరాసంధుని జయించలేను అని అన్నాడు. అంత వారి ద్వంద్వ యుద్ధము జరుగుచుండగా జరాసంధుని జన్మ రహస్యము తెలిసిన కృష్ణుడు ఒక చెట్టు కొమ్మను రెండుగా చీల్చి అవతల పడవేసి కనుసైగలతో భీమునికి తెలిపినాడు. భీముడు కృష్ణుని అభిప్రాయమును గ్రహించి వెంటనే జరాసంధుని పాదములను గట్టిగా పట్టుకొని అతనిని భూమిపై పడవేసి, జరాసంధుని ఒక కాలుని తన కాలితో అదిమిపెట్టి అతని రెండవ పాదమును గట్టిగా పట్టుకొని చీల్చి అవతల పడవేసినాడు. దానితో జరాసంధుడు మరణించినాడు. కృష్ణార్జునులు భీముని ప్రశంసించారు.

పిమ్మట కృష్ణుడు జరాసంధుని కుమారుడు సహదేవుని మగధ రాజ్యమునకు రాజుగా పట్టాభిషిక్తునిగా చేసినాడు. అనంతరం జరాసంధునిచే కారాగారములో బంధింపబడిన రాజుల నందరినీ విముక్తులను చేసినాడు. జరాసంధ బలద్వేషి అయిన కృష్ణుడు ఉపాయముతో భీముని చేత జరాసంధుని చంపించినాడు. అట్టి కృష్ణుని అవతారమైన వేంకటేశునకు నమస్కారము.

### 400. కేశి దైత్య భయంకరాయ నమః

కంసుని ఆదేశమున అశ్వరూపధారియై వధింపవచ్చిన కేశి అను రాక్షసునికి భయము కల్గించినవాడు కృష్ణుడు. రాక్షసుడగు కేశిని సంహరించుట వలన కృష్ణునకు కేశవుడు అను పేరు కలిగింది.

శ్లో ॥ క ఇతి బ్రహ్మణో నామ, ఈశోఽహం సర్వ దేహినాం
అవాంతరాంశే సంభూతే తస్మా త్కేశవ నామవాన్


క అనగా బ్రహ్మ. ఈశ అనగా శివుడు. వీరిరువురు విష్ణుదేవుని శరీరము నుండి జన్మించారు. విష్ణువు నాభి కమలము నుండి బ్రహ్మ, లలాటము నుండి శివుడు జన్మించారని హరివంశము తెలుపుచున్నది. కనుక విష్ణువు బ్రహ్మ రుద్రాది దేవతల కంటె అధికుడు అగుటచే కేశవుడు అని కీర్తింపబడినాడు. ఇట్లు కేశవ శబ్దమునకు పండితులు పలు రీతులలో వ్యుత్పత్తులను తెలిపి యున్నారు.

కశ్చ అశ్చ ఈశశ్చ త్రిమూర్తయః కేశాః
తే యద్వశే వర్తంతే స కేశవః

క = బ్రహ్మ, అ = విష్ణువు, ఈశ = శివుడు. ఈ ముగ్గురు ఎవరి వశవర్తులో ఆ పరమాత్మ =

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**







**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

నారాయణుడు – కేశవుడు.

'నారాయణాత్ బ్రహ్మా జాయతే, నారాయణాత్ రుద్రో జాయతే' అని అధర్వణ వేదము విష్ణు పారమ్యమును స్తుతించింది.

కపదంబున బ్రహ్మయు ఈ
శ పదంబున నేను బరగి జన్మింపగా నీ
కుప గీతము కేశవ పదము

అని నాచన సోముని ఉత్తర హరివంశములో విష్ణు స్తుతి కలదు.

స్వామీ! నీవు బ్రహ్మకు, నాకు ఆధారభూతుడవు కదా! అని శివుని మాట.

శ్లో ॥ అంశవో యే ప్రకాశంతే మమ తే కేశ సంజ్ఞకాః
సర్వజ్ఞాః కేశవం తస్మాన్మా మాహుః ద్విజ సత్తమాః - భారతం, శాంతిపర్వం

అను శ్లోకములో నా యొక్క అంశువులేవి ప్రకాశించుచున్నవో వాటికి కేశములని పేరు. అవి కలవాడను కనుక నన్ను బ్రాహ్మణోత్తములు కేశవుడని పిలుచుచున్నారు అని భగవంతుని మాటగా మహాభారతం వివరించింది.

శ్లో ॥ ఐన రశ్ములు చంద్రాంశులు ననల శిఖలు కేశ సంచయము నోమంగా
వున కేశవాభి దానం గొని యాడుదురు నను ప్రబుద్ధ జనంబుల్

అని తిక్కన సోమయాజి అనువదించినాడు. సూర్యచంద్రులందు సంక్రాంతములైన అంశువులకు (కిరణములకు) కేశములని పేరు. అట్టి కేశములు కలవాడు కేశవుడు. సూర్యచంద్రులు విష్ణుదేవుని యొక్క నేత్రములుగా ఉన్నారు. కేశాః రశ్మయః – కేశములు అనగా కాంతికిరణములు. కాంతులను వెదజల్లే జ్యోతిర్మయుడు కేశవుడు. కం అంటే జలము. నీరు రెండు విధములు. ఒకటి భూమిపై నదీ తటాక సముద్రాలలో ఉన్నది. రెండవది అంతరిక్షం. ఆకాశములో పలు విధములుగా జరిగే జలవ్యవస్థ. సూర్యకిరణముల వేడితో భూమిపైనున్న జలాన్ని గ్రహించి మేఘాలుగా మారే పద్ధతి. వర్షరూప జలము. ఈ రెండు రూపాల జలములకు కారకుడు అధిపతి కేశవుడు. కం అంటే సుఖం అని అర్థమూ ఉంది. ఈ సుఖం రెండు విధాలు. ఇహలోక సుఖం, పరలోక సుఖం. నిజానికి ఈ రెండూ అశాశ్వతములు. వీటిని కలిపి లౌకిక సుఖం అనవచ్చును. ఇదికాక అలౌకికమైన బ్రహ్మానందం కలదు. లౌకిక, అలౌకిక ఆనందములను అనుగ్రహించేవాడు కేశవుడు. ఆనంద స్వరూపుడే విష్ణుమూర్తి.

బ్రహ్మ, విష్ణు, శివాఖ్య భక్తులకు కేశ సంజ్ఞ కలదు. అట్టి శక్తి రూప కేశములు కలవాడు కేశవుడని కీర్తింపబడుచున్నాడు. 'త్రయః కేశినః' అను శ్రుతి వాక్యము పై విషయమునే వివరించుచున్నది.

శ్లో ॥ ఆకాశాత్ పతితం తోయం యథా గచ్ఛతి సాగరం
సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి

అను సంధ్యావందన మంత్రము ఆకాశము నుండి వర్షము ద్వారా పడిన నీరు సముద్రమును చేరినట్లుగా సర్వ దేవతలకు చేసిన నమస్కారం కేశవునకే చెందుచున్నదని కేశవుడు సర్వ దేవతా మయుడని కీర్తించుచున్నది.

విష్ణుదేవుని పరత్వ సౌలభ్య గుణములే భక్తులు ప్రస్తుతించ దగిన గుణములలో ముఖ్యమైనవి. కేశవాది ద్వాదశ నామములలో మొదటిదగు కేశవ నామము విష్ణుదేవుని పరత్వమును, చివరిదగు దామోదర నామము (భగవంతుడగు కృష్ణుడు చిన్న దారముతో కట్టబడినాడు) సౌలభ్య గుణమును తెలుపుచున్నవి.

భక్తుల కేశములను స్వీకరించి, వారి క్లేశములను తొలగింప జేయుచున్న వేంకటేశ్వరుడు కేశవుడని కీర్తింపబడుచున్నాడు.

ఈ కేశవ నామము వేంకటేశ అష్టోత్తర శత నామావళిలో 52 సంఖ్యతో, విష్ణు సహస్ర నామములలో 23, 654 సంఖ్యతో ఉన్నది.

కేశవుడని స్తుతింపబడుచున్న విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ఈ నామమునకు పర్యాయ నామములుగా ఉన్న నీలకేశినే నమః (100) అను నామ వ్యాఖ్యానమును నీలకుంతలాయ నమః (277) అను వ్యాఖ్యానమును పరిశీలించండి.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

## విరహ వేదన

ఇది యుద్ధకాండ. ఐదవ సర్గ. సీతాదేవి ఎడబాటు – రాముని విరహ వేదన. దుఃఖ పరితాపం. రాముణ్ణి నరునిగా చూస్తే అతడు కాముకునిగా కనిపిస్తాడు. అలా వాల్మీకి ఎందుకు చిత్రించాడు – అని సందేహం. నారాయణునిగా ఒక నటన. ఒక లీల – అని సమాధానం చెప్పవచ్చు. నరునిగా రాముని దుఃఖాన్ని వర్ణించాడని కూడా అనవచ్చు. గాలి సీతాదేవిని స్పృశించాలి. తిన్నగా తిరిగి రావాలి ఆ గాలి. అది రాముణ్ణి స్పృశించాలి. అపుడు రామునికి కొంత ఊరట లభిస్తుంది. లంకలో ఉంది సీతమ్మ. అక్కడ చంద్రుణ్ణి చూసింది. అదే సమయాన రాముడు చంద్రుణ్ణి చూశాడు. ఆ చంద్రకిరణ స్పర్శ మరికొంత ఊరట కల్గిస్తుంది రామునికి. సీతామాత ఎడబాటు ఒక ఇంధనం. ఆమె స్మరణం ఒక అగ్నిజ్వాల. ఆ కామాగ్ని నిరంతరం దహిస్తోంది రాముణ్ణి.

లక్ష్మణా! నేను ఈ సముద్రంలో పడుకుంటాను. నాలోని మన్మథుడు మంటలు రేపుతున్నాడు. ఈ సముద్ర జలాలు నన్ను మండింపజాలవు. అక్కడ సీత ఉంది. కనుకనే ఇక్కడ నేను ఉన్నాను. పంటపొలం లోని నీటి తడి – పక్కన పొలంలో ఎండిన పంటని బతికిస్తుంది – అలా ఆమె ప్రేమతోనే నేను బతికి ఉన్నాను. సర్వాంగసుందరి శతపత్రాయతేక్షణి సర్వసంపన్న లక్ష్మీదేవి లాంటి సీత – ఎపుడు చూస్తాను ఆమెని? ఆ పద్మముఖి తన మోము పైకెత్తితే – దొండపండు లాంటి పెదవుల్లోని అమృతాన్ని నేనెపుడు తాగుతానో? స్తన సౌభాగ్యం గల ఆ శుభాంగిని నేనెపుడు కౌగలించుకుంటానో? నా ప్రియురాలు జనకుని కూతురు, దశరథుని కోడలు – ఆ రాక్షసి మూకల మధ్య ఎలా ఉందో? శరత్కాల మేఘాల్లోంచి చంద్రరేఖ బయటపడినట్లు – రాక్షసుల నుంచి తప్పించుకుని నన్నెపుడు చేరుతుందో? నా



బాణాలు రాక్షసుని గుండెల్ని ఎపుడు చీలుస్తాయో? ఎపుడు సీతను తెచ్చుకోగలనో? నా కంఠాన్ని కౌగలించుకొని ఎపుడామె ఆనందబాష్పాలు రాలుస్తుందో?

అలా పరితపిస్తున్నాడు రాముడు. సంధ్యాకాలమైంది. విరహవేదన చూడలేకపోయాడేమో సూర్యుడు – అస్తాద్రి చేరాడు. విన్నాడు సౌమిత్రి. సముచిత రీతిలో ఓదార్చాడు రాముణ్ణి.

నరునిగా తన కాముకత్వాన్ని విరహాన్ని ప్రదర్శించాడు రాముడు. అది నారాయణుని లీలా విలాసమని చెప్పవచ్చు. అదొక నటన అని కూడా చెప్పవచ్చు.

భగవంతునికి ఎన్నో కళ్యాణ గుణాలున్నాయి. గుణం అంటే స్వభావం – వింటినారి – తాడు అని అర్థాలున్నాయి. తాళ్ళతో చేసిన వల అని తాత్పర్యార్థంగా చెబుతారు. జగత్తుని సృష్టించిన పరమాత్మ – మనల్ని ఆనందింపచేస్తూ తాను ఆనందాన్ని పొందాలనుకుంటాడు. కానీ కర్మల చేత బంధింపబడ్డాం. ఆ బంధాల్ని తొలగించి – తనని చేరుకోవాలని భగవంతుని సంకల్పం. అందుకు కళ్యాణ గుణాలనే వల విసురుతాడు. మనం తక్కువ తిన్నామా? ఆ వలకి చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాం. అపుడు మనకోసం దుఃఖిస్తాడు భగవంతుడు. అదెపుడు సాధ్యం – మనం సంపూర్ణ శరణాగతులమైనపుడు. భగవంతుడే పరమోపాయమని విశ్వసించినపుడు- సదా స్వామీ కళ్యాణ గుణాల్ని, లీలా విలాసాల్ని స్మరిస్తున్నపుడు, ధ్యానిస్తున్నపుడు – మనల్ని బంధవిముక్తుల్ని చేయాలని మనకంటే అధికంగా పరితపిస్తాడు స్వామి. అదే సీతమ్మ విముక్తి కోసం రాముని ఆవేదన అని అన్వయించవచ్చు.

## మంత్రాలోచన

రాముడు వానరసేనలతో వచ్చాడు. సముద్ర తీరాన ఉన్నాడు. వార్త అందింది రావణునికి. హనుమ లంకలో ప్రవేశించడం, భయంకర కార్యాలు చేయడం విన్నాడు. సిగ్గుపడ్డాడు. తలొంచుకున్నాడు. తర్వాత మంత్రులతో అంటున్నాడు. మన లంకలోకి ఎవ్వరూ రాలేరు. అలాంటిది ఒక వానరుడు వచ్చాడు. జానకిని చూశాడు. చైత్య ప్రాసాదాలు ధ్వంసం చేశాడు. రాజభవనాల్ని కూల్చాడు. రాక్షసవీరుల్ని హతమార్చాడు. లంకా నగరాన్ని అల్లకల్లోలం చేశాడు. ఇపుడు అందరి క్షేమం ముఖ్యం. మన కర్తవ్యమేమిటి? ఆలోచించండి. తెలపండి. మంత్రుల సూచనలు విజయానికి మూలం అన్నారు ప్రాజ్ఞులు. రాముణ్ణి జయించాలి మనం. అందుకు తగిన సూచనలివ్వండి.

లోకంలో మూడు రకాల మనుషులుంటారు. 1. ఉత్తముడు 2. మధ్యముడు 3. అధముడు.



రాజు హితాన్ని కోరుతాడు. రాజుగారి సుఖ దుఃఖాలే తన దుఃఖాలనుకుంటాడు. బంధుమిత్రుల మేలు కోరుతాడు. ధర్మాన్ని, దైవాన్ని నమ్ముతాడు. అందరితో ఆలోచిస్తాడు. పనులు మొదలుపెట్టి పూర్తి చేస్తాడు ఉత్తముడు.

ఎవ్వరితో ఆలోచించడు. తానొక్కడే పనులు చేయాలనుకుంటాడు. ధర్మంపై మనసు నిలుపుతాడు. చేయాల్సిన పని మొదలుపెడతాడు. వాడు మధ్యముడు.

ధర్మాన్ని పట్టించుకోడు. మంచి చెడ్డలు ఆలోచించడు. తొందరపడి పనిచేస్తాడు. మధ్యలో ఆపేస్తాడు. అలా ఉపేక్షించేవాడు అధముడు.

మంత్రులలో భేదాభిప్రాయాలు రాకూడదు. శాస్త్రాల్ని పరిశీలిస్తారు. ఏక నిర్ణయానికి వస్తారు. అది ఉత్తమ మంత్రాంగం. మంత్రుల్లో భేదాభిప్రాయాలు వస్తాయి. ఒక తాటిపైకి రారు. వారే మధ్యములు. అది మధ్యమ మంత్రాంగం.

ఎవ్వరితో ఆలోచించరు. ఎవరికి వారే యమునా తీరేలా ఉంటారు. ఏకాభిప్రాయానికి అవకాశమివ్వరు. వాళ్ళు అధములు. అది అధమ మంత్రాంగం.

మంత్రులారా! మీరు ప్రజ్ఞావంతులు. బాగా ఆలోచించండి. ఏకాభిప్రాయానికి రండి. రాముడు వీర్యవంతుడు. బలవంతుడు. అపార సేనలతో యుద్ధానికి వస్తాడు. సముద్రాన్ని ఇంకింప చేయగలడు. లేదా మరోరకంగా చేయగలడు. సముద్రాన్ని దాటి వస్తాడు. సందేహం లేదు. మన లంకా నగరాన్ని కాపాడుకోవాలి. మన సైన్యాల్ని రక్షించుకోవాలి. తగిన ఉపాయం ఆలోచించండి.

## జయం మనదే

రావణుడు చెప్పాడు. విన్నారు అందరూ. శత్రు బలాబలాలు తెల్సుకోవాలి. అది రాజనీతి. కాని రాక్షసులు నీతిబాహ్యులు. బుద్ధిహీనులు – ఎంతటి బలపరాక్రమాలు ఉంటే ఏం లాభం? అంటున్నారు రావణునితో. రాజా! పరిఘలు, ఖడ్గాలు, శూలాలు,

శక్తి ఆయుధాలున్నాయి. గొప్ప సైన్యం ఉంది. నీవెందుకు దిగులు పడతావు? నీవు భోగవతీ పురానికెళ్ళావు. నాగుల్ని జయించావు. ఆ నాగులు పాతాళ లోకానికి పారిపోయారు. వాసుకి, తక్షకుడు, శంఖుడు ఇంకా ఎందరినో లొంగదీసుకున్నావు. మహేశ్వరుని మిత్రుడు కుబేరుడు. కైలాస శిఖరవాసి, యక్షుల అధిపతి. అతణ్ణి జయించావు. యక్షుల్ని పట్టావు, కొట్టావు. నానా హింసలు పెట్టావు. పుష్పక విమానం తెచ్చుకున్నావు.

మయుడు దానవ ప్రముఖుడు. నీకు భయపడ్డాడు. సఖ్యం చేశాడు. తన కూతురు మండోదరిని నీకిచ్చి వివాహం చేశాడు. దానవేంద్రుడు మధువు. వాడు మహా శౌర్య పరాక్రమశాలి. వాణ్ణి అదుపులో పెట్టావు. నీ చెల్లెలు కుంభీనస అతణ్ణి పెండ్లాడింది.

కాలకేయులు, దానవులు మహా బలవంతులు, శక్తిమంతులు. చావు లేకుండా బ్రహ్మదేవుని నుంచి వరం పొందారు. వాళ్ళని జయించావు. వాళ్ళనుంచి ఎన్నో మాయలు నేర్చావు. దిక్పాలుర్ని జయించావు. దేవేంద్రుని జయించావు. వరుణదేవుని పుత్రులు శూరులు. బలవంతులు. వాళ్ళని జయించావు. యముణ్ణి కూడా జయించావు. వారితో పోలిస్తే రాముడెంత? అతని బలమెంత?

మన ఇంద్రజిత్తు యజ్ఞం చేశాడు. పరమేశ్వరుని వల్ల వరాలు పొందాడు. అవి ఇతరులకు దుర్లభమైనవి. ఆ ఇంద్రజిత్తు సామాన్యుడా? దేవేంద్రుణ్ణి జయించాడు. బంధించాడు. లంకకు తెచ్చాడు. కానీ బ్రహ్మ ఆదేశానుసారం ఇంద్రుణ్ణి వదిలేశాడు. ప్రభూ! నీకెందుకు శ్రమ. రణరంగ కార్యాన్ని ఇంద్రజిత్తుకు అప్పగించు. రామునితో సహా వానరసేనల్ని హతమారుస్తాడు. యమలోకం పంపేస్తాడు. రాజా! నీవు విచారించకు. మానవ మాత్రుడు రాముడు. అతని వల్ల ఆపదలా? అవి ఏమీ మనసులో పెట్టుకోవద్దు. ఆ రాముణ్ణి తప్పక చంపేస్తావు.

సేనానాయకుడు ప్రహస్తుడు అంటున్నాడు. రాజా! దేవతలు, దానవులు, గంధర్వులు, పిశాచులు, పన్నగులు, నాగులు నిన్నెదిరించలేరు. అందరూ అశక్తులు. ఇక వానరులా నిన్ను జయించేది? వానరుడు ఏం చేస్తాడని పరాకుతో ఉన్నాం. ఆ హనుమంతుడు మోసం చేశాడు మనల్ని. దెబ్బ కొట్టాడు. నేను ఉండి ఉంటే వాడు ప్రాణాలతో పోయేవాడు కాదు.

రాజా! హనుమంతునిది విజయం కాదు. మన పరాకే కారణం. అంతేకాని మనం అశక్తులం కాదు. నీవు ఆజ్ఞాపిస్తే చాలు – కొండల్లో కోనల్లో వనాల్లో భూమ్మీద వానరజాతి లేకుండా చేస్తాను. దిగులుపడకు.

దుర్ముఖుడంటున్నాడు – హనుమ మనల్ని అవమానించాడు. అందరినీ చికాకు పరచాడు. అది క్షమించరాని నేరం. నేను ఇపుడే పోతాను – సముద్రంలో దాగినా, ఆకాశంలో ఉన్నా, పాతాళానికి పోయినా వానరులందరినీ చంపేస్తాను. తిరిగి వస్తాను.

వజ్రదంష్ట్రుడంటున్నాడు – చేత పరిఘ పట్టుకున్నాడు. దానికి మాంస కణాలు అంటుకుని ఉన్నాయి. రక్తపు చారికలున్నాయి. భయంకరంగా ఉంది. లక్ష్మణునితో ఉన్నాడు రాముడు. ఎదుర్కోలేమా? దీనుడు, నీచుడు, హనుమంతుడు. వారితో మనకు పనేమిటి? నేనొక్కణ్ణి పోతాను. నా ఇనుప గుదియతో రామలక్ష్మణ సుగ్రీవుల్ని చంపేస్తాను. వానర సైన్యాన్ని నాశనం చేస్తాను. మనం శత్రువుల్ని జయించగలం. అయితే మనం ఉపాయ శాలురమై ఉండాలి. అప్రమత్తులమై ఉండాలి.

రాజా! మనలో కామరూపులున్నారు. శూరులున్నారు. భయంకరులున్నారు. ఒక పదిమంది మానవ రూపం ధరించాలి. రాముని దగ్గరికి పోవాలి. భరతుడు పంపగా వచ్చామని చెప్పాలి. ఇంకా కొంత సేన వస్తోందని చెప్పాలి. అంతలో వివిధ ఆయుధాలతో పోతాం మనం. వానరసేనని ముట్టడిస్తాం. అందరినీ యమ సదనానికి పంపుదాం. అపుడు రామలక్ష్మణులు కర్తవ్య హీనులవుతారు. దుఃఖిస్తారు. కృశిస్తారు. ప్రాణాలు వదులుతారు. ఇది నాకు తోచిన ఆలోచన.

నికుంభుడు అంటున్నాడు – వాడు కుంభకర్ణుని కొడుకు. నేనొక్కణ్ణి పోతాను. రామలక్ష్మణ సుగ్రీవాదుల్ని చంపేస్తాను. తిరిగి వస్తాను.

వజ్రహస్తుడు అంటున్నాడు – మీరంతా మద్యం తాగండి. క్రీడిస్తూ ఉండండి. నిర్భయంగా ఉండండి. మీ మీ పనులు చేసుకుంటూ ఉండండి. రణవీరుడు రామలక్ష్మణ సుగ్రీవ హనుమంతుల్ని చంపేస్తాను. అలా నేను ఒక్కణ్ణే చాలు అని వంత పాడారు. లేనిపోని ప్రగల్భాలు పలికారు. ధైర్యం చెప్పారు రావణునికి.

## ధర్మ నిర్ణయం

నికుంభుడు, రభసుడు, సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, మహాపార్శ్వుడు, మహోదరుడు, అగ్నికేతువు, రశ్మికేతువు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, వజ్రకేతువు, ధూమ్రాక్షుడు, అతికాయుడు, దుర్ముఖుడు, వజ్రదంష్ట్రుడు ఆవేశంతో ఊగిపోయారు. అడ్డకత్తులు, ఈటెలు, శూలాలు, గండ్రగొడ్డళ్ళు, ధనుర్బాణాలు, ఖడ్గాలు చేతపట్టారు. ఒక్కుమ్మడిగా లేచారు. అంటున్నారు.

రాజా! రామలక్ష్మణుల్ని సుగ్రీవుణ్ణి చంపుతాం. లంకను ధ్వంసం చేసిన హనుమంతుణ్ణి మట్టుపెడతాం. విన్నాడు విభీషణుడు. వారి రణోత్సాహం చూశాడు. లేచాడు. వారిని ఆపాడు. నమస్కరించాడు. కూర్చోబెట్టాడు. అంటున్నాడు.

అన్నా! సామ దాన భేదోపాయాలున్నాయి. అవి విఫలమైతే దండోపాయానికి పూనుకోవాలి. దానికి తగిన సమయం ఉంది. తొందరపడి దండానికి దిగరాదు. విషయాసక్తులై ఏమరుపాటులో ఉన్నవారిని – విరక్తులై ఉన్నవారిని – ఒకరితో ఒకరు పోట్లాడుకునే సామంతరాజుల్ని – దైవం ప్రతికూలించిన వాళ్ళని – బాలురను, వృద్ధులను, దీర్ఘరోగుల్ని ఏం చేయాలో నీతి

శాస్త్రం పరిశీలించాలి. మంత్రులతో ఆలోచించాలి. దండోపాయం ప్రయోగించాలి.

రాక్షసులారా! రాముడు ఏమరుపాటుతో లేడు. విజయేచ్ఛతో ఉన్నాడు. కామ క్రోధాలు జయించాడు. అజేయుడు. ఒక వానరుడు సముద్రం దాటి వచ్చాడు. ఎవ్వరూ చేయని పనులు చేశాడు. అందుకే శత్రువుని చులకన చేయరాదు. రావణునికి రాముడు చేసిన అపకారం ఏమి? ఆలోచించండి. మన ప్రభువే రాముని భార్యని అపహరించాడు. ఖరుణ్ణి చంపాడని అంటారా? ఖరుడే దుర్మార్గంతో పోయాడు. చచ్చాడు. శత్రువు నుంచి ప్రతి వ్యక్తి తనను తాను రక్షించుకోవాలనుకుంటాడు. ఒకవేళ రాముడే అపకారం చేసి ఉంటే అపుడు యుద్ధానికి పోవాలి.

పర స్త్రీని తాకడం మహాపాపం. అది కీర్తికి మచ్చ. ఆయువు క్షీణిస్తుంది. సంపదలు నశిస్తాయి. అందుకే ఇపుడు వైదేహి వల్ల మనకు భయం. ఆమెను రామునికి అప్పగిస్తే ఏ భయాలుండవు. అది మంచిది.

రాముడు ధర్మనిరతుడు. మహావీరుడు. అలాంటి వానితో వైరం ఎందుకు? అది అనర్థ దాయకం. కనుక మైథిలిని రామునికి సమర్పించాలి. అది ఎంతో సమంజసం. లేకపోతే మన బంగారు లంకను – రాముడు బాణవర్షంతో నాశనం చేస్తాడు. అది జరగకముందే సీతాదేవిని రామునికి ఇవ్వాలి. అపారమైన వానరసేనలు లంకలోకి రాకముందే సీతాదేవిని ఇచ్చేయాలి. లేకపోతే మన రాక్షసులు నాశనమైపోతారు.

రాజా! నీకు నాకు బంధుత్వం ఉంది. అందుకే బతిమాలుతున్నాను. అన్నా! నా మాట విను. నీ మేలు కోరుతున్నాను. కోపం, పగ వదిలిపెట్టు. కోపం సుఖాన్ని, ధర్మాన్ని నాశనం చేస్తుంది. ధర్మాన్ని ఆచరించు. కీర్తి పెరుగుతుంది. బంధువులతో, మిత్రులతో సుఖంగా ఉండు. సీతాదేవిని రామునికి అప్పగించు.

విన్నాడు రావణుడు. సమాధానం చెప్పలేదు. సభ చాలించాడు. అందరినీ పంపించాడు. తన భవనానికి వెళ్ళిపోయాడు.

**(సశేషం)**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1.భగవద్రామానుజుల విరచితమైన, నిరుపమాన, అత్యంత మహిమోపేతమైన 'శ్రీభాష్యం' అనే గ్రంథం గురించి క్లుప్తంగా వివరించండి. – పరాంకుశులు, ఖమ్మం**

జవాబు – ఇది ఎంత క్లిష్టమైన ప్రశ్నో, అంత అద్భుతమైన, చాలామందికి కుతూహలం కలిగించే మంచి ప్రశ్న.

1. బ్రహ్మ సూత్రాలకు భగవద్రామానుజులు అందించిన దివ్య వ్యాఖ్యానమే శ్రీభాష్యం. దీనిలో భగవతత్త్వం, బ్రహ్మవిద్యా స్వరూపం, జీవాత్మ, పరమాత్మల వివరణ ఉన్నాయి.

2. మనకున్న గ్రంథాలను మూడు రకాలుగా భావించవచ్చు. ఒకటి ద్రాక్షపండులా సులభంగా లభ్యమై, తేలికగా అర్థమై ఉల్లాసం కలిగిస్తే మరొక రకం గ్రంథాలు కొంచెం కష్టపడి చదివితే, అరటిపండులా కొంచెం శ్రమతో ఆనందం కలిగిస్తాయి. ఇక మూడవరకం నారికేళం, అంటే కొబ్బరిబొండాం లాగా బాగా కష్టపడితేనే మనకు లభించి, అద్భుతమైన, ఎంతో రుచికరమై, నిజమైన దివ్య ఆనందం తృప్తి కలిగిస్తాయి. ఇదిగో 'శ్రీభాష్యం' ఇటువంటిదే.

3. ఇది ప్రణవ (ఓంకార) స్వరూపం. అష్టాక్షరీ ప్రకాశం. దీనిలో 545 సూత్రాలు, 16 పాదాలు ఉన్నాయి. మోక్షాపాయముల వ్యాఖ్య, బ్రహ్మవిద్యోపాసన మొదలగు వాటితో పాటు చతుర్వేద సారమైన ఈ గ్రంథం విశిష్టాద్వైత, నారాయణ పరంగా భగవద్రామానుజులు మనకందించిన గొప్పవరం.

**2. విష్వక్సేనుల వారి గురించి తెలియజేయండి – శ్రీనివాస్, గుంటూరు**

జవాబు – అద్వైతులకు వినాయకుడి వలెనే విశిష్టాద్వైతులకు సర్వ విఘ్న నివారకుడు, గణాధిపతి, సైన్యాధిపతి విష్వక్సేనుడు. కుముదాక్షుడు అని కూడా వీరికి పేరు ఉంది.

దుర్మేధనుడనే లోక కంటకుణ్ణి సంహరించి అమరులకు బాధలను తొలగించాడు. రాఘవాభ్యుదయం అనే గ్రంథ కర్త వీరిని చాలా చక్కగా స్తుతిస్తూ –

శాంతుని, భక్తమానస నిశాంతుని, సర్వకిరీట సుప్రభా
కాంతుని, వాసుదేవ పరికల్పిత సైన్య పతిత్వ రాజిత
స్వాంతుని, శక్తి దండధర చక్రజిత ప్రతివైరి వీరశు
ద్ధాంతుని గొల్తు మత్కృతు నితాంత శుభాంతమునై వెలుంగగన్

అని అంటారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
***– ఎడిటర్, శ్రీవేంకటేశం***



# జయదేవుని గీత గోవిందము

– డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

## ఉపోద్ఘాతం

సంగీతం, కవిత్వం రెండింటిపై పట్టుగలిగి ఆశువుగా గానం చేసే కళాకారులని వాగ్గేయకారులు అంటారు. అన్నమయ్య, రామదాసు, క్షేత్రయ్య, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి వంటి మహానుభావులు ఈ కోవకు చెందినవారే. సంగీత ప్రపంచంలో తమకంటూ ఒక స్థానాన్ని కల్పించుకున్న అలాంటి మహానుభావులలో ఒకరు "భక్త జయదేవులు".

కొంతమంది పుట్టుకతోనే భక్తులై, జ్ఞానులై ఉంటారు. 12వ శతాబ్దానికి చెందిన, వ్యాసుని అవతారంగా భావించే "జయదేవుడు" ఇటువంటి వారిలో ఒకరు. ఈయన జీవితం, పూర్ణ భావంతో, భక్తి విశ్వాసాలతో, సాధన చేస్తే, భగవంతుడే అనేక రూపాల్లో వచ్చి రక్షిస్తాడని, తెలియజేస్తుంది.

బాల్యంలోనే, ఆశుకవిత్వం చెప్పిన ఏకసంధాగ్రాహి, జగన్నాథుని భక్తుడు జయదేవుడు. ఈయన కీర్తనలు పాడుతుంటే, జగన్నాథ స్వామి లీలలన్ని, కళ్ళకు కట్టినట్టు కనిపించడం వల్ల, బహుళ ప్రజాదరణ పొంది, ప్రతినోటా, వినిపించసాగాయి. జయదేవుడు సంస్కృతకవి, పండితుడు. ఈయన 12వ శతాబ్దమునకు చెందినవారు. వీరు వ్రాసిన రాధాకృష్ణుల ప్రణయకావ్యం, "గీతగోవిందం" హిందూమత భక్తి ఉద్యమంలో ఒక ప్రముఖ పాత్ర వహిస్తుంది.

మధుర భక్తి కవితకు వరవడి దిద్దడంలో అగ్రస్థానం జయదేవుని 'గీతగోవిందం' కావ్యానిదే! భక్తి ధరించ గల రూపాలలో ప్రేమకు మించింది లేదని, ఓం ప్రథమంగా చాటిన కవి జయదేవుడు. 'గీత గోవిందం' వినా మరొక కావ్యాన్ని జయదేవుడు వ్రాయలేదు. భక్తులు కాని వారిని సైతం అలరించగల సాహిత్యపు విలువలు ఆ కావ్యంలో ఉన్నాయి.

సంస్కృత వాఙ్మయంలో గానయోగ్యమైన కావ్యాలలో నారాయణ తీర్థుల "శ్రీకృష్ణ లీలాతరంగిణి" (తరంగము) మరియు జయదేవ కవీంద్రుల "గీతగోవిందం" (అష్టపదులు)




అత్యంత ప్రసిద్ధమైనవి. ఈ అష్టపదులు లోకంలో విశేష ప్రాచుర్యం పొందాయి.

ఈ 'గీతగోవిందం' కావ్యాన్ని అనుసరించి భానుదత్తుడు "గీతగౌరీపతి", కళ్యాణకవి "గీత గంగాధరము", రామరంజితకవి "గీత గౌరీశము", మరియు మైథిలీకృష్ణదత్తు "గీతగోపీపతి" వంటి కావ్యాలను రచించారు. దీనిని బట్టి జయదేవుని కావ్యం యొక్క ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

వేర్వేరు పండితులు దాన్ని వేర్వేరు విధాలుగా వర్ణించడం కద్దు. పాశ్చాత్య పండితులనే తీసుకుంటే సి.లాసెన్ దాన్ని శృంగారరస ప్రధానమైన రూపకంగా భావించాడు; సర్ విలియం జోన్స్ దాన్ని జానపద గాథగా అభివర్ణించాడు; సెల్వన్ లెవీ దాన్ని ఓపెరాగా పేర్కొన్నాడు; సిష్పెల్ గేయ నాటకంగా దాన్ని పరిగణించాడు; షాన్ ష్రోడర్ దాన్ని వీధి భాగవతం కింద (దీన్ని బెంగాలీలు 'యాత్రా' అంటారు) లెక్క కట్టాడు. ఇంతమందిలో

ఒక్క ఎ.బి.కీత్ దానికి కావ్య లక్షణాలు లేకపోలేదన్నాడు.

ప్రఖ్యాత కవి ఆర్నాల్డ్ గీతగోవింద కావ్యాన్ని 'Song of Songs' గా కీర్తించి రచించాడు. విలియం జోన్స్ అనే కవి ఈ కావ్యాన్ని ఆంగ్లము లోకి అనువదించాడుట. జార్జి వేథ్ అనే మహానుభావుడు గీతగోవిందాన్ని (Prose) గద్యంగా అనువదించి సమయోచితంగా అనేక చిత్రాలను చిత్రించాడు. పరభాషా పండితులను కూడా ఎంతో ఆకర్షించిన గీతగోవింద కావ్యాన్ని తెలుగులోనూ అనువదించారు. క్రీ. శ. 1684 ప్రాంతము నాటి శ్రీనివాసకవియు, 'విద్యాభూషణ' సూరబత్తుల సూర్యనారాయణ కవి, ఉయ్యూరు జమీందారు శ్రీ వేంకటాద్రి అప్పారాయుడు మొదలగు వారెందరో దీనిని తెలుగులో రచించారు. శ్రీ చల్లా పిచ్చయ్యగారు గీతగోవిందమును ఆంధ్రీకరించి గానము చేసి 'అభినవ జయదేవులు' గా ప్రసిద్ధిగాంచారు. ఈ కావ్యమునకు సుమారు (55) కు పైగా సంస్కృత వ్యాఖ్యలున్నాయి. శ్రీ ఉత్పల వేంకట నరసింహాచార్యులు మొదలగువారు తెలుగునందును వ్యాఖ్యలను వెలువరించారు. అలంకారికులు పెక్కుచోట్ల నీ కావ్యలక్షణమునుదాహరించుటేకాక,ఆధ్యాత్మికోపన్యాసకులును పలుచోట్ల నీ కావ్యమునందలి ధర్మస్వరూపాన్ని ప్రకటిస్తూ వుండేవారు. నేటికిని ఒరిస్సాలో 'భాగవతఘర్' అను పేరున ఉన్న అనేక రాధాకృష్ణ మందిరములలో భక్తులు ఈ అష్టపదులను భక్తి పారవశ్యముతో గానము చేయుచు నాట్యము చేసేవారుట.

జయదేవుని తర్వాత కేరళలో బిల్వ మంగళుడు, వంగ రాష్ట్రంలోనే విద్యాపతి, చండీదాసులు, ఉత్తర హిందూస్థానంలో కృష్ణదాసు, సూరదాసు, పరమానంద దాసు, కుంభక దాసు, కేశవ దాసు, గోవింద దాసు, బీహారిలాల్, కాళిదాసు, ఆంధ్ర ప్రాంతంలో క్షేత్రయ్య-ఇట్టి 'మధురభక్తి' కవులెందరో తలెత్తారు. వీరిలో కొందరు తమ కవిత ద్వారా చిత్రకళకు, మరికొందరు నాట్యకళకు దోహదాన్ని కూర్చారు. ఉదాహరణకు క్షేత్రయ్య పదాలు కూచిపూడి నాట్య వికాసానికి ఎంతగానో తోడ్పడ్డాయి. సూరదాసు గీతాలు 'రాగ-రాగిణి' చిత్రాల ఆవిర్భావానికి ఎంతో ప్రేరణను ఇచ్చాయి.

కేవలం అనువాదాలే కాక జయదేవుని గీతగోవింద కావ్యపు పాటలకు, పద్యాలకు ఎందరో చిత్ర కారులు శతాబ్దాలుగా చిత్రాలు వేస్తున్నారు. గీతగోవింద అష్టపదులకి మేవార్, కాంగ్రా శైలుల చిత్రాలను నేషనల్ మ్యూజియం వారు పుస్తకంగా ప్రచురించారు. ఈ అష్టపదికి సంబంధించిన చిత్రాలను ఇందిరాగాంధీ జాతీయ కళాసంస్థ వారి వెబ్‌సైట్లో కూడా చూడవచ్చును. జయదేవుని అష్ట పదులకు భరతనాట్యం, కూచిపూడి, మణిపురి, ఒడిస్సీ, కథక్, మోహినియాట్టం వంటి భారతీయ నృత్య రీతుల్లో అష్టపదులను ప్రదర్శిస్తుంటారు. ఈ 'సా విరహే' అష్టపదికి కేరళ సాంప్రదాయమైన మోహిని యాట్టంలో అంజలీ పణిక్కర్ నాట్యాన్ని, భరతనాట్య శైలిలో శివకామి నాట్యాన్ని ఇంటర్నెట్లో చూడవచ్చు.

నేటికీ పూరీలో జగన్నాథస్వామికి పూజలు నిర్వహించేటప్పుడు, తిరుపతిలో అన్నమయ్య కీర్తనలు పాడినట్లు, జయదేవుని అష్టపదులు ఆలపిస్తుంటారు. పూరీ జగన్నాథ రథోత్సవ సందర్భంలో 19వ అష్టపదిని ఆలపిస్తారు. కేవలం పూరీలోనే కాక కేరళలోని గురువాయూరు దేవాలయంలో కూడా అష్టపదులను సోపాన పద్ధతిలో గానం చేస్తారు.

## జయదేవుని గురించి

ఆధ్యాత్మిక సంపదకు, భక్తి శ్రద్ధలకు నిలయమైన దేశంలో పవిత్రమైన, దివ్యమైన క్షేత్రంగా పేరు గడించింది "పూరి". పూరికి దగ్గరలో ఒక కుగ్రామం వుంది. ఆ గ్రామం పేరు – 'కిందుబల్వం'. దానినే బిందు బిల్వం అని కూడా పిలుస్తారు. ఆ గ్రామంలో నివసిస్తూ వుండేవాడు ఒక నిరుపేద. ఆతను విద్య నేర్చినవాడు. పూరీ జగన్నాథుడి పట్ల అమితమైన భక్తిగలవాడు. ఆయన పేరు "భోజదేవుడు" ఆయన సతీమణి రమాదేవి. ఆమెను అందరూ వామాదేవి అని కూడా పిలుస్తారు. ఆమె భర్తకు తగ్గ భార్య. దంపతులిద్దరూ దైవభక్తి పరాయణులుగా పేరు గడించారు. ఆ దంపతులంటే అందరికీ గౌరవభావం. ఆ దంపతులకు ఒక పుత్రుడు జన్మించాడు. పిల్లవాడికి "జయదేవుడు" అని నామకరణం చేసి, అల్లారు ముద్దుగా చూసుకోసాగారు. జయదేవుడు చిన్నతనంలోనే తండ్రి వద్ద భారత, రామాయణ, భాగవతాలను నేర్చుకున్నాడు. చిలిపికృష్ణుడి అల్లరిచేష్టలు తెలుసుకుని ఆనందించాడు. తమలాగే తమ పుత్రుడు నిరుపేద కాకూడదను కున్నారు. అందుకే తాము కష్టపడ్డా లెక్కచేయక కుమారుడిని సకల విద్యలలోనూ పరిపూర్ణుడిని చేయడానికి



కృషిచేశారు. తల్లి దండ్రుల ఆసక్తిని, కోరికను, వారు చూపిస్తున్న ప్రేమను, కనబరుస్తున్న ఆప్యాయతాను రాగాలను తెలుసుకున్న జయదేవుడు, ఆ ప్రకారమే సకల విద్యాపారంగతుడయ్యాడు.

జయదేవుడు విద్యావంతుడైతే అయ్యాడుగానీ, దారిద్ర్యం మాత్రం తీరలేదు. తపస్స్వాధ్యాయనాలలో కాలం గడపడం ప్రారంభించాడు. ఇలాంటి స్థితిలో ఒక రోజు దేవశర్మ అనే వ్యక్తి జయదేవుడి దగ్గరకు వచ్చాడు. ఆయన ప్రక్కనే యుక్త వయస్సులో వున్న అందమైన యువతి వుంది. దేవశర్మ 'పూరి'కి చెందినవాడు. జగన్నాథుడి భక్తుడు. ఆయన భార్య విమలాంబ. ఆమె భర్తకు మించిన భక్తురాలు. ఆ దంపతులకు జగన్నాథుడే సర్వం. నిత్యం ఆ జగన్నాథునే స్మరిస్తూ కాలం గడుపుతున్నారు. అయితే వారికి వుండేలోటు ఒక్కటే, సంతానం లేకపోవడం. సంతానం కోసం ఎన్నో వ్రతాలు, పూజలు, నోములు నోచారు. చివరకు పిల్లలు పుడితే మొదటి సంతానాన్ని జగన్నాథుడికే సమర్పిస్తానని మొక్కుకున్నాడు. శరణన్న భక్తుల మొరలను ఆలకించి...వారిని కాపాడటమే ఆ జగన్నాథుడి చర్య కదా! అందుకే ఆ దంపతుల మొరను ఆలకించాడు. కొంతకాలానికి ఆ దంపతులకు పండంటి ఆడపిల్ల పుట్టింది. 'పద్మావతి' అని నామకరణం చేశారు. దైవప్రసాదంగా భావించి పద్మావతిని అల్లారుముద్దుగా, గోముగా పెంచసాగారు. పద్మావతి పెరిగి పెద్దదై యుక్తవయస్సుకు చేరింది. దేవశర్మకు జగన్నాథుడికి ఇచ్చిన హామీ గుర్తుకువచ్చింది. ఒకరోజు పద్మావతిని తీసుకుని ఆలయానికి వెళ్లాడు. జగన్నాథుడికి ప్రణమిల్లి, "స్వామి మా కోరికను మన్నించి, మాకు సంతానాన్ని ప్రసాదించావు. నా మొదటి సంతానం పద్మావతిని మీకు అర్పిస్తున్నాను స్వీకరించండి స్వామీ" అంటూ ప్రార్థించాడు. వేడుకున్నాడు. జగన్నాథుడు ఉలకలేదు... పలకలేదు... దేవశర్మ ఆలయం మూసేంత వరకూ నిరీక్షించి, చివరకు ఇల్లు చేరుకున్నాడు.

ఆరోజు రాత్రి నిద్రిస్తున్న దేవశర్మకు ఒక స్వప్నం వచ్చింది. జగన్నాథుడు ప్రత్యక్షమై. "భక్తా! పద్మావతిని జయదేవుడనే భక్తుడికి ఇచ్చి వివాహం చేయి. అదే నా కోరిక" అని ఆజ్ఞాపించాడు. అందుకే కూతురిని వెంటబెట్టుకుని దేవశర్మ, జయదేవుడి దగ్గరకు వచ్చారు. దేవశర్మ తన మనసు లోని మాటను జయదేవుడికి చెప్పాడు. "నేను నిరుపేదను...మీ అమ్మాయికి తగిన వాడిని కాదు" అన్నాడు జయదేవుడు. "అలా అనకు నాయనా! ఇది జగన్నాథుడి ఆజ్ఞ. పద్మావతికి నీవే తగిన భర్తవు. ఇది ఆ దేవుడే నిర్ణయించాడు" అన్నాడు దేవశర్మ. కాదు అన్నట్లుగా తల ఊపాడు జయదేవుడు.

"నా మాటకు అడ్డుచెప్పకు. మా అమ్మాయి పద్మావతిని నీ వద్దే వుంచి వెళతాను. తరువాత నీ ఇష్టం" అని జయదేవుడితో చెప్పి పద్మావతి వైపు తిరిగి – "అమ్మా పద్మావతీ! ఈ జయదేవుడే నీ భర్త. ఆయన చెప్పినట్లుగా వింటూ – ఆయన అడుగుజాడలతో నడుచుకుంటూ కలకాలం కలిసి మెలసి వుండండి" అని చెప్పి పద్మావతిని అక్కడే వదిలి వెళ్లాడు దేవశర్మ.

జయదేవుడు నిల్చుని వున్నాడు. ఎదురుగా నేలపై చూస్తూ పద్మావతి నిలబడి వుంది. ఇద్దరూ ఎదురెదురుగా నిల్చున్నా, వారిద్దరి మధ్య మౌనం రాజ్యమేలుతోంది. నేల చూపులు చూస్తున్న పద్మావతిని నిశితంగా పరిశీలించాడు జయదేవుడు. అమాయకమైన ముఖంతో నిలబడి వున్న పద్మావతిని చూస్తే దయ, జాలి బయలుదేరాయి జయదేవుడిలో. "నీకు భయం వేయడం లేదా?" అడిగాడు జయదేవుడు. "మీరున్నారు కదా? భయం ఎందుకు?!" ఎదురు ప్రశ్న వేసింది పద్మావతి. "ఈ నిరుపేద నిన్నెలా రక్షిస్తాడు? ఎలా పోషిస్తాడు...? మళ్ళీ అడిగాడు జయదేవుడు.

"నా దైవం మీరే. ఇది నా నిర్ణయం కాదు. సాక్షాత్తూ ఆ జగన్నాథుడి నిర్ణయం. ఆ జగన్నాథుడే మీ దగ్గరకు పంపిస్తే ఇక నాకెందుకు భయం? దైవ నిర్ణయానికి మించింది ఈ లోకంలో వుందా?" వేదాంతిలా పలికింది పద్మావతి. పద్మావతి మాటలు జయదేవుడికి నచ్చాయి. వారిద్దరి వివాహం జరిగింది. మరి జగన్నాథుడే గీత గీస్తే అది చెరిపివేయడం ఎవరికి తరం? ఆ దంపతులిద్దరూ ఉన్నంత లోనే హాయిగా, ఆనందంగా కాలం వెళ్ళబుచ్చ సాగారు. వారిది ఆదర్శ దాంపత్యం.

సకల విద్యాపారంగతుడైన జయదేవుడిలోని భక్తి, కీర్తనం వైపుకు మళ్ళింది. దేవుడి పైన కావ్యాల రచనను ప్రారంభించాడు. అలా దైవచింతనలో పాటలు, కీర్తనలు వ్రాసి దేవుడి సన్నిధిలో వాటిని గానం చేసి వాటిని ఆ దేవునికే అంకితం ఇవ్వసాగాడు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి చివరకు బెంగాల్ రాజు అయిన లక్ష్మణసేనుడి చెవిలో పడింది. లక్ష్మణసేనుడు సంగీత సాహిత్య ప్రియుడు. పండితుడు, ప్రబంధరచనా పటిమ గలవాడు. స్వయంగా సాహిత్యప్రియుడు కదా. కవులన్నా, కళాకారులన్నా లక్ష్మణసేనుడు దేవుడితో సమానంగా చూసేవాడు. జయదేవుడిని గురించి తెలుసు కున్న లక్ష్మణసేనుడు జయదేవుడిని ఆస్థానానికి పిలిపించుకున్నాడు. ఆస్థాన కవిని చేసి సత్కరించాడు.

జయదేవుడి పేదరికం తొలగిపోయింది. లక్ష్మణసేనుడి సాంగత్యంలో జయదేవుడు ఎన్నో రచనలు గావించాడు. ప్రజలు, ప్రభువులూ జయదేవుడిని కీర్తించసాగారు. మరో ప్రక్క లక్ష్మణ సేనుడికి, జయదేవుడికి మధ్య రాజు, కవి సంబంధమే కాదు, స్నేహ సంబంధమూ మొగ్గ తొడిగి పుష్పించింది.

లక్ష్మణసేనుడి ఆదరణతో రూపుదిద్దుకున్న కావ్యం 'గీతగోవిందం'. దీనినే జయదేవుడి 'అష్టపదులు' అని కూడా పిలుస్తారు.

**"రాధికా తవ విరహే కేశవ..."**
**"ధీర సమీరే యమునా తీరే..."**
**"చందన చర్చిత నీల కళేబర..."**

"సావిరహే తవ ధీనా రాధా..."

"పశ్యతి దిశ దిశ రహసి భవతం..."

ఇలా గానం చేస్తూ వ్రాయడం మొదలుపెట్టాడు జయదేవుడు 'గీతగోవిందం'ను. రాధామాధవుల ప్రణయం, విరహం, కలహం. ఇలా ఒక్కటేమిటి అన్నీ వర్ణించాడు. జయదేవుడు ఈ అష్టపదులను గానం చేస్తూ, వ్రాస్తూ వుంటే పద్మావతి అందుకు తగ్గట్టుగా నాట్యం చేస్తూంది. అలా ఆటపాటలలో జయదేవుడు రాధాకృష్ణుల ప్రణయాన్ని ఇతి వృత్తంగా చేసుకుని 12 సర్గలలో 24 అష్టపదులలో 72 శ్లోకాలతో గీత గోవిందంను పూర్తి చేశాడు. అంతటితో ఆగాడా? లేదే...రతిమంజరి, చంద్రలోకం, కారకవాదము, తత్త్వచింతామణి వంటి రచనలు చేశాడు.

జయదేవుడు ఇటు రచించాడో లేదో...అటు ప్రజల నాలుకల మీద ఆ కావ్యములు నాట్యమాడడం ప్రారంభించాయి. ముఖ్యంగా 'అష్టపదుల' పట్ల ప్రజల్లో మక్కువ ఎక్కువైంది. ఏ ఉత్సవామైనా సరే, ఏ పూజ అయినా సరే, ఏ ఆలయమైనా సరే, ఇలా ఎక్కడ చూసినా జయదేవుడి అష్టపదుల గానమే! తన ఆస్థానకవి జయదేవుడు రచించిన "గీతగోవిందం"కు అంత పేరు ప్రఖ్యాతులు రావడం లక్ష్మణ సేనుడిని ఆనందపరిచింది. అయితే ఏదో మారు మూల ఈర్ష్య కూడా చోటు చేసుకుంది. ఈర్ష్యకు కారణం రాజు కూడా అలాంటి పాటలే రచించాడు. అవి జగన్నాథుని గుణగణాలను పొగుడుతూ వ్రాసినటు వంటివే. అయితే ప్రజలు జయదేవుడి పాటలే పాడుతున్నారు కానీ, రాజుగారివి ఎవరూ పాడడం లేదు. బాధపడ్డాడు. చివరకు ప్రజల అభిప్రాయాన్ని అడిగాడు. జయదేవుడి పాటలు నచ్చినంతగా రాజు గారి పాటలు నచ్చలేదని వారు తేల్చి చెప్పారు. జయదేవుడి పాటలు దేవుడికీ ఇష్టమన్నారు. పైకి అంగీకరించినా, లోపల మాత్రం బాధ తగ్గలేదు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చిన రాజు – "నా పాటలను, జయదేవుడి పాటలను స్వామివారి పాదాల దగ్గర వుంచుదాం. నచ్చిన పాటలను తన వద్ద ఉంచుకుంటాడు. నచ్చనివి దూరంగా వేస్తాడు. ఇది మీకు అంగీకారమేనా?" అని ప్రజలను అడిగాడు. అందుకు వారు సిద్ధమయ్యారు.

జయదేవుడి అష్టపదులనూ, రాజు పాటలను ఆలయంలోని దేవుడి పాదాల వద్ద వుంచారు. ఆ రాత్రి ఆలయాన్ని మూశారు. అందరిలోనూ ఆతృత. దానికి సంబంధించిన ఆలోచనలే. ముఖ్యంగా రాజులో అయితే మరీ ఎక్కువ. తెల్లవారింది. ఆలయం తెరిచే సమయం అయింది. ఆశతో రాజు గుడి దగ్గరకు చేరుకున్నాడు. ప్రజలు అధికసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆలయ తలుపులు తెరిచారు. ప్రజలు ఆనందంతో చిందులు వేసారు. జయదేవుడి గీతగోవిందం ఆలయంలోని జగన్నాథుడి తల మీద వుంది. రాజు గారి పాటల పుస్తకం ఎక్కడో దూరంగా పడివుంది. రాజు సిగ్గు పడ్డాడు. బాధ పడ్డాడు. చివరకు దేవుడే మెచ్చిన జయదేవుడి పైన ఈర్ష్య పడడం తన మూర్ఖత్వం



అనుకున్నాడు.

జయదేవుడి అష్టపదుల ప్రచారానికి కృషి చేయాలని భావించాడు. రాజు అనుకంటే దెబ్బలకు కరువా? ఇక దేశంలో ఎక్కడ చూసినా అష్టపదుల గానమే!

జయదేవుడు దశావతారాల గురించి వ్రాసిన కావ్యం, దశకృతి కృతే, కృష్ణుడు మూడు ముఖాలతో వేణువు వాయిస్తున్నట్టు వర్ణించే కావ్యం, 'త్రిభంగి' అతని వల్లే ప్రాశస్త్యము నొందింది. జయదేవుని రెండు అష్టపదులు సిక్కుల మతగ్రంథమైన గురుగ్రంథ సాహిబ్లో కనబడతాయి. దీనిని బట్టి, జయదేవుని రచనలు గురునానక్ మీద, అతడు పూరీని సందర్శించినప్పుడు, ఎంత ప్రభావం చూపాయో అర్థమౌతుంది.

గీత గోవిందం జయదేవుని గొప్ప కావ్యం. రాధాకృష్ణుల ప్రేమ తత్వమును గూర్చి అష్టపదులుగా రచించిన మహానుభావుడు. అది 12 అధ్యాయాలు, ఒక్కొక్క అధ్యాయం 24 ప్రబంధాలుగా విభజింపబడింది. ఒక్కొక్క ప్రబంధంలో ఎనిమిది ద్విపదలు ఉంటాయి. వీటినే అష్టపదులు అంటారు. ఈ గ్రంథము 24 అష్టపదులు, 80కి పైగా శ్లోకములు కలిగి, 12 సర్గలతో వ్రాయబడెను. గోవిందుని గూర్చి రచింపబడిన గేయ ప్రబంధమగుటచే దీనికి "గీతగోవిందం" అని పేరిడిరి. ఈ అష్టపదులు నాయకా, నాయకీ, నటులచే పాడబడినట్లు రచింపబడెను. దీనిలో 19వ అష్టపది "దర్శనాష్టపది" అనియు "సంజీవనీ అష్టపది" అనియు చెప్పబడింది. ఇది రాధాకృష్ణుల ప్రణయ తత్వమే పరమార్థంగా భావించే, నింబార్కుడి వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి యున్నకావ్యం. నవవిధ భక్తి మార్గాలలో - 1. పిత్రాపుత్ర, 2. రక్ష్య రక్షక, 3. ఆధార ధేయ, 4. శరీరాత్మ, 5. జ్ఞాత జ్ఞయ, 6. భోక్తృభోగ్య, 7. స్వస్వామి, 8. భార్యాభర్త్ర, 9. శేషశేషి అను భార్యాభర్త్ర భక్తిమార్గం

గీత గోవిందంలో జయదేవుడు నిరూపించాడు. ఇందులో సర్గనామములు సాభిప్రాయములు - సామోద దామోదరము, క్లేశ కేశవము, ముగ్ధ మధుసూదనము ఇత్యాదులు పలు సర్గలు. రసము, శృంగారము, ఏకాదశ ద్వాదశ సర్గలలోని శృంగారము, సంభోగము. నాయకుడు గోవిందుడు. నాయిక రాధ. జయదేవ కవి రాధ ఇంద్రాణి అయినట్లు జయదేవ స్వామి చరిత్రలో ఇలా ఉంది.

'తొల్లి ఒకప్పుడు స్వర్గరాజ్య రమయైన ఇంద్రాణి వైకుంఠ ధాముని దర్శించటానికి వెళ్ళి ఆతని నవమన్మథ మన్మథాకృతిని దర్శించినంత మాత్రాన మోహబాణ పాతాలకు పాలై స్వామిని చూచి "ఓ దీనమూర్తి హరా! నన్ను నీ ఉత్సంగానికి ఆశ్రితురాలిగా చేయవే" అని ప్రార్థించింది. భగవంతుడు ఆమెను చూచి "నేను సాధుసంత్రాణ శీలుడనై కృష్ణాఖ్యతో భూమిమీద అవతరిస్తాను. నీవు రాధగా జన్మించి నీ మనోరథ సిద్ధి పొందుదువుగాక." అని అనుగ్రహించాడు.

జయదేవుడు శ్రీ కృష్ణుని పరబ్రహ్మ స్వరూపముగా పూజించెను. ఈ గీత గోవిందమును శృంగార రసముతో, మధుర భక్తితో, నాయకా, నాయకీ భావముతో స్తుతించెను. ఇందు రాధ నాయకి-జీవాత్మ, కృష్ణుడు నాయకుడు-పరమాత్మ, సఖి - ఈ సఖి జీవాత్మను ముక్తి పథములో నడిపించి పరమాత్మలో లీనము చేయుటకు తోడ్పడును. ఇదియే గీత గోవిందములోని సారాంశము.

## దర్పన అష్టపది :

జయదేవుడు గీత గోవిందమును మిక్కిలి ఉత్సాహముతో, దీక్షతో, భక్తితో వ్రాయుచుండెను. 10వ సర్గలో గల 19వ అష్టపదిలో 7వ చరణమును రచించుచున్న సమయములో తన భావనాకల్పన అతి విచిత్రముగా నుండెనట. కృష్ణుడు రాధతో...

**"స్మరగళ ఖండన మమ శిరసి మండనం**
**దేహి పద పల్లవముదారం....."**

"రాధా! ప్రేమ అను విషము నా తలకెక్కి యున్నది. అందువలన నీ కోమలమైన పాద పద్మములను నా శిరస్సుపై నిడుము. అపుడు ఆ విషమంతయు దిగును." అను అర్థము వచ్చునటుల వ్రాసినాడట. కాని వెంటనే "ఏమీ! రాధ తన పాదమును కృష్ణ పరమాత్మ తలపై నుంచుటయా? ఇది మహాఘోరమైన పని. ఇట్లు వ్రాయుట మహాపచారము" అని తలచి ఆ పంక్తులను కొట్టివేసి, జయదేవుడు లేచి, అభ్యంగన స్నానమునకు నూనె ఒంటికి, తలకు రాసుకొని నదికి వెళ్ళినాడట.

కొంతసేపటికి ఆ స్వామి జయదేవుని రూపమున తిరిగి వచ్చి ఆ వ్రాత ప్రతిని తెమ్మని పద్మావతిని అడిగి, ఆ కొట్టివేసిన పంక్తులనే మరల వ్రాసి వెళ్ళిపోయెనట. స్నానము చేసి వచ్చిన జయదేవ కవికి తాను కొట్టివేసిన పంక్తులు మరల వ్రాసి యుండుట చూసి, ఆశ్చర్యపడి ఎవరు వ్రాసినారని పద్మావతిని అడిగెనట. ఆమె "స్వామీ! మీరే కదా మరల వచ్చి వ్రాసి పోయితిరి. నూనె బొట్లు కూడా ఆ ప్రతిమీద నున్నవే" అని చెప్పగా సాక్షాత్తూ శ్రీ కృష్ణ పరమాత్మయే వచ్చినాడని తెలుసుకొని, పద్మావతి పుణ్యమును వేనోళ్ళ కొనియాడుచూ శ్రీ కృష్ణుడు తన భార్య పద్మావతికి దర్శనమిచ్చి నందున ఆ అష్టపదికి "దర్శనాష్టపది" అని నామకరణం చేసెను. ఈ అష్టపది యొక్క ఎనిమిదవ చరణమున.

**"జయతు పద్మావతీ రమణ జయదేవకవి**
**భారతీ ఫణీత మితిగీతం"**
**అని తన పేరుకు ముందుగా ఆమె పేరు పెట్టెనట.**

**సంజీవని అష్టపది**

అన్నమాచార్యులు కీర్తనలు ఆలపిస్తుంటే, శ్రీదేవీ భూదేవిలతో కలిసి వేంకటేశుడు నాట్యం చేసినట్లు, రామదాసు కీర్తనలకి రాముడే తానీషాకి కప్పం కట్టినట్లు, ఇలా భగవంతుడు భక్తుని భక్తికి పరవశించనిదెప్పుడని? అందునా, కదిలే పాదం పద్మావతియైన ఆ రాధది, రాసే కలం జయదేవుడైన ఆ జగన్నాథుడిది. మరి అటువంటి విశిష్టత కలిసినప్పుడు పుట్టిన అష్టపది సంజీవని కాకుండాపోతుందా? 19వ అష్టపది ఆ పేరుని సొంతం చేసుకుంది. దాని వెనుక ఆయన జీవితంలో జరిగిన మరో ఆశ్చర్యకర ఘటనే ఉంది.

జయదేవ కవి, భార్యయగు పద్మావతితో శ్రీ లక్ష్మణసేన మహారాజుచే గొప్పగా గౌరవింపబడు చుండెను. అది సహించలేని రాజుగారి భార్య రాణి తగిన సదవకాశమునకై వేచియుండెను. ఒకనాడు రాజు పరివారముతో కూడి జయదేవకవితో కలసి వేటకై వెళ్ళినాడట. రాణిగారు పద్మావతికి జయదేవ కవికి వైపరీత్యము జరిగినట్లు అబద్ధపు సమాచారమును తెల్పెనట. అంత పద్మావతి దుఃఖ సముద్రమున మునిగి అసువులు బాసెనట. ఇటువంటి విషాద సంఘటన జరుగునని రాణి ఈషణ్మాత్రమైనా యోచించలేదు. రాణి భయముచే ఒణికి పోసాగెను. కొంత సమయము తరువాత రాజు, జయదేవుడు వేట నుండి తిరిగి వచ్చి, జరిగిన సంఘటన చూచి, ఏమిచేయవలెనో తెలియక దిగులుపడిరి. అపుడు జయదేవుడు "తన మరణవార్త విన్నందువల్ల చనిపోయినది కాని ఇప్పుడు తాను బ్రతికే ఉన్నాను కదా" అని చెప్పి 19 వ అష్టపది అయిన "పదసీయతి" పాడి ముఖముపై నీళ్లు చల్లగా, ఆమె నిద్ర నుండి మేల్కొనినట్లు లేచి కూర్చుండినదట. ఈ అష్టపదిలో శ్రీకృష్ణ పరమాత్ముడు తన స్వహస్తములతో వ్రాసిన పంక్తులు ఉన్నాయి. కనుక ఆమె మరల పునరుజ్జీవము పొందినది. అందువల్ల ఈ అష్టపదికి "సంజీవని అష్టపది" అని పేరు కలిగినది.

జయదేవుడు స్వయముగా దేవాలయములలో అష్టపదులను పాడుతున్నప్పుడు పద్మావతి వాటికి నాట్యము చేసేదట. 21 వ అష్టపదిలో పద్మావతితో నున్నట్లు వ్రాయబడింది. ఉదా:



**విహిత పద్మావతి సుఖసమాజే**
**భణతి జయదేవకవి రాజరాజే**

మొదటి శ్లోకములోనే "పద్మావతీ చరణ చారణ చక్రవర్తి" అని జయదేవ కవి వ్రాసినాడు. అట్టి మహాకావ్యమును రచించి వాసికెక్కిన జయదేవ కవీంద్రుడు 65 సంవత్సరములు జీవించి శ్రీముఖ నామ సంవత్సర మార్గశిర బహుళ ఏకాదశినాడు (28-12-1156) విష్ణుసాయుజ్యమును పొందారు.

నేటికీ జయదేవుడి జన్మస్థలమైన "బిందుబిల్వం"లో జయదేవుడి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతూ వుండగా పూరీలోని జగన్నాథస్వామీ ఆలయంలో ప్రతిరోజూ అష్టపదుల గానం సాగుతూ వుంది.

దాదాపు తొమ్మిది వందల సంవత్సరాలు దాటిన నేటికీ అష్టపదుల అలరిస్తూ వున్నాయంటే – అష్టపదుల సాహిత్య, సంగీత కీర్తి ప్రతిష్టలు ఏమిటో అర్థం చేసుకోవచ్చు. జయదేవుడు రచించిన గీతగోవిందం నేటికీ నిత్యనూతనమై విరాజల్లుతూ అందరినీ అలరిస్తోంది.

జయదేవుడు కృష్ణ భక్తుడు. భార్య పద్మావతి నృత్యం, కృష్ణభక్తి ప్రేరణలతో జయదేవుడు రాధా, కృష్ణుల ప్రణయగాథను, భక్తితత్వాన్ని సంస్కృతంలో అష్టపదుల రూపంలో రచించాడు. సంస్కృతంలో అష్ట అంటే ఎనిమిది. ఎనిమిది చరణాలు గల పాటలు, శ్లోకాలు రచించటం వల్ల వీటికి అష్టపదులు అని పేరు. ఈ అష్టపదుల సంకలనమే 'శ్రీ గీతగోవిందం'. జయదేవుడు రాధాకృత, గోపికా కృత, గీత గోవిందం అని అర్థం వచ్చే విధంగా, శ్రీ గీతగోవిందం అని పేరుపట్టాడు. కానీ కాల క్రమేణా ఇది గీతగోవిందంగా ప్రసిద్ధి కెక్కింది. శ్రీ గీతగోవిందం గీతగోవిందంగా మారినట్టే 'శ్రీ జయదేవ' నామం కూడా జయదేవగా రూపాంతరం చెందినట్లు విమర్శకులు భావిస్తున్నారు. జయదేవుడు తన పేరునే ముద్రగా అష్టపదులలో పొందుపర్చాడు. అనేక అష్టపదులలో చివరి చరణంలో శ్రీ జయదేవ శబ్దం ప్రయోగితమవడమే ఇందుకు తర్కాణం.

సరళమైన పదాలతో, పాటలతో రాసిన గీతగోవిందం భారతీయ సాహిత్యంలో మొట్టమొదటి యక్ష గానమని చెప్పవచ్చు. శృంగార వర్ణనలతో కూడిన శ్రీ గీతగోవిందంలో మొత్తం 12 సర్గలు, 95 వివిధ వృత్త రచనలు, 78 శ్లోకాలు, 24 పాటలున్నాయి. గీత గోవిందంలోని 12 సర్గలు భాగవతం లోని 12 స్కంధాలకు మారురూపమని ఒక నమ్మకం. సకల వేదసారం గాయత్రి మంత్రంలోని 24 అక్షరాలలో నిక్షిప్తమయినట్టు, గీత గోవిందలో కూడా 24 ప్రబంధాలుండటం కాకతాళీయం కాదని గీతగోవిందం భాగవత స్వరూపమని మరో నమ్మిక. అందుకు తగినట్టుగానే అష్టపదులలో మొదటిది దశావతార అష్టపది కావటం విశేషం. 11 చరణాలు గల ఈ అష్టపదిలో జయదేవుడు విష్ణుమూర్తి దశావతారాలను వర్ణించాడు.

జయదేవుని గీతగోవిందం, సంగీతరత్నాకరం రాయటానికి దాదాపు రెండు, మూడు శతాబ్దాల ముందు పుట్టింది. గీతగోవిందాన్ని ఏఏ రాగాలలో పాడాలి అన్న మార్గదర్శకత్వం లేనందున సంగీతకారులు తమకు తోచిన రాగ, తాళాలలో అష్టపదులను ఆలపించారు, ఆలపిస్తున్నారు. సంగీతజ్ఞులు శ్రీ మంచాల జగన్నాథరావుగారు జయదేవుని అష్టపదులకు రాగ తాళ స్వర కల్పన చేస్తూ, తాళములకు సంబంధించి కొన్ని విషయాలను ప్రస్తావించారు. సాహిత్యము నందలి పద పొందిక గమనించినచో వాని ఛందస్సు స్పష్టంగా తెలుసుకోవచ్చని, దాని ఆధారంగా తాళములు కట్టవచ్చని వివరించారు. ఉదాహరణకు ఆరు మాత్రలు గల 'శ్రితకమలా కుచమండల' అనే అష్టపదిని రూపక తాళంలోనూ, 'రదసి యది కించిదపి' అనే అష్టపదిని ఐదు మాత్రలు గల జంపెతాళంలోనూ, 'మామియంచలితా విలోక్యా వృతం' అనే అష్టపదిని ఏడు మాత్రలు గల త్రిపుట లేదా సాకు తాళం లోనూ, 'లలిత లవంగ లతాపరిశీలన' అనే అష్టపదిని ఆది తాళంలోనూ పాడుకోవలెనని తెలిపారు. ఖచ్చితంగా ఈ ఈ రాగాలలో పాడాలన్న నిబంధన లేకపోయినా, జయదేవుడు మంగళ గుర్జరి, బారడి, దేశీ బారడి, గుజ్జరి, భారబి, వసంత, రామఖేరి, గుండఖేరి, దేశాఖ్య వంటి రాగాలలో గీతగోవిందమును గానం చేశాడని అంటారు. **(సశేషం)**

# నవవిధ భక్తిమార్గాలు

– డా|| కూర్మాచలం శంకరస్వామి

## 'వందనం'

నవవిధ భక్తి మార్గములలో వందన భక్తి ఒకటి. దీనికి ప్రతీకగా అక్రూరుణ్ణి పేర్కొన్నది భాగవతం. అక్రూరుడు అనగా క్రూరత్వము లేనివాడు. యదువంశ శ్రేష్ఠుడు. తనువెల్లా కృష్ణభక్తి పరాయణుడు.

**"వాసుదేవ శ్లోక వార్త లాలింపుచు**
**గాలమే పుణ్యుండు గడుపుచుండు**
**నతని యాయువు దక్క నన్యుల యాయువు**
**నుదయాస్తమయముల నుగ్రకరుడు**
**వంచించి కొనిపోవు వాడది యెఱుగన్**
**జీవింతు పెక్కేండ్లు సిద్ధమనుచు**
**నంగనా పుత్ర గేహారామ విత్తాది**
**సంసార హేతుక సంగ సుఖము**
**దగిలి వర్తింప గాలము తఱి యెఱింగి**
**దండధర కింకరులు వచ్చి తాడనములు**
**సేసికొని పోవ బుణ్యంబు సేయనైతి**
**బాపరతి నైతినని బిట్టు జలవరించు"**

వాసుదేవుని కీర్తి గాథలు వినుచు ఏ పుణ్యపురుషుడు కాలము గడుపుచుండునో అతని ఆయువు తప్ప ఇతరుల ఆయువులు వ్యర్థముగా ఉదయాస్తమయములచే తరిగిపోవుచున్నవని తెలియక అవివేకులు తాము చాలా కాలము బ్రతికెదమనే భ్రమలో దారా పుత్ర గృహ ఆరామ విత్తాది సంసార బంధములలో, సుఖ సంగములలో తగుల్కొని దేహాంతమున యమకింకరులచే కొట్టబడుచు ఈడ్చుకొని పోవుచున్నప్పుడు అయ్యో! పుణ్యకార్యములు చేయకుండా పాప కార్యములలోనే కాలము వ్యర్థము చేసితినే అని వాపోయెదరు.

కాని వాసుదేవునిపై సునిశ్చల భక్తి భావంతో అతని చరణారవిందములకు త్రికరణశుద్ధిగా నమస్కరిస్తూ, అతనినే హృదయము నిండా నింపుకున్న పరమ భక్తాగ్రేసరుడు అక్రూరుడు.

ధనుర్యాగ నెపంతో రప్పించి బలరామ కృష్ణులను చంపించాలనే ఉద్దేశ్యంతో వారిని ఆహ్వానించి మధురకు తోడ్కొని రమ్మని కంసుడు అక్రూరుని బృందావనానికి పంపించినప్పుడు అక్రూరుడు ఈ విధంగా తన మనసులో తలపోశాడు.

ఆహా! ఏమి నా భాగ్యము! పూర్వ జన్మలలో నాచే ఎట్టి తపములు చేయబడెనో, ఎట్టి సత్కర్మలు చేయబడెనో, అర్హులైన వారికెట్టి దానములియ్యబడెనో కదా! లేనిచో నావంటి వివేక శూన్యనకు ఆది మునీంద్రులకైనను, యోగదృష్టితో నైనను కానగలేని ఆ ఈశ్వరుని, బ్రహ్మమయుడైన శ్రీహరిని ఈవిధముగా దర్శించి తోడ్కొని వెళ్ళు భాగ్యము దక్కునా?



**"కనె నక్రూరుడు పద్మనేత్రులను రంగధాత్రులన్ ధేనుదో**
**హన వాటి గతులన్నలంకృతుల నుద్యద్భాసులన్ భీత నీ**
**ల నవీనోజ్జ్వల వాసులన్ గుసుమ మాలాధారులన్ ధీరులన్**
**వనితా కాముల గృష్ణరాముల జగద్వంద్య క్రమోద్దాములన్"**

బృందావనము చేరిన అక్రూరుడు పద్మముల వంటి అందమైన నేత్రములు కలవారును, చక్కని ఆకర్షణీయమైన శరీరమును కలవారును, గొల్లవారి గ్రామంలో ఉన్నవారును, బాగుగా అలంకరించుకొన్నవారును, తేజస్వినులు, నీల వర్ణములో మెరియుచున్న ధీరులను, గోపాంగనలు కోరువారును, పుష్ప మాలికలను ధరించినవారు, జగముల చేత పూజింపబడినవారిలో ముఖ్యులైన బలరామ కృష్ణులను చూశాడు. తమ ప్రాణములకు ప్రాణమైన కృష్ణుని మధురకు గొనిపోవుటకు అక్రూరుడు వచ్చాడని, ఈ దినమే బలరామకృష్ణులు వెళ్ళుచున్నారని గోపికలు కోప శోకములతో తపించిపోయి ఇట్లు తలపోసిరి.

ఈ కృష్ణుడు ఏమైన తక్కువవాడా! వాళ్ళు రమ్మనగానే ఆ మధురా నగరికి వెళ్ళిపోవుటకు సిద్ధపడెను గాని, నేను రాను, నన్నే సర్వస్వముగా నమ్ముకొన్న ఈ పడుచులను మన్మథుని బాణముల కెరవేసి పోయినచో మిక్కిలి తాపముచే మ్రగ్గిపోదురు

కదా! అని అనడేమి? పెద్దలైన గోపమ్మలు గాని, వృద్ధులు గాని ఈ ప్రయాణము వలదని చెప్పరేమి? అక్రూరుడని పేరు పెట్టుకున్న ఈ పెద్దమనిషి మన మనోవల్లభుడైన కృష్ణుని మననుండి వేరుచేసి కొనిపోవుటకు వచ్చి యున్నాడు. ఇతడు క్రూరుడట. అందుకే కృష్ణుని మనకు దూరము చేయుచున్నాడని గోపికలు ఎంతగానో విలపించారు. ఇందులో గోపికల ప్రేమైక భక్తిభావము కనబడుచున్నది.

**"అక్రూరుండని పేరు పెట్టుకొని నేడస్మన్మనో వల్లభుం**
**జక్రిన్ మా కడ బాపికొంచు నరుగన్ జర్చించి యేతెతంచినా**
**దక్రూరుడంట క్రూరుండీతడు నిజంబ క్రూరుండౌనేని**
**ర్వక్రత్వంబున గృష్ణు బెట్టి తన త్రోవంబో విచారింపడే"**

అక్రూరుడు బలరామకృష్ణులను రథములో తోడ్కొని పోవుచు దారిలో రథమును ఆపి కాళింది నదిలో స్నానం ఆచరించడానికి వెళ్ళాడు. రామకృష్ణులు రథమునందే ఉన్నారు. అక్రూరుడు నదిలో దిగి స్నానము చేయుచుండగా ఆ నది మధ్యలో రామకృష్ణులను జూచి ఒడ్డునున్న రథంలో కూర్చుని యున్న ఈ బాలురీ నది మధ్యకెట్లు వచ్చిరని ఆశ్చర్యముతో తలయెత్తి చూడగా వారిరువురు రథములో కూడా కనిపించారు. ఆహా! వారు భక్తుల మనోరథములను తీర్చువారు కదా! అని అక్రూరుడు వెఱగుపడెను. కృష్ణ బాంధవ్యుడు, యాదవ కులజుడు అయిన అక్రూరుడు ఆ నదీ జలమందు అద్భుత దృశ్యమును గాంచెను. ''సహస్ర శిరస్సులతో శోభిల్లువాడును, సర్వజగతికి రాజైన వాడును, భూభారమును మోయువాడును, కృప చూపుట యందు ఆసక్తి కలవాడును, శత్రు సేనలను జయించ అభిలాష కలవాడును, నిత్య సంతోషియు, అనేక విశేషములు గల ఆదిశేషుని అక్రూరుడు చూసి ఆశ్చర్య చకితుడయ్యెను. భగవంతుడు తనపై చూపిన కృపా కటాక్షములకు పట్టరాని సంతోషంతో ఆ పరమాత్మను అనేక విధాల స్తుతించెను.

**"నా ఇంటికి విచ్చేయుము**
**నీ యంఘ్రీ సరోజ రేణు నికరము సోకన్**
**నా ఇల్లు పవిత్రంబగు**
**శ్రీయుత! నీ భటుని బెద్ద సేయం దగదే"**

అక్రూరుడు బలరామ కృష్ణులను సద్భక్తితో మధురా నగరానికి జేర్చి తన ఇంటికి రండని సాదరముగా ఆహ్వానించాడు. ప్రభూ! నా ఇంటికి విచ్చేయుము. నీ పాద రజము సోకిన నా ఇల్లు పవిత్రమగును. స్వామీ నీవు వచ్చి ఈ సేవకునకు గౌరవము చేకూర్చు ఓ శ్రీనాథా! అని మనసారా ప్రార్థించెను. అంత బలరామకృష్ణులు అతని కోరికను మన్నించి అతని ఇంట అడుగుపెట్టి అక్రూరుని సేవలను గైకొని అతనిని ఆనందింప చేశారు. ఆ తరువాత అక్రూరుడు ఈ విధముగా స్తోత్రము చేయసాగాడు. ''ఓ స్వామీ! సర్వ కారణములకు పరమ కారణుడవు. ఆది అవ్యయ పురుషుడవు, నారాయణుడవు అయిన నీకు నేను నమస్కరిస్తున్నాను. నీ నాభి కమలము నుండే ఈ విశ్వానికి సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు ఆవిర్భవించాడు. అతడు ఈ జగత్తుకు కారణము కాబట్టి నీవు సర్వకారణ కారకుడవయ్యావు. పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, అహంకారము, మహత్తత్వము, ప్రకృతి, తటస్థ శక్తిస్వరూపులైన జీవులు, మనస్సు, ఇంద్రియములు, తన్మాత్రలు, లోక వ్యవహారాలను నియంత్రించే దేవతల వంటి జగత్తులోని తత్త్వములన్నీ నీ దివ్య దేహము నుండే ఉత్పన్నమయ్యాయి. అయినా ఎప్పుడూ నీ దివ్యరూపాన్ని తెలుసుకొనలేరు. భౌతిక జగత్తులోని ప్రతి ఒక్కరు నీ త్రిగుణ ప్రభావితులే అయి ఉంటారు. ప్రకృతి ప్రభావంచే కప్పబడినందున దేవతలే ప్రకృతి త్రిగుణాలకు అతీతమైన నీ దివ్యరూపాన్ని యథారూపంగా తెలుసుకొనలేరు. ఋషులు, యోగులు నిన్ను దేవాది దేవునిగను, సకల జీవుల పరమ కారణముగను, సమస్త జగత్తుగను, సకల దేవతలుగను అర్చిస్తారు. సమస్తము కూడియున్న వానిగా వారు నిన్ను పూజిస్తారు. కొందరు బ్రాహ్మణులు నిన్ను వేదానుష్ఠానము ద్వారా ఉపాసిస్తారు. వివిధ దేవతల పేరిట యజ్ఞ నిర్వహణ గావిస్తారు. కొందరు దివ్యజ్ఞానోపాసనలో అభిరుచిని కలిగి ఉంటారు. పరమ ప్రశాంతులైనవారు నానా రకాలైన లౌకిక కలాపాలను విడిచి జ్ఞాన యజ్ఞంలో అనగా నిన్ను గురించి తాత్త్వికాన్వేషణలో మునిగిపోతారు.

భాగవతులని తెలియబడే భక్తులు నిన్ను భగవంతునిగా కొలుస్తారు. పంచరాత్ర పద్ధతిలో విధిగా దీక్షితులైన తరువాత వారు దేహమును తిలకాలతో (బొట్టు) అలంకరించుకొని నీ వివిధ విష్ణు మూర్తి రూపాలను పూజిస్తారు. వివిధ ఆచార్యులను అనుసరిస్తూ శైవులని పిలువబడే ఇతరులు శివుని రూపంలో నిన్నే ఉపాసిస్తారు. అందువల్ల నీకు నమస్కారం.

''వివిధ దేవతారాధనము కూడా పరోక్షంగా భగవదారాధనమేనని భగవద్గీతలో చెప్పబడింది. ఆరాధనీయ భగవంతుడు నారాయణుడే కనుక అట్టి అర్చనము విధిపూర్వకమైనది కాదు. బ్రహ్మ రుద్రాది దేవతలు, గుణవతారములు, ఆ గుణములు కూడా నారాయణుని నుండే ఉద్భవించాయి. నిజానికి సృష్టికి పూర్వము దేవదేవుడగు నారాయణుడే తప్ప వేరెవరూ లేరు. కనుక దేవతారాధనము నారాయణార్చనముతో సమానము కాదు''.

''దేవతారాధకుల చిత్తములు ఒకానొక దేవతపై లగ్నమై ఉన్నప్పటికీ దేవతలతో పాటు జీవులందరికీ నీవే పరమాత్ముడవు. దేవతార్చనము పరోక్షముగా నీకే చెందుతుంది కావున నీకు నమస్కారం''.

''వానాకాలంలో కొండల నుండి ప్రవహించే సెలయేళ్ళు సముద్రానికి చేరవచ్చును. లేదా చేరకపోవచ్చును. అలాగే దేవతారాధకులకు నీ దర్శనం కలగవచ్చును. లేదా నీ దర్శనం

కలగకపోవచ్చును. వేద నియమానుసారము ఉపాసకుడు ఏదేని దేవతను ఉపాసిస్తే కొంత అనుష్ఠానాన్ని నారాయణునికి కూడా సమర్పిస్తాడు. ఎందుకంటే భగవద్గీతలో పేర్కొనబడినట్లు దేవతలు తమను ఆరాధించే వారి కోరికలను నారాయణుని అనుమతి లేనిదే తీర్చలేరు. భగవద్గీతలో దీని గురించి ''మయైవ విహితాన్ హితాన్'' అని చెప్పబడింది. అంటే భగవంతుని చేత అంగీకరింపబడిన తరువాతే దేవతలు ఏదో కొంత వరాన్ని ప్రసాదించగలరు. ఇతర దేవతలను సర్వస్వముగా భావించేవారు చరమ గమ్యాన్ని ఎన్నడూ చేరుకోలేరు. కనుక సర్వాంతర్యామియైన నీకు నమస్కారం.

దేవా! జగత్తు మొత్తము సత్వ రజో స్తమో అనే త్రిగుణాలతో నిండి యున్నది. బ్రహ్మ మొదలుకొని చెట్లు చేమల వరకు ప్రతి జీవుడు ఈ గుణములతోటే కప్పబడి ఉన్నాడు. ప్రభూ! త్రిగుణ ప్రభావానికి అతీతుడవైన నీకు వందనములు. దేవా! అగ్ని నీ ముఖము, ధరణి నీ పాదములు, సూర్యచంద్రాదులు నీ నేత్రములు, ఆకాశము నీ నాభి, దిక్కులు నీ శ్రవణేంద్రియములు, అంతరిక్షము నీ శిరము, దేవతలు నీ బాహువులు, సముద్రములు నీ ఉదరము, వాయువు నీ బలము, ప్రాణము, వృక్షములు, ఓషధులు నీ శిరముపై నుండే రోమాలు, మేఘాలు నీ శిరోజములు, పర్వతములు నీ ఆస్థులు, నఖములు, దివారాత్రులు నీ రెప్పపాటులు, వర్షము నీ వీర్యము.

దేవా! వివిధ తరగతులకు చెందిన దేవతలు, పాలకులు, రాజులతో పాటు సకల జీవులు నీయందే నిలిచి యున్నారు. ప్రయోగాత్మక జ్ఞానం ద్వారా ఎవ్వరూ నిన్ను తెలుసుకోలేరు. నానా రకాలైన జలచరాలు నిండి యున్నట్టి మహాసముద్రముగాను, లేదా పలు చిన్న చిన్న కీటకాలు కలిగియుండే మేడిపండు లాగా మాత్రమే నీ రూపాన్ని వారు తెలుసుకోగలుగుతారు. జగత్తులో నీవు అరుదెంచినప్పుడు ధరించే నిత్య రూపాలు, అవతారాలు జీవులకు అజ్ఞానము, మోహము, శోకము నుండి విముక్తి చేయదానికే ఉద్దేశించబడినాయి. కనుక జనులందరూ నీ అవతారాలను, లీలలను అర్థం చేసుకొని నీ కర్తలను నిరంతరము కీర్తించగలరు. ఇంతవరకు నీవు ఎన్ని అవతారాలెత్తావో, నీయందు ఎన్ని విశ్వాలున్నాయో ఎవ్వరికీ తెలియదు. సర్వకారణ కారణుడవైనప్పటికీ ప్రళయ సముద్రములో మత్స్యమూర్తిగా అవతరించినట్టి నీకు నా వందనములు. మధుకైటభులనే దానవులను వధించిన హయగ్రీవునికి వందనములు. పాల సముద్ర మథనమునకు సహకరించిన మందర పర్వతాన్ని మోసిన మహా కూర్మావతారునికి వందనములు. గర్భోదక సముద్రములు పడిన ధరణిని కాపాడిన వరాహమూర్తి అవతారునకు వందనం. దానవుల దురాగతాలనే భీతికరమైన పరిస్థితి నుండి రక్షించిన నృసింహ అవతారమూర్తికి వందనములు. వామనదేవునిగా అవతరించి కేవలం నీ పదములను చాచి ముల్లోకాలను ఆక్రమించిన నీకు వందనములు. దురహంకారులైన ప్రపంచ రాజులను వధించడానికి భృగుపతిగా అవతరించిన నీకు వందనములు. రావణాది దైత్యులను వధించడానికి శ్రీరామునిగా అవతరించిన నీకు వందనములు. నీవు భక్తులందరిచే రఘువంశ శ్రేష్ఠుడు శ్రీరామచంద్రునిగా పూజింపబడుచున్నావు. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులుగా అవతరించిన నీకు వందనములు. దానవులను, నాస్తికులను మోహపరచడానికి బుద్ధునిగా అవతరించే నీకు వందనములు. అత్యంత హేయమైన మ్లేచ్ఛులను దండించడానికి అవతరించబోయే కల్కి రూపానికి వందనములు.

దేవా! ఈ భౌతిక జగత్తులో ప్రతి ఒక్కరూ నీ మాయకు బద్ధులే. మిథ్యా తాదాత్మ్యము, మిథ్యా మమత్వభావనలో ప్రతి ఒక్కరూ కర్మఫలాల మార్గంలో నానా రకాలైన దేహాలను పొందుతున్నారు. నేను కూడా అటువంటి బద్ధజీవులలో ఒకడినే. ఇల్లు, ఇల్లాలు, సంతానం, సంపత్తి, బంధువులు మున్నగునవి పొంది సుఖినని మిథ్యగా తలచాను. కానీ ఇవన్నీ నశ్వరాలు కనుక నేను స్వప్న జగత్తులో వర్తించినట్లే అయింది. మూర్ఖుడనై వాటిని శాశ్వతాలనే మిథ్యా తాదాత్మ్య కారణంగానే శాశ్వతమైన వాటిని గమనించలేకపోతున్నాను. సదా ద్వంద్వాలలో చిక్కుకుని దివ్యానంద నిధియైన నిన్ను మరచిపోయాను. నీటి బావిని విడిచి ఎడారుల వెంట పరుగెత్తాను. కళ్ళెము వేయని ఇంద్రియాలచే నడువబడుతూ కామ్యకర్మలకు ఆకర్షితుడనై ఇంద్రియ నియంత్రణ కోల్పోయాను. అందుకే నా బుద్ధి ఇలా మారింది. ప్రభూ! బద్ధస్థితిలో ఏ వ్యక్తి అయినా నీ పాద పద్మాలను పొందలేడు. కాని ఏదో విధంగా నేను నీ పాద పద్మాల దగ్గరకు చేరుకోగలిగాను. ఇది నాపై నీ నిర్హేతుక కరుణా ప్రభావంగా నేను భావిస్తాను. పరమ నియామకుడవు కనుక కోరిన రీతిగా నీవు వర్తించగలవు. నిరంతర జన్మ మృత్యువు నుండి ముక్తిని పొందడానికి ఒక వ్యక్తి యోగ్యుడైనాడంటే కేవలం నీ నిర్హేతుక కరుణ వలననే అతడు నీ పాదపద్మాల దరిజేరి భక్తియందు అనురక్తుడవుతాడని నేను అర్థము చేసుకోగలిగాను. అందులకు నీకు వందనములు.

ఆ తరువాత అక్రూరుడు భగవంతుని ముందు మోకరిల్లి పలుకుతూ దేవా! నీ దివ్యమైన శాశ్వత రూపము జ్ఞానపూర్ణమైనది. నీవే సమస్త జ్ఞానానికి ఆదిమూలము. కనుక కేవలము నీ రూపముపై మనసును లగ్నము చేయడం ద్వారా మనిషి సమస్తాన్ని సంపూర్ణంగా తెలుసుకోగలుగుతాడు. నీవు పరమ శక్తి సంపన్నుడవు. పరబ్రహ్మము. నీవే సర్వభూతాశ్రయుడవైన వాసుదేవుడవు. అట్టి నీకు వందనములు అని ప్రార్థించగానే ఆ దయార్ద్ర హృదయుడైన శ్రీకృష్ణ పరమాత్మ అక్రూరునకు మోక్షాన్ని ప్రసాదించాడు. వందన భక్తి ద్వారా ముక్తి ఎలా పొందగలమో ఈ కథ నిరూపిస్తుంది.

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

వారావిధంగా ఆ పర్వతంపై కూర్చొని ఉండగా వృక్షసమూహాలతో అలంకృతమైన ఆ పర్వత శిఖరానికి పూజ్యులు, జ్ఞానులు అయిన దేవగురువు బృహస్పతి, దైత్యుల గురువు శుక్రాచార్యుల వారు విచ్చేశారు. అలాగే భగవద్భక్తుడైన ఉపచరవసు మహారాజు కూడ అక్కడికి ఏతెంచాడు. ఆయన నిరంతరం భగవంతుడైన శ్రీకృష్ణుని హృదయంలో ధ్యానిస్తూంటాడు. పూర్వం బ్రాహ్మణ శాపం వలన ఆయన పాతాళంలో పడిపోగా సంసారసాగరము నుండి వలె ఆ పాతాళం నుండి ఆయనను శ్రీహరి ఉద్ధరించాడు అని వామదేవ మహర్షి చెప్పగా జనక మహారాజు వామదేవుని 'మహర్షీ! మీరు చెప్పేది చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆ ఉపరిచరవసు మహారాజు బ్రాహ్మణ శాపంతో పాతాళంలో ఎలా పడిపోయాడు? గహనమైన సంసారమనే అరణ్యము నుండి వలె ఆయన్ని శ్రీహరి ఎలా ఉద్ధరించాడు? ఇదంతా సంపూర్ణంగా వినాలని ఉంది. మీరు నారాయణుని ఆశ్రయించిన వారగుట వలన నాయందు అనుగ్రహంతో చెప్పండి' అని ప్రార్థించాడు.

అంతట సర్వశాస్త్ర విశారదుడైన వామదేవ మహర్షి జనకుని ప్రార్థన విని 'మహారాజా! మీరడిగిన విషయం వివరిస్తాను. వినండి' అని యిలా చెప్పనారంభించాడు. ఈ చరిత్ర మహాశ్చర్యమైన పుణ్యప్రదమైన ప్రాచీన చరిత్ర ఇది. పూర్వం ఒకానొకప్పుడు ఋషులు, ఇంద్రాది దేవతలు, ఒక ధర్మ సందేహం కలిగి దాని నివారణకై ఉపరిచరవసు మహారాజు వద్దకు బయలుదేరాడు.

### ఉపరిచరవసు వృత్తాంతం

ఇంతలో అనుకోకుండా దారిలో వసుమహారాజు వారిని కలిశాడు. దేవతలు, ఋషులు అతనికి ఎదురేగి స్వాగతం పలికారు. తన వద్దకు వచ్చిన దేవతలను బ్రహ్మర్షులను చూచి ధర్మాత్ముడైన ఆ రాజు తన ఆసనం నుండి లేచి వారిని యథావిధిగా పూజించాడు. ఆ విధంగా ఆరాధించి వారికి నమస్కరించి అంజలి బద్ధుడై కుతూహలంతో ఇలా అడిగాడు.

ఓ మహాత్ములారా! త్రిలోకపూజ్యులు, వేద వేదాంగ పారంగతులు అయిన మీరు నేడు నా వద్దకు వచ్చారు. అందువల్ల నేను కృతార్థుడనయ్యాను. మీరంతా ఈ ఆసనాలపై ఆసీనులు కండి. ఓ పవిత్రులైన బ్రహ్మర్షులారా! దేవతలారా! మీరంతా నన్ను అనుగ్రహించండి' అని చెప్పి వారికి మణిమయమైన బంగారు బొమ్మలు గల దేదీప్యమానంగా వెలుగొందుతున్న మహాసనాలను సమకూర్చాడు.

ఆ దేవతలు, ఋషులు అదరూ తమతమ ఆసనాలపై



కూర్చున్న తరువాత 'చేది' రాజైన వసువు చేతులు జోడించి సంతోషంతో 'ఓ మునిశ్రేష్ఠులారా! మీరందరూ ఏ పనిమీద యిక్కడకు వచ్చారు? మీకు నేనేమి సహాయం చేయాలి? ఇదంతా నాకు సవిస్తరంగా తెలియజేయండి' అని వారిని అడిగాడు. వసుమహారాజు ఈ విధంగా అడుగగా ధర్మసంశయగ్రస్తులై వచ్చిన దేవతలు, మునులు ఆ రాజుతో ఇలా అన్నారు.

## మహర్షుల ధర్మసందేహం

'రాజా! మాకొక ధర్మసందేహం వచ్చి మేమంతా నీ దగ్గరకు వచ్చాము. నీవు మా ధర్మసందేహాన్ని తీర్చు'. మహారాజా! సత్పురుషులు పశువుతో యజ్ఞం చేయాలా లేక ఓషధులతో చేయాలా? దీనిని యథార్థంగా చెప్పు మా ఈ సందేహాన్ని పోగొట్టు. మాకు నీవే ప్రమాణం అని అడుగగా వసుమహారాజు వారికి నమస్కరించి 'ఓ మహాత్ములారా! మీలో ఎవరి అభిప్రాయమేదో వాస్తవంగా చెప్పండి' అని అడుగగా ఆ మహర్షులు యిలా అన్నారు -

'అయ్యా! మాలో రెండభిప్రాయాలున్నాయి. మహారాజా! ఋషులమైన మేము భగవంతుని ధ్యాన యజ్ఞంతో ఆరాధించాలంటున్నాం. దేవతలు పశువుతోనే యజ్ఞం చేయాలంటున్నారు. కాబట్టి ఏది శ్రేష్ఠమో చెప్పండి. వారి మాటలు విని ఆత్మజ్ఞానియైన వసుమహారాజు వారికి సమాధానం చెప్పడానికై తన మనస్సులో ఇలా అనుకున్నాడు -

'దేవతలు, మహర్షులలో దేవతలు మొదట పూజింపదగినవారు కదా! కాబట్టి నేనిప్పుడు దేవతల పక్షాన్నే సమర్థిస్తాను' అని ఈ విధంగా తలంచి దేవతల అభిప్రాయం తెలిసిన వసువు వాళ్ళ పక్షాన్ని సమర్థిస్తూ 'మేకతోనే యజ్ఞం చేయవలెను' అని దేవతలు అంటున్నారు కదా! అదే సరైనది. వేరే విధంగా చేయరాదు అని చెప్పాడు.

## మహర్షుల శాపంతో వసువు పాతాళానికి వెళ్ళుట

వసుమహారాజు యిలా చెప్పగానే దానిని విన్న మహర్షులు క్రోధతామ్రాకక్షులై రాజుతో ఇలా అన్నారు. 'ఓ వసురాజా! నీవు చెప్పింది పరమ ధర్మం కానిచో నీకు యిష్టం లేకపోయినా, నీవు ఘోరమైన పాతాళ లోకాన్ని ప్రవేశించుదువు గాక! ఒకవేళ నీవు చెప్పిందే పరమ ధర్మమైతే మేమా పాతాళాన్ని ప్రవేంచుదుము గాక! దేవదేవుడు, సకల జగత్స్రష్ట, సర్వాంతర్యామి, పద్మలోచనుడు, పరమేశ్వరుడు, కృష్ణుడు అయిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు ఒక్కడే ఈ ధర్మతత్త్వం తెలిసినవాడు. ఆ దేవదేవుడైన మధుసూదనుడు తప్ప ఈ లోకంలోని ఇతరులెవ్వరూ దానిని ఎరుగరు. ఒకవేళ పితామహుడైన బ్రహ్మదేవునికి తెలిస్తే తెలిసి ఉండవచ్చు. అలాగే త్రిపురాంతకుడు, దేవతాశ్రేష్ఠుడు అయిన సాక్షాత్తు శంకరునకు తెలుసు. ఆయనను సర్వభూత సంహర్తగా పూర్వులు చెప్పారు. కాబట్టి ఆయనకు ఈ ధర్మతత్త్వం తెలుసు.

రాజా! వారావిధంగా అనగానే ఆ చేది రాజు అయిష్టంగానే భయంకరమైన, దుర్గమమైన అధఃపాతాళంలో పడ్డాడు. ఆ విధంగా పడుతూ ఆ వసురాజు పరమ భక్తియుక్తుడై అఘటఘటనా సమర్థుడైన శ్రీకృష్ణుని, దేవదేవుడు, సకల లోకరక్షకుడు అయిన మధుసూదనుని హృదయంలో ధ్యానించాడు. అప్పుడు ఆ పాతాళ బిలంలో వీస్తున్న వాయువు. 'ఇతడు విష్ణుభక్తు' దని తెలుసుకొని ఆయనను పరమప్రీతితో పట్టుకొని ఆ చేది రాజును వాయుదేవుడు రాక్షసులు నివసించే ఆ పాతాళ లోకంలో నెమ్మదిగా చేర్చాడు.

భూలోకంలో ప్రసిద్ధి చెందిన ఆ చేదిరాజు పాతాళలోకం ప్రవేశించి తన మనస్సులో దేవదేవుడు సర్వేశ్వరుడు, అచ్యుతుడు, వాసుదేవుడు, సురాధ్యక్షుడు, శంఖ చక్ర గదాధారి, సృష్టి స్థితి లయ కారకుడు, అఘటన ఘటనా సమర్థుడు, సమస్త లోకాలకు ప్రభువు, జగన్నియంత అయిన శ్రీకృష్ణుని, శ్రీహరిని ధ్యానిస్తు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరీ మహామంత్రాన్ని జపించాడు. ఆయన ఇంద్రియాలన్నిటిని నిగ్రహించి, పరమ భక్తియుక్తుడై ఘోరమైన పాతాళంలో ప్రవేశించినప్పటికీ విషాదాన్ని పొందలేదు. శోకాన్ని గాని, మోహాన్ని గాని, భయాన్ని గానీ ఆ రాజు పొందలేదు. అంతట పాతాళ లోకంలో ప్రవేశించిన చేది రాజును చూసి రాక్షసులు పూర్వవైరాన్ని గుర్తు తెచ్చుకొని ఆయన్ను చంపుటకై వందలు, వేల దైత్యులు గుమిగూడి శస్త్రాస్త్రాలు ధరించి వచ్చారు. వారంతా మహాబలవంతులు, మహావీరులు, పెద్దపెద్ద భయంకరమైన కోరలు గలవారు. మహాతేజస్సంపన్నులు. వారంతా గుమికూడి మహాత్ముడు, ఆజానుబాహువైన చేదిరాజును చుట్టుముట్టారు. వారంతా వేగంగా ఆయనపై అస్త్రశస్త్రాలు ప్రయోగించారు. కాని వారా మహాత్ముని సంహరించలేకపోయారు. అనేక భయంకరమైన శస్త్రాలు, బ్రహ్మాస్త్రం మొదలైన అస్త్రాలు ఆయన్నేమీ

చేయలేక పోయినాయి.

అంతట బుద్ధిమంతుడైన అతనిని రక్షించుటకై భగవంతునిచే ఆజ్ఞాపించబడిన సుదర్శన చక్రం అక్కడకు వచ్చింది. పాతాళలోకానికి వచ్చిన ఆ సుదర్శన చక్రం యొక్క తేజస్సును వారు చూడలేకపోయారు. దుర్భేద్యమైన ఆ సుదర్శన చక్రాగ్నిలో ఆ రాక్షసులు ప్రయోగించిన శస్త్రాస్త్రాలన్నీ అగ్నిలో మిడతల వలె భస్మమైపోయినాయి.

అంతట ఆ పాపాత్ములైన రాక్షసులు వచ్చిన దారినే వెళ్ళిపోయారు. ఓ మిథిలాధీశా! రాజర్షియైన వసువు మధుసూదనుని చింతిస్తూ తనకిష్టమైన స్తోత్రాలతో ఆ పురుషోత్తముని స్తుతించాడు.

## భగవంతుడు గరుడుని పంపుట

భగవంతుడు, దేవదేవుడు చేదిరాజైన వసువు పాతాళంలో ఉన్నాడని తెలుసుకొని బ్రాహ్మణశాపంతో పాతాళంలో పడిన అతనిని ఉద్ధరించడానికై సర్వేశ్వరుడు, సర్వసముడు, సర్వవ్యాపకుడు, పరాత్పరుడు, పరమ పురుషుడు, పరమాత్మ, సనాతనుడు, తెలియబడని రూపం కలవాడు, విశ్వాంతర్యామి, విష్ణువు, నారాయణుడు, శేషశాయి, మధుసూదనుడు, భక్తులయందు దయకలవాడు, దేవాదిదేవుడు, పాలసముద్రంలో నివసించేవాడు, శుభనేత్రములు కలవాడు అయిన జగన్నాథుడు గరుత్మంతుని స్మరించాడు. వెంటనే వినతానందనుడైన గరుత్మంతుడు శ్రీహరి సమీపాన నిలిచాడు. తన వద్దకు వచ్చిన గరుత్మంతుని చూసి జగత్ప్రభువైన సాక్షాత్ శ్రీమన్నారాయణుడు మేఘగంభీరమైన పలుకులతో ఇలా అన్నాడు -

ఓ వైనతేయా! నాకు చాలా ఇష్టుడైన ఉపరిచర వసువు బ్రాహ్మణుల శాపం వలన భయంకరమైన పాతాళంలో పడిపోయాడు కదా! అతడు పాతాళంలో పడిపోయినప్పటికినీ నాయందే మనస్సు పెట్టి మిక్కిలి భక్తితో నన్నే నిరంతరం స్మరిస్తూ ధ్యానిస్తున్నాడు. నీవు నా ఆజ్ఞమేరకు అతనిని పాతాళలోకం నుండి ఉద్ధరించి భూలోకంలో అతని స్వదేశానికి తీసుకొని రా! నీవు వెంటనే వెళ్ళు. నా భక్తుడైన ఆ రాజర్షి వసువు నిర్మలుడు. అటువంటి పుణ్యాత్ముడు ఈ విధమైన దురవస్థ ననుభవించుటకు అర్హుడు కాదు. కాబట్టి నీవు వెంటనే వెళ్ళి అతనిని భూలోకానికి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించాడు.

శ్రీహరి ఆదేశం మేరకు గరుత్మంతుడు అతివేగంగా రసాతలానికి వెళ్ళాడు. రాజా! అతనావిధంగా వెళుతుండగా అతని రెక్కల వేగానికి ఆ పాతాళంలోని నాగులు వందల కొలది పడిపోయినాయి. అక్కడ నివసించే రాక్షసులు కూడా ఆ గరుడుని పరాక్రమానికి, వేగానికి భయపడి క్రిందపడి పోయాడు. సముద్రాలన్నీ క్షోభించినాయి. పర్వతాలు కంపించినాయి. పెద్ద పెద్ద మహావృక్షాలు, కొమ్మలు విరిగి వేళ్ళతో సహా నేలకూలినాయి. ఆకాశంలో సంచరించే దేవతలు స్వర్గానికి వెళ్ళిపోయారు.

ఆ విధంగా గరుత్మంతుడు మహావేగంతో పాతాళంలో ప్రవేశించి అక్కడ కూర్చొని ఉన్న చేదిరాజైన వసువును దర్శించాడు. ఆయన జగత్ ప్రభువు, పురుషోత్తముడు అయిన శ్రీహరిని స్తుతిస్తూ ఉన్నాడు. ఆ వసురాజు గరుత్మంతుని చూసి వెంటనే లేచి అంజలిబద్ధుడై నమస్కరించి భక్తితో పూజించాడు. గొప్ప పరాక్రమవంతుడైన గరుడుడు కూడా ఆ రాజును పూజించి మందహాసంతో అతనిని సంతోషింపచేస్తూ ఇలా అన్నాడు - మహారాజా! అఘటఘటనా సమర్థుడు, సృష్టిస్థితిలయకారకుడు, మహాతేజశ్శాలి అయిన శ్రీమహావిష్ణువు నన్ను 'నీవు పాతాళానికి వెళ్ళి పరమభక్తితో నాయందే మనస్సు ఉంచి నన్నే కీర్తిస్తున్న నా భక్తుడైన వసువును భూలోకానికి తీసుకు వెళ్ళడానికి వచ్చాను. నీవు నాపై అధిరోహించు' అన్నాడు.

వైనతేయుడు ఇలా అనగా ఉపరిచరవసు మహారాజు గరుత్మంతునితో పరమప్రీతితో 'గరుత్మంతా! గోవిందుడు, నీలమేఘశ్యాముడు, పద్మనేత్రుడు, జగద్రక్షకుడు, శంఖచక్రగదా ధరుడు అయిన శ్రీమహావిష్ణువు అధిరోహించే నీ వీపుపై నేను అధిరోహింపజాలను. భగవానుడు అధిరోహించే చోట నేను కూర్చుండుట ఉచితము కాదు' అన్నాడు.

**తప పృష్ఠం 'సలీమూరోఢుం న చేచ్ఛామి శుభేక్షణ |**
**యత్రారోహతి గోవిందః కృష్ణః శుభవిలోచనః ||**
**నాథశ్చ జగతాః ధాతా యస్మింశ్చక్రగదాధరః |**
**ఆరోహతి మయా తస్మిన్ ఆస్థాతుం నైవ చోచితమ్ ||**

**- వామనపురాణం, అ.32, శ్లో.84,85**

చేదిరాజైన వసువు ఇలా అనగా గరుత్మంతుడు అతనితో 'రాజా! నీకు తగ్గట్టుగానే మాట్లాడావు' అని చెప్పి అతనిని తన బాహువులతో ఆలింగనం చేసుకొని మరల మరల ఆయన్ను మెచ్చుకొన్నాడు. గరుత్మంతుడు వెంటనే ఆ రాజును తన బాహువులతో గట్టిగా పట్టుకొని మహావేగంతో మహాపరాక్రమము, గొప్పదంష్ట్రలు, గొప్ప మనస్సు కలిగిన ఆ గరుడుడు ఆకాశానికెగిరాడు. అప్పుడతని రెక్కల వేగానికి ఆ పాతాళ లోకంలోని వారంతా చాలా భయపడ్డారు. గొప్పగొప్ప మహాసర్పాలు నలుదిక్కులకూ వెళ్ళిపోయినాయి. మహాపరాక్రమవంతులైన రాక్షసులు, వేలకొలది దానవులు కృష్ణభగవానుడొస్తున్నాడనే భయంతో పదిక్కులకు పారిపోయారు. మహాప్రతాపవంతుడైన వైనతేయుడు పాతాళం నుండి పైకి వచ్చి ఆ చేదిరాజైన వసువును అతని దేశానికి తీసుకొని వెళ్ళి తన చేతులలో నుండి దింపి 'రాజా! నీవిక్కడే ఉండు' అని చెప్పి వెళ్ళిపోయాడు.

రాజర్షియైన వసుమహారాజు తన రాజ్యాన్ని పొంది సమస్త భోగాలను అనుభవిస్తూ భూమిని పరిపాలించాడు.

సర్వజీవవాసి, జగద్ధర్త, ఆద్యంతరహితుడు, అయిన శ్రీమహావిష్ణువు అనుగ్రహం వలన ఆ వసుమహారాజు



చివరకు మోక్షాన్ని పొందాడు. 'జనక మహారాజా! పూర్వం జరిగిన వసుమహారాజు వృత్తాంతాన్ని నేను మీకు చెప్పాను. శ్రీమన్నారాయణుని ఆశ్రయించిన పరమ భాగవతోత్తముడైన ఈ వసుమహారాజు చరిత్రను భక్తితో పఠించి ఆ అచ్యుతునికి జగత్ప్రభువుకు నమస్కరించే వారు ఉత్తమగతిని పొందుతారు. మహారాజా! శ్రీమన్నారాయణుని ఈ పవిత్రచరిత్రను శ్రద్ధతో వినేవారు, వినిపించేవారు భగవంతునియందు భక్తిని కలిగి ఉంటారు. వారు సర్వపాపాలనుండి వెంటనే విముక్తులవుతారు. పాతాళము నుండి చేదిరాజైన వసువును ఉద్ధరించినట్లే భగవంతుడు అయిన వాసుదేవుడు, శ్రీకృష్ణుడు, దయానిధి, లోకేశ్వరుడు, సకలాభీష్ట ప్రదాత అయిన శ్రీహరి వారిని సంసారసాగరం నుండి ఉద్ధరిస్తాడు.

**నారాయణేతిహాసం యః శృణోతి శ్రావయిష్యతి ।**
**శ్రద్ధయా భగవద్భక్తి ప్రాప్నోతి స నరాధిప! ॥**
**ముచ్యన్తే తే నరాః సద్యో దుష్కృతైః సకలైర్నృప ।**
**ఉద్ధియంతే చ సంసారాత్ పాతాలాచ్చేదిరాడివ ॥**
**- వామనపురాణం, అ.32, శ్లో.97,98**

## భగవత్సాక్షాత్కారం

ఆ తరువాత ఉపరిచరవసువు, బృహస్పతి, శుక్రాచార్యులు ముగ్గురు ఆశ్చర్యకరమైన వేంకటాచలానికి బయలుదేరారు. దాని శిఖరం మేరు పర్వత శిఖరం వలె ఉన్నది. అనేక గైరికాది ధాతువులచే అలంకరింపబడి ఉన్నది. పరమైశ్వర్య సంపన్నమై మహాతేజస్సుతో ప్రకాశిస్తున్నది. అటువంటి ఉన్నత శిఖరాలతో ఆ పర్వతం విరాజిల్లుతున్నది. మహారాజా! ఆ పర్వతంపై వందల కొలది మహర్షులు ఆసీనులై ఉన్నారు.

సూర్య సమాన తేజశ్శాలురైన అగస్త్యాది మహర్షులందరూ ప్రజ్వరిల్లు తున్న అగ్నులవలె థదిశలను ప్రకాశింపజేస్తూ అక్కడకు విచ్చేశారు. బృహస్పతి, శుక్రాచార్యులు, వసువు అక్కడకు చేరి వారిని దర్శించారు. ఆ మహర్షులందరు విచారంతో విషణ్ణవదనులై ఆ పర్వత శిఖరంపై కూర్చొని ఉన్నారు. అపర సూర్యులవలె విచ్చేసిన వారిని చూసి ఆ మహర్షులందరు లేచి నిలబడ్డారు. ఆ ముగ్గురు అగస్త్యాది ప్రముఖ మహర్షులందరిని పూజించారు.

మహాతేజస్సంపన్నులైన ఆ ముగ్గురు ఋషులందరిని సంతోషంతో ఇలా ప్రశ్నించారు - వారి సంభాషణలో ఆ ప్రదేశమంతా మారుమ్రోగింది. 'మహర్షులారా! మీతో కలవడం వలన మాకు శుభోదయమైంది. రాత్రికూడా శుభప్రదమైంది. రోజులన్నీ పవిత్రాలైనై. ఓ బ్రహ్మర్షి శ్రేష్ఠులారా! మీరీ పర్వతానికి ఎందుకు వచ్చారు? ఈ మహాపర్వతంపై విచారంగా ఎందుకు కూర్చున్నారు? మీరు ఎవరిని దర్శించాలని వచ్చారు? ఇదంతా వివరంగా తెలుసుకోవాలని ఉన్నది. కాబట్టి మాకు యదార్థ విషయాన్ని వివరించండి' అని ఆ ముగ్గురు అడుగగా మహర్షులందరు ఇలా చెప్పనారంభించారు -

''మేము శంఖచక్రగదాధారి, పీతాంబరధారి, అచ్యుతుడు, దేవదేవుడు, పురుషోత్తముడు ఈ నారాయణగిరిపై నివసిస్తున్నవాడు, సకల చరాచర జగత్తుకు నియామకుడు, సృష్టికర్త, నాశరహితుడు, శుభాలను చేకూర్చేవాడు అయిన శ్రీమన్నారాయణుని దర్శించగోరి ఇక్కడకు వచ్చాము. ఈ పర్వతమంతా చాల కాలం నుండి వెదకినా ఆ జగన్నాథుని

దర్శనం కాలేదు. అందువల్ల మేమంతా విచారిస్తున్నాము. ఆదిమధ్యాంతరహితుడైన ఆ గోవిందుని దర్శించలేకపోయామనే దుఃఖంతో మా మనస్సులు చాల కలత చెందినై. అందువల్ల ఈ పర్వత శిఖరంపై విషాదంతో కూర్చున్నాము'' అన్నారు.

జనకమహారాజా! ఆ ముగ్గురు మహాత్ములు వారు చెప్పినదంతా సావధానంగా విని వారిని ఊరడిస్తూ ఇలా అన్నారు - ''ఓ మహర్షులారా! హైహయ దేశాధీశుడు, శ్రుత మహారాజు కుమారుడు, శంఖ మహారాజు ధర్మాత్ముడు, సచ్చరిత్రుడు. ఆయన స్వామి పుష్కరిణీ తీరంలో శ్రీహరిని ఆరాధిస్తూ తపస్సు చేస్తున్నాడు. భగవానుడు ఆయనకు దర్శనమిస్తాడని మేము విన్నాము. శంఖ మహారాజుకు భగవంతుడు సాక్షాత్కరించే సమయం ఆసన్నమైంది కాబట్టి మనమంతా పవిత్రమైన ఆ పుష్కరిణీ తీరానికి వెళ్ళుతాము.

సకలాభీష్టముల నిచ్చేది, పవిత్రమైనది, దేవతలు కూడా సేవించేది, అయిన శుభప్రదమైన స్వామి పుష్కరిణీ వద్దకు వెళ్ళి మనం కూడా ఆ పురుషోత్తముని, సకల కోరికలను ప్రసాదించే వర ప్రదాతను, సర్వేశ్వరుని, అందరిచే ధ్యానించబడే వానిని దర్శిద్దాం. మహర్షులారా! మనమంతా అక్కడికి వెళ్ళుదాం. ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండవద్దు. త్వరపడండి. ఆలస్యం చేయవద్దు'' - అన్నారు.

ఆ మహాత్ములు ముగ్గురు ఈ విధంగా చెప్పగా మహర్షులందరు ఎంతో సంతోషించారు. మనమంతా వెంటనే అక్కడకు వెళ్ళదామన్నారు. వారందరి దుఃఖము, మనస్తాపము, అజ్ఞానము తొలగి పోయింది. వసువు, బహస్పతి, శుక్రాచార్యులతో పాటు అగస్త్యాది ప్రముఖ మహర్షులందరు బయలుదేరి మహర్షి సమూహాలతో సేవించబడుతున్న స్వామి పుష్కరిణీ తీర్థానికి వెళ్లారు.

వారంతా సంతోషంతో వెళ్తూ పరస్పరం ఇలా మాట్లాడుకొన్నారు - ''రాజా! వారా కొండను చూస్తూ 'ఇదే కదా! జగత్ప్రభువు, జగత్స్రష్ట అయిన వాసుదేవుని నివాస స్థానం! శారాఙ్గన్ని ధరించిన శ్రీమహావిష్ణువు నివసించే పర్వతమిదే కదా! ఈ పర్వతంపై అనేక వృక్షాలు శోభిల్లుతున్నాయి. ఇది భూలోకంలో అందరికి ప్రియతమమైనది. పూర్వం మహర్షులందరు పవిత్రమైన ఈ పర్వతాన్ని ఆశ్రయించే సనాతనుడు, దేవదేవుడు, నాశరహితుడైన భగవంతుని దర్శించారు కదా! ఆ దేవదేవుని భక్తులు ఆ పురుషోత్తముని స్తుతిస్తూ ఈ పర్వతాన్నధిరోహించి ఆయన్ని దర్శించి, సేవించి తరిస్తారు కదా!

ఆహా! ఈ నారాయణగిరి సమస్త క్షేత్రాలలో భగవంతునికి ప్రియతమ మైనదికదా! ఆ విషయాన్ని దీని పేరే తెలియజేస్తున్నది. విష్ణుక్షేత్రాలలో దీనితో సమానమైనది మరొకటి లేదు. ఈ విధంగా మాట్లాడుకుంటూ వందలాది మహర్షులంతా అక్కడకు వెళ్ళారు.

'ఓ మిథిలాధిపా! ఇంతలో శ్వేత ద్వీపంలో నివసించే వేలకొలది సిద్ధులు ఈ విషయం తెలుసుకొని అక్కడకు విచ్చేశారు. వారందరికి క్షీరసాగరంలో పవళించే దేవదేవుడైన శ్రీమన్నారాయణుని అనుగ్రహం వలన ఆయన సారూప్యం సిద్ధించింది. వారంతా ఆ జనార్దనుని ఎల్లప్పుడు అనుసరిస్తూ, ఆయన్ని సేవిస్తూ సంతోషింపజేస్తూ ఉంటారు. జగత్స్రష్ట, జగత్ప్రభువు, శేషశాయి, వటపత్రశాయి అయిన ఆ దేవదేవుని స్తుతిస్తూ కీర్తిస్తూ ఉంటారు.

అటువంటి సిద్ధపురుషులంతా అగస్త్యాది మహర్షి పుంగవులతో, తపస్సంపన్నులతో కలిసారు. ఆ పర్వతంపై సంచరిస్తున్న మహర్షులను కలసి ఆ శ్వేత ద్వీపవాసులైన సిద్ధులు సంతోషంతో వారిని పూజించారు. ఆ మహర్షులు కూడ తమ వద్దకు వచ్చిన సూర్యసమాన తేజశ్శాలురైన ఆ సిద్ధులను ఆనందంతో విప్పారిన నేత్రాలతో చూసి యథావిధిగా ఆరాధించారు.

మహారాజా! ఆ సిద్ధులు మహర్షులు అందరు కలసి పరమ సంతోషంతో దేవాసురులు సేవించే స్వామి పుష్కరిణీ తీరానికి వెళ్ళారు - ఆ మునులందరు శ్వేత ద్వీపవాసులైన సిద్ధపురుషులు వేలమంది, బృహస్పతి, శుక్రాచార్యుడు, వసుమహారాజు స్వామిపుష్కరిణీ తీరానికి చేరారు - వారంతా భగవంతుని నివాస స్థానమైన స్వామి పుష్కరిణీ తీరానికి వెళ్ళి అక్కడ కూడ పురుషోత్తముడు, నీలమేఘశ్యాముడు, పద్మదళనేత్రుడు అయిన భగవంతుని దర్శించలేక పోయారు.

జనకమహారాజా! కానీ వారంతా అక్కడ జితేంద్రియుడై విష్ణువు నారాధిస్తూ తీవ్ర తపస్సు చేస్తున్న శంఖ మహారాజును దర్శించారు. ఆ శంఖ మహారాజు వచ్చిన వారందరినీ చూచి ఆనందంతో శరీరమంతా పులకరించగా తన జన్మ సార్థకమైనట్లు భావించాడు. పూర్వం యజ్ఞపురుషుడైన శ్రీహరి 'ఆ మునీంద్రులందరితో పాటు నీవు నన్ను దర్శిస్తావు' అని చెప్పిన మాటను జ్ఞాపకం చేసుకొని, వెంటనే లేచి వారందరికీ నమస్కరించాడు.

ఆనందంతో, తొట్రుపాటుతో శ్వేత ద్వీపవాసులైన సిద్ధులందరికీ నమస్కరించాడు. అలాగే బృహస్పతికి, శుక్రాచార్యునికి, మహామతి మంతుడైన వసు మహారాజుకి అంజలి ఘటించాడు. అగస్త్యాది మహర్షులు, వేలకొలది సిద్ధులు, బృహస్పతి, శుక్రాచార్యుడు, భక్త శిఖామణియైన వసు మహారాజు, శ్రుతుని కుమారుడైన శంఖమహారాజు మొదలైన మహాత్ములు, నిర్మలులు, పాపరహితులు, భగవంతుని దర్శనార్థమై స్వామిపుష్కరిణీ తీరంలో సమావేశమయ్యారు.

వారంతా గోవిందుడు, జగత్ప్రభువు, అచ్యుతుడు, ఆదిమధ్యాంత రహితుడు, సర్వజీవవాసి, సర్వాంతర్యామి అయిన భగవంతుని దర్శించుటకై జితేంద్రియులై గొప్ప తపస్సు చేశారు. ఆ దేవదేవునే చింతిస్తూ, ఆయన్నే ధ్యానిస్తూ అక్కడే

ఉన్నారు. ప్రతిరోజు శుభప్రదమైన స్వామిపుష్కరిణిలో స్నానం చేస్తూ, ఆ తీర్థాన్ని స్వీకరిస్తూ, సంతోషంతో ఆ హృషీకేశుని సుగంధ భరితులైన దివ్యపుష్పాలతో అర్చిస్తూ ఘోరమైన తపస్సు చేశారు.

మహారాజా! వారీవిధంగా మూడు రోజులు రాత్రింబవళ్ళు దీక్షలో ఉన్నారు. నాల్గవ రోజున సూర్యోదయం కాగానే శుభనక్షత్రంలో, ఆకాశం నిర్మలంగా ఉండగా వాళ్ళ తపఃఫలంగా శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై స్వయంగా సాక్షాత్కరించాడు. ఆయన తన తేజస్సుతో సకల లోకాలను ప్రకాశింపజేస్తూ స్వయంగా ఆవిర్భవించాడు' - అని వామదేవ మహర్షి జనక మహారాజుకు చెప్పాడు.

**త్రిరాత్రమేవం భూపాల! వ్యతిష్ఠం స్తే దివానిశమ్ ।**
**తతో విమల ఆదిత్యే! చతుర్థేహ్ని శుభౌదినౌ ॥**
**తపసోన్తే చ పుణ్యర్థే విమలే చామ్బరే శుభౌ ।**
**తదా ప్రసన్నః సర్వాత్మా సాక్షాత్ నారాయణః స్వయమ్ ॥**
**ఆవిర్బభూవ భగవాన్ నృపతే! పురుషోత్తమః ।**
**భ్రాజయన్ సర్వలోకేశః సర్వానే లోకాన్ స్వతేజసా ॥**

**- వామనపురాణం, అధ్యాయం 33, శ్లోకాలు 57,58,59.**

## భగవంతుని దివ్య స్వరూపం

అంతట జనకమహారాజు వామదేవ మహర్షినిలా ప్రశ్నించాడు. 'మహాత్మా! రూపం లేని ఆ పరమాత్మ ఏ రూపంలో సాక్షాత్కరించాడు? ఆయనకెన్ని ముఖాలున్నాయి? ఎన్ని భుజాలున్నాయి? ఆయన ఎన్ని తీక్షణములైన ఆయుధములను ధరించాడు? ఓ మహామునీ! విశ్వరూపుడైన ఆ శ్రీహరి దివ్యస్వరూపాన్ని ప్రాచీన మహర్షులు, సిద్ధులు ఎలా దర్శించారు? ఆ వివరాలన్నీ దయతో తెలుపవలసింది' అని ప్రార్థించగా వామదేవ మహర్షి చెబుతాను వినండని ఈ విధంగా చెప్పసాగాడు -

మహారాజా! కుంభసంభవుడైన అగస్త్యమహర్షి వలన నేను విన్నదంతా మీకు చెబుతాను. చక్కగా, శ్రద్ధగా వినండి, నిరాకారుడైన పరమాత్మ, శ్రీహరి, వాసుదేవుడు దివ్యస్వరూపంతో సాక్షాత్కరించాడు. ఆయన నేత్రాలు ఉదయిస్తున్న సూర్యునివలె కాంతిని వెదజల్లుతున్నాయి. ఆ దేవదేవుడు అనేక విధాల రత్నాలు పొదిగిన చిత్రవిచిత్రాలైన కిరీటాలను ధరించాడు. ఆయన ముఖాలు ప్రసన్నంగా ఉన్నాయి. అనేక బాహువులు విరాజిల్లుతున్నాయి. ఆయన కుండలాలు పగడాలు, మణులు చెక్కబడి స్వర్ణమయంగా ఉన్నాయి.

ఆయన అనేక వర్ణములుగల సుందరములైన రత్నఖచితములైన దివ్యాభరణాలను ధరించాడు. వందలు, వేలకొలది శుభనేత్రాలతో ఆయన ముఖం విరాజిల్లుతున్నది. ఆయన మెడ శంఖము వలె ఉన్నది. వక్షస్థలం విశాలంగా ఉంది. బాహువులు పొడవుగా ఉన్నాయి. గొప్ప కాంతితో ప్రకాశిస్తున్నాయి. వేలకొలది బాహువులు రత్నాభరణాలతో అలంకరించబడి ఉన్నై. అవి బలంగా, గుండ్రంగా ఉన్నై. ఆ బాహువులలో అనేక దివ్యాయుధాలున్నాయి. అవి అనేకాభరణాలతో విభూషితాలైనాయి. అవి మద్దిచెట్ల కొమ్మలవలె ఉన్నాయి.

ఆ దివ్యమైన బాహువులు నల్లగా, పొడవుగా ఉన్నై. సూర్యునివలె ప్రకాశిస్తున్నై. మృదువుగా, నున్నగా, మెత్తగా ఉండి సుఖస్పర్శ గల గోళ్ళ మొనలు గలిగి ఉన్నై. ఆ చేతులలో శుభరేఖలున్నై. అవి ఎర్రగా ఉండి, అరచేతులు ఎత్తుపల్లాలు లేకుండా చాలా మృదువుగ ఉన్నై. వేలకొలది బాహువులు ఏనుగు తొండాలవలె విరాజిల్లుతున్నాయి.

ఆ బాహువులు సప్త సముద్రములు, సప్త కులపర్వతములతో కూడిన, పాతాళాది లోకములతో కూడిన, దేవాసురులుగల, సప్తలోకాలు, సప్తద్వీపాలతో కూడిన, సకల చరాచరములతో నిండిన బ్రహ్మాండాన్నంతటిని సంరక్షిస్తున్నాయి. దానవులను సంహరించినవి, ముఖ్యంగా విష్ణుభక్తుల దుఃఖాన్ని పోగొట్టేవి. దేవతలంతా ఆ భుజబలాన్నాశ్రయించుకొని రాక్షసుల వల్ల భయం లేకుండా ఉన్నారు. అటువంటి దేవదేవుని దివ్యబాహువులు ఉదయాద్రి నుండి ఉదయిస్తున్న సూర్యుని కిరణాల వలె ప్రకాశిస్తున్నై.

ఆ దేవదేవుని దివ్యదేహం రత్నసమూహాలతో ప్రకాశిస్తున్న హారాలలో వర్షాకాలంలో మెరపుతీగెల వలె శోభిస్తున్నది. అది నీలమేఘవర్ణంతో సుందరంగా ఉంది. ఆయన అధరోష్ఠం ఎర్రగా సుందరంగా ఉంది. ఆయన నేత్రాలు కూడ ఎర్రగా అందంగా ఉన్నై. ఆయన చెక్కిళ్ళు మృదువుగా మనోహరంగా ఉన్నాయి. అవి కుండలాల కాంతితో శోభిస్తున్నాయి. నుదుటి భాగం ప్రకాశమానంగా ఉంది. కనుబొమలు అందమైన ధనుస్సువలె శోభిస్తున్నవి. ఆయన ఊరువులు (తొడలు) ఐరావతం తొండం వలె బలంగా ఉన్నాయి.

ఆయన కాలి అందెలు ప్రకాశించే మణులతోను, రత్నాలతోను ధ్వని చేస్తున్నాయి. ఆ దేవాధిదేవుడు విచిత్రమైన బంగారు యజ్ఞోపవీతాన్ని ధరించాడు. మహాశ్చర్యకరమై, ఊహింప వీలుకాని రీతిలో ఉంది. ఆయన దేహం మేరుపర్వతం వలెను, నల్లని కొండవలెను ఉంది. ఆ శ్రీహరి వక్షఃస్థలం విశాలంగా కొంచెం ఎత్తుగా ఉంది. నేత్రాలు విశాలంగా దీర్ఘంగా ఉన్నాయి. ఆయన దివ్యమైన పీతాంబరములను ధరించి ఉన్నాడు. దివ్యగంధమును పూసుకొని ఉన్నాడు. ఆయన భుజస్కంధాల మీదనుండి దివ్యమైన వైజయంతీమాల వ్రేలాడుతున్నది. దానిని మెడలో ధరించిన శ్రీ హరి మెరపులతో ప్రకాశించే నీలిమేఘము వలె విరాజిల్లుతున్నాడు.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



**గత సంచిక తరువాయి**

## విరజానది లేదా విరజా తీర్థం

వైకుంఠంలోని పవిత్రమైన తీర్థం విరజానది స్వామివారి పాదాల నుండి ప్రవహిస్తూ స్వామి పుష్కరిణిలో కలుస్తుందని భక్తుల విశ్వాసం. అందువల్లనే గోవిందనామాల్లో శ్రీనివాసుని ''విరజా తీర్థుడని'' కూడా అభివర్ణిస్తారు.

ఈ నది గమన మార్గంలో ఉపరితలంపై నిర్మింపబడిన బావిని విరజానదిగా పిలుస్తారు. ఈ బావి అంచులపై అద్భుతమైన శిల్పాలు, పౌరాణిక ఘట్టాలు చెప్పబడి ఉండటంతో స్థానికులు దీన్ని 'బొమ్మలబావి'గా కూడా పిలుస్తారు. ఈ బావి ప్రస్తుతం నేల మట్టానికి ఉన్న కటకటాల తలుపుతో మూయబడి, దానివద్ద ''విరజానది'' అనే బోర్డు వ్రేలాడదీయబడి ఉంటుంది. ఈ బావి వద్దకు కూడా భక్తులకు ప్రవేశం లేదు.

## పడిపోటు

ఇది సంపంగి ప్రదక్షిణానికి ఉత్తరమార్గంలో ఉంటుంది. పడమటి భాగంలో ఉగ్రాణం వద్ద మొదలై, పొడవుగా దాదాపు మనం ప్రసాదాలు స్వీకరించే ప్రదేశం వరకూ విస్తరించి ఉంటుంది. స్వామివారి ప్రసాద నివేదనలన్నీ – అన్న ప్రసాదాలు తప్ప – అంటే లడ్డూ, వడ, జిలేబీ, మురుకు, అప్పం, దోశ మొదలైనవి పరిశుభ్ర వాతావరణంలో, అత్యంత నైపుణ్యంతో, భారీ ఎత్తున ఈ పడిపోటులో తయారు చేయబడుతాయి. ఈ ప్రదేశంలోకి సాధారణంగా భక్తులకు ప్రవేశం లేదు. అయితే, మనం ప్రార్థనాపూర్వకంగా అడిగితే, అక్కడ ఉన్న సిబ్బంది ఒక్కోసారి అనుమతిస్తారు. ఈసారి ప్రయత్నించండి. ప్రపంచంలో మరెక్కడా లేనంత భారీ ఎత్తున జరిగే వంటల ప్రక్రియను చూసి తీరాల్సిందే. ఈమధ్య కాలంలో, స్థలాభావం చేత, లడ్డూ తయారీకి కావలసిన బూందీని మాత్రం ఆలయం వెలుపల తయారు చేయిస్తున్నారు.

పడిపోటుకు ఆగ్నేయమూలలో, తూర్పుదిశగా ఉన్న ''పోటు తాయారు'' అనే అమ్మవారికి భక్తిపూర్వకంగా నమస్కరించి వంట బ్రాహ్మణులు శుచిగా తమ దినచర్యను ప్రారంభిస్తారు. పడిపోటుకు ఎదురుగా ఇదివరకు ఉండే చిన్నబావిలోని నీటిని వంటలకు ఉపయోగించేవారు.

## పూల అర లేదా పుష్ప మండపం లేదా యమునోత్తరై

సంపంగి ప్రదక్షిణంలోని ఉత్తరమార్గంలో, పడిపోటు నానుకొని ఉన్న గదిని ఈ మూడు పేర్లతో పిలుస్తారు. శ్రీవారి కైంకర్యాలకు, వివిధ ఉత్సవాలకు అవసరమయ్యే పుష్పమాలలను ఈ గదిలో తయారు చేసేవారు. అయితే స్థలాభావం పెరిగిన అవసరాల దృష్ట్యా, ఇపుడు పుష్పమాలలను వేరొకచోట తయారు చేయించి, ఉపయోగార్థం విమాన ప్రాకారంలోని ఓ శీతలీకరించిన గదిలో భద్రపరుస్తున్నారు. దాని వివరాలు తర్వాత తెలుసుకుందాం.

''యమునోత్తరై'' అంటే ''యమునా నది ఒడ్డు'' అని అర్థం. స్వామిని శ్రీకృష్ణునికి ప్రతిరూపంగానూ, స్వామిపుష్కరిణిని యమునానదిగానూ భావించడం వల్ల దీనికా పేరు వచ్చి ఉండవచ్చు.

మరో కథనమేమిటంటే – ఈ పుష్ప కైంకర్యాన్ని ప్రారంభించిన అనంతాళ్వార్ అనే భక్తుడు తన గురువు రామానుజుల వారి గురువుగారైన ''యామునాచార్యుల'' వారి పేరుమీద ఈ గదికి ఆ పేరు పెట్టాడు. ఈ మహాభక్తుని గురించి ముందుగానే తెలుసుకున్నాం. ఈ గదిని బయటనుంచి దర్శించుకోవచ్చు.

## వగపడి

రెండతస్తులు కలిగిన ఈ ప్రసాదాల గిడ్డంగి, పూల అరను ఆనుకొని ఉంటుంది. ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులకు, తి.తి.దే సిబ్బందికి ఇక్కడే ప్రసాద వితరణ చేస్తారు. సిబ్బంది అనుమతితో లోనికి ప్రవేశించవచ్చు. ఈ గది ముంగిట్లో నుంచే లడ్డూ, వడ, జిలేబీల సుగంధాలు చవులూరిస్తాయి. సాధారణంగా, మనం దీని ముంగిట్లో నుంచునే ఉచిత ప్రసాదాలను సేవిస్తాం. గంటల తరబడి క్యూలో వేచి ఉండటం వల్ల వచ్చిన అలసట, ఆకలి, ఘుమ ఘుమలాడే నేతి సువాసనలు, అంతకుమించి శ్రీవారి ప్రసాదాల మీదుండే అపరిమిత భక్తిశ్రద్ధలు, వెరసి మన ఆలోచనలన్నీ తాత్కాలికంగా, ఆధ్యాత్మిక భావనల్లోంచి ఆత్మారాముణ్ణి సంతృప్తి పరచే దిశలో అనాలోచితంగానే పయనిస్తాయి.

## పూలబావి

స్వామివారికి సడలింపు చేసిన పూలమాలలను భక్తులకిచ్చే సాంప్రదాయం తిరుమలలో లేదు. ''పూజా నైర్మల్యాలు''గా పేర్కొనబడే వీటన్నింటినీ, సంపంగి ప్రదక్షిణానికి ఈశాన్యంలో ఉన్న ''పూలబావి''గా పిలువబడే ఓ బావిలో విసర్జించేవారు. అందుకే దానికా పేరు వచ్చింది. అయితే సంవత్సరంలో ఒకసారి తిరుచానూరులో కార్తీకమాస బ్రహ్మోత్సవ చక్రస్నానం జరిగే రోజున మాత్రం, శ్రీవారికి అలంకృతమైన పూమాలలు, పరిమళద్రవ్యాలు, ప్రసాదాలు, చీర-రవికెలు సమస్త గౌరవ లాంఛనాలతో తిరుమల నుంచి కాలినడకన తీసుకొని వచ్చి పద్మావతి అమ్మవారికి సమర్పిస్తారు. ఈ పూలబావిని అద్దాల మండపానికి వెనుకభాగంలో, సరిగ్గా మనం ఉచిత ప్రసాదాలు స్వీకరించే ప్రదేశానికి ఎదురుగా చూడవచ్చు.

ఐతిహ్యం ప్రకారం భూదేవిచే ఏర్పరచబడిన ఈ ''భూతీర్థం'' (పూలబావికి పూర్వనామం) కాలాంతరంలో నిక్షిప్తమైపోయింది. శ్రీనివాసుని ఆనతిపై రంగదాసుడనే భక్తుడు నేలను త్రవ్వి ఈ బావిని వెలుగులోకి తెచ్చి దాని నీటిని శ్రీహరి పుష్పకైంకర్యానికి ఉపయోగించేవాడు. శ్రీవారికి ప్రీతిపాత్రమైన ఈ బావి శిథిలమైపోగా రంగదాసే తొండమానునిగా పునర్జన్మించి ఆ బావిని తిరిగి పునరుద్ధరించాడు. అంతే కాకుండా, ఆ బావినందలి రహస్యమార్గం ద్వారా నిత్యం వచ్చి స్వామిని దర్శించుకునేవాడు.

ఒకప్పుడు శత్రురాజులు తరుముకు రాగా, తొండమానుడు ఈ మార్గం ద్వారా పరుగు పరుగున వచ్చి శరణాగత వత్సలుణ్ణి శరణు వేడాడు. అభ్యంతర మందిరంలోకి అకస్మాత్తుగా వచ్చిన ఆగంతుణ్ణి చూసి సిగ్గుతో – శ్రీదేవి శ్రీవారి వక్షస్థలంలోను, భూదేవి ఈ బావిలోను – దాక్కున్నారు.

వరాహపురాణం ద్వారా ఈ ఇతిహాసాన్ని తెలుసుకున్న భగవద్రామానుజుల వారు భూదేవిని ఆ బావిలో తిరిగి ప్రతిష్ఠింప చేసి, అర్చనాదులు క్రమం తప్పకుండా జరిగే ఏర్పాటు చేశాడు. అంతేకాకుండా భూదేవి నిమిత్తం పెనిమిటి పూజా నైర్మల్యాలను ఈ బావిలో విడిచే కట్టడి కూడా చేయడంతో, కొన్ని వందల సంవత్సరాలు ఆ సాంప్రదాయం కొనసాగింది.

కానీ ఈ మధ్యకాలంలో పూలవాడకం విపరీతంగా పెరిగిపోవడం వల్ల వాడిన పూమాలలను తిరుమల సానువుల్లో ఎవరూ తొక్కని ప్రదేశంలో విడవడం ప్రారంభించారు. అదీ ''పూలబావి'' పుట్టుపూర్వోత్తరాలు.

ఈమధ్యకాలం వరకూ దిగుడుబావిగా ఉన్న ఈ బావిని చేదుడుబావిగా మార్చి, దాని బయటివైపు నల్లటి గ్రానైట్ పలకలు తాపడం చేసి, దానిచుట్టూ ఇనుప ఊచల తడికెను ఏర్పాటు చేశారు. ఇంతటి పౌరాణిక, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పూలబావికి ఈసారి తప్పక నమస్కరించి తరించండి.

శ్రీవారి ఆలయంలో అత్యంత ముఖ్యమైన సంపంగి ప్రదక్షిణ మార్గంలోని అన్ని విశేషాలను దాదాపుగా తెలుసుకున్నాం.

సంపంగి ప్రదక్షిణ మార్గంలోనే ఉండినట్లుగా చెప్పబడే ప్రొద్దుతిరగని చింతచెట్టు గురించి, వెండివాకిలి గురించి, దేవాలయ మహాద్వారానికి తూర్పుదిక్కున గంభీరంగా నిలబడి ఉండే గొల్లమంటపం గురించి చెప్పుకుని రేపటితో ''సంపంగి ప్రదక్షిణం'' సమాప్తం చేద్దాం.

మొదటిమూడుభాగాల్లోమనం ''సంపంగిప్రదక్షిణమార్గం''లో ఉండే విశేషాలను దాదాపుగా తెలుసుకున్నాం. ఇంకా మిగిలిన కొన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## నీడ తిరగని చింతచెట్టు

11వ శతాబ్దంలో భగవద్రామానుజులు, 15వ శతాబ్దంలో అన్నమయ్య దర్శించి తరించిన ఓ పరమాద్భుతమైన చింతచెట్టు శ్రీవారి ఆలయంలో ఉండేది. శ్రీనివాసుని ఆవిర్భావంతో ముడివడిన ఈ వృక్షరాజం యొక్క ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగించే పూర్వాపరాలను శ్రీనివాసుని భక్తులందరూ తెలుసుకుని తీరాలి.

లోక కళ్యాణార్థమై, నారదమహర్షి ఒకానొకప్పుడు తండ్రియైన బ్రహ్మదేవుణ్ణి ఈ విధంగా ప్రార్థించాడు. ''తండ్రీ మీ విన్నపాన్ని ఆలకించి ఆ శ్రీమహావిష్ణువు, శ్రీవేంకటాచలం క్షేత్రంలో అవతరించి భక్తులను అనుగ్రహించేటట్లుగా వరమిచ్చి చాలాకాలమైంది. కావున, ఆ వైకుంఠ నాథుని మరలా ప్రార్థించి, సత్వరమే తిరుమల క్షేత్రంలో ప్రత్యక్షమై మానవులందరికీ వారి దర్శనభాగ్యం కలిగింప చేయండి''.

నారదుని ప్రార్థనకు తన సమ్మతిని తెలియచేస్తూ, ఆ మహత్కార్యం నెరవేరటంలో నారదుని పాత్ర ఏమిటో విశదపరచి, బ్రహ్మదేవుడు అతనితో ఈవిధంగా సెలవిచ్చాడు – "నేను శేషాద్రి శిఖరాన, స్వామిపుష్కరిణి సమీపంలో, త్రేతాయుగపు దశరథ మహారాజు అంశతో మరియు ద్వాపరయుగపు వసుదేవుని అంశతో ఓ చింతచెట్టును సృష్టిస్తాను. ఆ వృక్షఛాయలో శ్రీరాముని తల్లి కౌసల్య అంశతో మరియు శ్రీకృష్ణుని తల్లి దేవకి అంశతో ఓ విశాలమైన పుట్టను ఏర్పాటు చేస్తాను. వీళ్ళనే ఎందుకు ఎన్నుకున్నానంటే, ఆయా పుణ్యదంపతులకు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే శ్రీరామ-శ్రీకృష్ణుల రూపాలలో త్రేతాయుగం- ద్వాపరయుగాల్లో తనయుడిగా జన్మించినప్పటికీ, కారణాంతరాల వల్ల వారికి అనతికాలంలోనే పుత్రవియోగం సంభవించింది. శ్రీరాముని వనవాసంతో కౌసల్యా దశరథులు పరితపించగా, కారాగారంలో జన్మించగానే శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులకు దూరమయ్యాడు. వారికి పుత్రునిపై మమకారం తీరనేలేదు. అలాగే చిన్నికృష్ణుణ్ణి అత్యంత ప్రేమాభిమానాలతో పెంచుకున్న యశోదమ్మ, శ్రీకృష్ణుని వివాహాన్ని చూడలేకపోయింది. కావున కలియుగంలో ఆమెను వకుళమాతగా జన్మింపచేసి శ్రీనివాసుని కళ్యాణాన్ని దగ్గరుండి జరిపించే ఏర్పాటు కూడా చేయాలని ఎప్పుడో నిశ్చయించుకున్నాను".

అలా బ్రహ్మదేవుడే వచించినదే తడవుగా వేంకటాచలంలో ఓ చింతచెట్టూ, దానికింద పుట్ట (వల్మీకం), వకుళమాత చకచకా సృష్టించబడ్డాయి.

తండ్రి ఆనతి మేరకు కార్యరంగంలోకి దిగిన నారదమహర్షి, వైకుంఠవాసుణ్ణి వల్మీక వాసునిగా తయారుచేసే ప్రయత్నంలో పడ్డాడు. అదే సమయంలో యోగిపుంగవులందరూ కలిసి ఓ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. ఆ యజ్ఞానికి విచ్చేసిన కలహభోజనుడు, త్రిమూర్తుల్లో అత్యంత మహిమాన్వితునికి మాత్రమే యజ్ఞఫలాన్ని ధారపోయ వలసిందిగా సలహా ఇచ్చాడు. త్రిమూర్తుల్లో ఎవరు గొప్పో నిగ్గు తేల్చటం కోసం, మహర్షుల కోర్కె మేరకు బ్రహ్మనూ, మహేశ్వరుణ్ణీ దర్శించిన భృగుమహర్షి చివరగా వైకుంఠానికేతెంచాడు. ఆ తరువాత క్షణికావేశానికి గురైన భృగుడు – లక్ష్మీనివాసమైన శ్రీనివాసుని హృదయంపై కాలితో తన్నడం, క్రోధితురాలైన శ్రీమహాలక్ష్మి వైకుంఠాన్ని వదిలి కరివీరపురానికి (నేటి కొల్హాపూరుకు) చేరడం, విష్ణువు లక్ష్మీదేవి జాడ వెతుకుతూ భూలోకానికేతెంచి వేంకటాచలంలో చింతచెట్టు క్రిందున్న పుట్టలో సేద తీరడం, ఓ గొల్లవాని గొడ్డలి దెబ్బకు గాయపడిన శ్రీనివాసుడు పుట్టలోనుండి బయటకు వచ్చి వకుళమాత చెంత చేరి పద్మావతిని పరిణయమాడటం – మనకు సుపరిచితమే! ఇందులో కొంతభాగాన్ని మనం "సన్నిధిగొల్ల" ప్రకరణంలో తెలుసుకున్నాం కూడా.

కాలాంతరాన ఆ పుట్ట సమీపంలో తొండమానునిచే శ్రీవారికి ఆలయం నిర్మించబడడంతో ఓ ప్రాకారం ఏర్పడి, ఆ చెట్టు సంపంగి ప్రదక్షిణ మార్గంలో మహాద్వారానికి చేరువగా నిల్చింది.

ఆ చింతచెట్టు కాండం దృఢంగా ఉండి శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆ చెట్టు నీడ ఎటూ తిరగక వృక్షమూలంలోనే స్థిరంగా ఉండడంతో అది "నీడ తిరగని చింతచెట్టు"గా ప్రసిద్ధి చెందింది. అంతేకాకుండా ఆ చెట్టు విశ్రాంతి యన్నదే లేకుండా చిగురిస్తూ, పుష్పిస్తూ, ఫలిస్తూ ఉండేది. అందువల్ల అది "ఉన్నిద్ర తింత్రిణీ వృక్షం" (నిద్రపోని చింతచెట్టు) గా కూడా పేరొందింది. కాలక్రమాన భూలోకంలో తనకు మొట్టమొదటిసారిగా నీడ కల్పించిన ఆ వృక్షం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమయింది. ఒకానొకప్పుడు ఆ లక్ష్మీవల్లభుడు తన భక్తుడైన తొండమానునితో "ఆ చింతచెట్టునూ, మహాలక్ష్మికి ఆవాస స్థానమైన చంపక వృక్షాన్ని మాత్రం రక్షించి, మిగిలిన చెట్లనన్నింటినీ తొలగించి ఆలయ ప్రాకారాలు నిర్మించవలసిందిగా" ఆదేశించినట్లు వెంగమాంబ విరచిత "వేంకటాచలమాహాత్మ్యం" ద్వారా తెలుస్తోంది.

ప్రస్తుతం ఆలయంలో కానరాని ఆ వృక్షం ఎప్పుడు, ఎలా కనుమరుగైందో ఎవరికీ తెలియదు. తన కార్యం పరిసమాప్తి చెందడంతో బ్రహ్మదేవుడే ఆ వృక్షాన్ని తనలో తిరిగి ఐక్యం చేసుకున్నాడేమో!

11 వ శతాబ్దంలో భగవద్రామానుజులు ఆ చింతచెట్టును దర్శించి తరించినట్లు "పరమయోగి విలాసం" అనే ప్రామాణిక గ్రంథంలో వ్రాయబడింది. అలాగే 15వ శతాబ్దంలో అన్నమయ్య తొలిసారిగా తిరుమల యాత్ర చేసినపుడు 1

**"...... కుందనపు**
**బొలుపులు పెద గోపురము సేవించి**
**తరగని ఫల పుష్ప తతి తోడ నీడ తిరుగని**
**చింత వర్తిల నమ్రుడగుచు"**

అనే కీర్తనలో, ఈ చింతచెట్టును దర్శించుకున్నట్లుగా కీర్తించుకున్నాడు.

సాక్షాత్తు శ్రీనివాసునికే నీడనిచ్చిన ఆ వృక్షరాజం, "మానవుడు ఐహిక ప్రలోభాలకు లోనై తన దిశను మార్చుకోకుండా; అజ్ఞానాంధకారపు ఛాయలను దరిజేర నీయకుండా; ఆ పరమాత్ముని సాక్షాత్కారం కోసం అలుపెరగని సాధన చేయాలని; జన్మ సార్థక్యం కాగానే నిశ్శబ్దంగా నిష్క్రమించాలని" సూచిస్తుంది.

## వెండివాకిలి

ప్రప్రథమ ప్రాకారంలోని మహాద్వారం గుండా ప్రవేశించి, సంపంగి ప్రదక్షిణ మార్గంలోని వివిధ మండపాలను దర్శించుకొని, ధ్వజస్తంభ దర్శనం తరువాత మనం వెండి వాకిలి ముందుకు చేరుకుంటాం. ఈ ప్రవేశద్వారం యొక్క గడపలకూ, ప్రక్కనున్న గోడలకూ వెండి తాపడం చేసి యుండడం వల్ల

దీన్ని ''వెండివాకిలి''గా పిలుస్తారు. అలాగే రెండవ ప్రవేశ ద్వారం కావటం వల్ల దీనిని ''నడిమి పడికావలి''గా కూడా వ్యవహరిస్తారు. 1929వ సంవత్సరంలో నైజాం ఎస్టేటుకు చెందిన ''శ్రీరాం ద్వారకా దాస్ పర్భణి'' అనే భక్తుడు ఈ వాకిళ్ళకు వెండి తాపడం చేయించినట్లుగా ఆ తలుపులపై హిందీ, ఆంగ్ల భాషల్లో వ్రాయబడి ఉంది. సంపంగి ప్రాకారానికి అనుసంధానమై ఉండే ఈ ద్వారంపై ఏడు కలశాలతో, శిల్పకళా శోభితమైన మూడంతస్తుల గోపురం నిర్మించబడింది.

వెండివాకిలికి ఇరుప్రక్కలా ఉన్న కుడ్యాలపై హాథీరాంబాబా-వేంకటేశ్వరుల పాచికలాట మరియు శ్రీరామ పట్టాభిషేకం ఘట్టాలు హృద్యంగా చెక్కబడి వెండి రేకుతో తాపడం కావించబడ్డాయి.

12వ శతాబ్దంలో ప్రారంభమైన ఈ కుడ్య-ద్వార-గోపుర నిర్మాణం అంచెలంచెలుగా చేకూరి; 13వ శతాబ్దంలో పూర్తయినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ వెండివాకిలి దాటగానే మనం మూడవ లేదా విమాన ప్రదక్షిణ మార్గం లోనికి ప్రవేశిస్తాం.

అయితే అంతకుముందుగా శ్రీవారి ఆలయ మహాద్వారం ముందున్న ఓ ముఖ్యమైన మంటపాన్ని గురించి తెలుసుకుందాం.

## గొల్ల మంటపం

పూర్వకాలంలో శ్రీవారి ఉత్సవాలు తిరుచానూరులో జరిగేవి. అవన్నీ శ్రీవారి నివాసస్థానమైన ''తిరుమల క్షేత్రం''లోనే జరగాలని 11వ శతాబ్దంలో రామానుజులవారు తీర్మానించారు. అందు నిమిత్తం తిరుమల కొండను అభివృద్ధి చేసే పనుల్లో నిమగ్నమైన కూలీలకు, పర్యవేక్షకులకు చంద్రగిరికి చెందిన ''గోపమ్మ'' అనబడే ఓ గొల్లవనిత చల్లని మజ్జిగనిచ్చి దాహం తీర్చేది. ఆమె సేవకు మెచ్చిన రామానుజాచార్యులు ఏ వరం కావాలో కోరుకొమ్మనగా, ఆ వనిత అమాయకంగా ''తమరు చీటీ రాసిస్తే మోక్షమొస్తుందట. ఓ చీటీ రాసి మోక్షమిప్పియ్యండి'' అని బదులిచ్చింది. ఆమె నిష్కల్మషత్వానికి మెచ్చిన రామానుజులు, ఓ తాళపత్రంపై ''శ్రీనివాస పరబ్రహ్మ ముక్తిని ప్రసాదించుగాక'' అని వ్రాసి ఆమె చేతిలో నుంచారు. ఆ గొల్లవనిత సేవానిరతికి, మోక్షపిపాసకు, నిష్కళంక భక్తికి గుర్తుగా, రామానుజుని ప్రేరణతో ఆ ప్రదేశంలో ''గొల్లమంటపం'' నిర్మించబడింది.

మరో కథనం ప్రకారం, మజ్జిగ విక్రయాలతో సంపాదించిన డబ్బుతో స్వయంగా ఓ గోపవనితే, ఆమెకు స్వామివారిపై ఉన్న అచంచల భక్తివిశ్వాసాలకు గుర్తుగా ఈ మంటపాన్ని నిర్మించింది.

కథనమేదైనప్పటికీ, ద్వాపరంలో గోవిందునకు-గోపాలురకూ ఉన్న బాంధవ్యం కొనసాగుతూ; కలియుగంలో శ్రీవేంకటేశ్వరునికీ- గొల్లలకూ మధ్య ఏర్పడ్డ అనుబంధం ఈ ''గొల్లమంటపం'' రూపంలో ద్యోతకమవుతోంది.

1470వ సంవత్సరంలో నిర్మించబడిన ఈ కట్టడంలో నిలబడి ఒకప్పుడు ప్రధానార్చకులు ప్రతినిత్యం ఘంటానాదం చేసిన కారణంగా దీనికి ''ఘంటా మండప''మనే మరో పేరు కూడా వచ్చింది.

ఈ మంటపం శ్రీవారి ఆలయ మహాద్వారానికి ఎదురుగా, సమున్నతంగా నిలబడి ఉంటుంది. శ్రీవారి ఉత్సవ వాహనాలు మహాద్వారానికి, గొల్లమంటపానికి మధ్యనుండి సాగిపోతాయి.

ఇప్పటివరకు సంపంగి ప్రదక్షిణ మార్గంలోని ప్రతిమా, మంటప, ఇతర కట్టడాల విశేషాలన్నింటినీ తెలుసుకున్నాం.

ఇవే కాకుండా అన్ని మంటపాల్లోని కుడ్యాలపై, స్తంభాలపై, పైకప్పు లోపలి భాగంలో లతా పుష్ప ఆకృతులు, జంతువులు, పక్షుల చిత్రాలు, ఏనుగు తలపైనున్న గుర్రం, ఆ గుర్రంపై స్వారీ చేస్తున్న యోధుడు, వివిధ దేవతా శిల్పాలు; పూతనవధ, గోపికా వస్త్రాపహరణం వంటి పౌరాణిక ఘట్టాలు; ఆదిశేషుడు, హనుమ, గరుడుడి శిల్పాలు; ఇంకా అనేక కళాకృతులు ముగ్ధమనోహరంగా చెక్కబడి ఉన్నాయి. వీటినన్నింటినీ వీలున్నంతలో వీక్షించాల్సిందే గానీ, వాటి శోభను వర్ణింప నలవి కాదు.

వెండివాకిలిని దాటి మనం ఇక మూడవ ప్రదక్షిణం, అంటే ''విమాన ప్రదక్షిణ మార్గం'' లోనికి చేరుకోవడమే తరువాయి.

అయితే, ఆ ప్రదక్షిణం చేసే ముందుగా కొన్ని శ్రీవారి ఉత్సవాల గురించి తెలుసుకుందాం. నిత్య, వార, మాస ఉత్సవ విశేషాలను ముందుగానే చెప్పుకున్నాం కాబట్టి, కొన్ని ''సంవత్సరోత్సవాల'' గురించి కూడా తెలుసుకుందాం.

## శ్రీవారి సంవత్సర సేవలు

ఉత్సవాలకు నెలవైన తిరుమల క్షేత్రంలో, ప్రతినిత్యం లెక్కకు మిక్కిలిగా ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. వాటిలో దైనందిన, వార, మాస లేదా నక్షత్ర ఉత్సవాలన్నింటి గురించి ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇప్పుడు కొన్ని ముఖ్యమైన సంవత్సరోత్సవాల గురించి తెలుసుకుందాం.

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనోత్సవం

తిరుమల కొండపై ఉన్న ప్రతి చెట్టూ-పుట్టా, రాయి-రప్పా, తీర్థాలు, సమస్త జంతుజాలం, అన్నీ కారణజన్ములైన దేవతలు, సిద్ధిపొందిన మునిపుంగవులే. వైకుంఠవాసుడైన శ్రీమహావిష్ణువు కలియుగంలో ఆవిర్భవించడంతో ఆ దేవదేవునికి సపర్యలు చేయటం కోసం, లోక కళ్యాణార్థం శ్రీవారు చేపట్టే కార్యాలకు సహాయ సహకారాలు అందించటం కోసం స్వర్గవాసులందరూ వివిధ రూపాలు ధరించి తిరుమల క్షేత్రంలో కొలువై ఉన్నారు.

ఆ కారణంగా తిరుమలను ఎల్లప్పుడూ అత్యంత పవిత్రంగా,

పరిశుభ్రంగా ఉంచటం అనూచానంగా వస్తున్న సాంప్రదాయం. ఆలయ పరిసరాలు, తిరుమల పట్టణమంతా పరిశుభ్రతకు మారుపేర్లు.

అలాగే ఆలయాంతర్భాగాన్ని కూడా సతతం శుభ్రపరుస్తూ, పరిశుభ్రత ఉట్టిపడేలా తీర్చిదిద్దుతారు. అయితే, దైవసన్నిధిలో జరిగేది కనుక ఈ ప్రక్రియనంతా శాస్త్రోక్తంగా, భక్తిభావంతో, క్రమశిక్షణతో పూర్తి చేయాలి.

**సంవత్సరంలో నాలుగు సార్లు అనగా :**

- ఉగాది
- ఆణివార ఆస్థానం (ఇదివరకు ఆలయ వార్షిక లెక్కల ముగింపు)
- బ్రహ్మోత్సవాలు
- వైకుంఠ ఏకాదశి

ఈ పండుగలకు ముందు వచ్చే మంగళవారాల్లో జరిగే ఈ ''శుద్ధి కార్యక్రమాన్నే'', కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంగా పిలుస్తారు. శ్రీవారికి జరిగే ఆర్జిత సేవల్లో ఇదో ముఖ్యమైన సేవ.

''కోయిల్'' అంటే ఆలయం. ''ఆళ్వార్'' అంటే విష్ణుభక్తులలో గొప్పవారు. ''తిరుమంజనం'' అంటే పవిత్రమైన శుద్ధి కార్యక్రమం. ఆలయంలో జరిగేది కాబట్టి ఈ శుద్ధి కార్యక్రమాన్నే ''అభిషేకం'' గా భావిస్తారు.

వెరసి ఈ పదానికి అర్థం ఆలయంలో విష్ణుభక్తులు జరిపించే పవిత్రమైన అభిషేకం.

ఈ ఉత్సవం జరిగే రోజుల్లో, దైనందిత సేవలైన సుప్రభాతం, తోమాలసేవ, అర్చనల తరువాత, గర్భాలయంలోని మూలమూర్తికి ఆసాంతం ''మలై గుడారం'' అనే వస్త్రాన్ని కప్పి, దుమ్మూ ధూళీ పడకుండా చూస్తారు. ఇదే గుడారంలో భోగ శ్రీనివాసుణ్ణి కూడా ఉంచుతారు.

మిగతా ఉత్సవమూర్తులు, పరివారదేవతలు, శ్రీవారికి నిత్యం అలంకరింపబడే సాలగ్రామాలను ఘంటా మండపంలోకి; వెండి, బంగారు పాత్రల్ని బంగారు బావి వద్దకూ, స్వామివారి వెండి మంచం, వెండి ఆభరణాలను విమాన ప్రదక్షిణ మార్గం లోనికి భక్తిపూర్వకంగా తరలిస్తారు.

- ఉత్సవమూర్తులను, సాలగ్రామాలను అర్చకులు ఘంటామండపంలో తెరలు కట్టి అభిషేకిస్తారు.
- బంగారు బావి వద్దకు తెచ్చిన వస్తువులన్నింటినీ చింతపండుతో శుభ్రపరుస్తారు.
- అర్చకులు గర్భాలయాన్ని;
- పరిచారకులు, ఏకాంగులు కులశేఖరపడి ముందున్న ప్రాంతాన్ని, ఆలయం ఉద్యోగులు మిగతా దేవాలయం అంతటినీ, ఉపాలయాలను శుభ్రం చేసి సీకాయ నీళ్ళతో కడుగుతారు.
- అభిషేకం అందుకున్న ఉత్సవమూర్తులు, పరివార దేవతా మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.
- రంగనాయక మండపంలోని వెండి, బంగారు వాహనాలకు మెరుగు పెడతారు.
- నామంకోపు, గడ్డకర్పూరం, శ్రీచూర్ణం, గంధంపొడి, కుంకుమ ఖచిలిగడ్డలను కలిపి లేహ్యంలా తయారు చేసిన ''పరిమళం'' అనబడే మిశ్రమాన్ని ముందురోజు రాత్రే గంగాళాల్లో సిద్ధంగా ఉంచుకుంటారు.
- గర్భాలయంలో స్వామివారి పైకప్పు భాగానికి కట్టే ముఖమల్ వస్త్రాన్ని ''కురాళం'' అంటారు.
- పరిమళాన్ని, కురాళాన్ని తీసుకుని జియ్యంగార్లు, ఆలయ ఉన్నత అధికారులు మంగళ వాయిద్యాలతో, ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వచ్చి అర్చకులకు అందజేస్తారు.
- అర్చకులు కురాళాన్ని యథాస్థానంలో (గర్భాలయపు ఉపరితల భాగంలో) అమర్చి, ''పరిమళాన్ని'' గర్భాలయపు మరియు ఇతర ముఖ్య ఉపాలయాల గోడలకు లేపనంలా పూస్తారు.
- తరువాత నేలనంతా కడిగి, ఉత్సవమూర్తులను, పూజాసామగ్రిని వారి వారి స్థానాలకు చేరుస్తారు.
- అనంతరం బంగారు వాకిళ్ళకు నూతన పరదాలు కట్టి, తెరవేసి, మూలమూర్తిని కప్పి ఉంచిన మలై గుడారాన్ని తొలగించి, రోజువారీ సేవా కార్యక్రమాలను యథావిధిగా కొనసాగిస్తారు.

ఈ సేవను మొట్టమొదటగా వంగపురం నారాయణ శెట్టి అనే తిరుపతికి చెందిన వర్తకుడు, 1544 వ సంవత్సరంలో తన ఖర్చుతో జరిపించాడు.

ఈ సేవా కార్యక్రమం నందు పరిమళ ద్రవ్యాలను అధిక మొత్తంలో ఉపయోగించటం వల్ల గవాక్షాలు లేని ఆనందనిలయంలో గాలి పరిశుభ్రంగా, సువాసనా భరితమై ఉండటమే కాకుండా, లోనికి క్రిమికీటకాదులు రాకుండా, ఉంటాయి. ఈ సేవలో పాల్గొనే భక్తులు వ్యక్తికి 300 రూపాయలు చొప్పున చెల్లించాలి.

తిరుమలలో పరిశుభ్రత గురించి ముఖ్యంగా ఒక విషయం చెప్పుకోవాలి. ''అన్నం పరబ్రహ్మ స్వరూపం'' – అటువంటి టన్నులకొద్దీ అన్నాన్ని ప్రతిదినం లక్షకు పైగా భక్తులకు వండి వడ్డించే, తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో; ఒక్క ఈగను కానీ, పదార్థాల్లో ఒక్క వెంట్రుకను గానీ ఎప్పుడైనా, ఎవరైనా చూశారా? అంకితభావంతో పనిచేసే వంటశాల సిబ్బంది అవిశ్రాంత కృషికి శ్రీనివాసుని సంపూర్ణ కటాక్షం తోడవటం వల్లనే ఇది సాధ్యం.

ఆత్మ, శరీర, పరిసరాల పరిశుభ్రతే పరమపద సోపానానికి తొలిమెట్టు.

**(ఇంకా ఉంది)**

# ప్రణవ తత్త్వమే సీతారామలక్ష్మణులు

— డా|| షేక్ మౌలాలి

''రామో విరామమో విరాజః'', ''రమయంతి ఇతి రామః'', ''రమయతి యోగీనాం మనాంసి ఇతి రామః'', ''రమయతాం యోగినః అస్మిన్ ఇతి రామః'', ''రామో రమయతాం మనః'' అను వేద, ఆర్ష సూక్తులను రామాయణ కావ్యంలో పొందుపరచి దానినొక రసజగత్తుగ మలిచాడు వాల్మీకి. బ్రహ్మ గర్భమయిన తపస్సు వాల్మీకి నాశ్రయించి రసమయ కావ్యంగా రూపు దిద్దుకుంది.

యుగ యుగాల నుండి తపో నిరతులయిన అనేక మహర్షులకు దర్శనం కలుగజేయుట శ్రీరామావతార రహస్యములలో ఒకటి. అవ్యక్త పరమాత్మ జీవోద్ధరణ కొరకు వ్యక్త స్వరూపంలో మహర్షుల ఆశ్రమాలను సందర్శించాడు.

**ప్రవిశ్యతు మహారణ్యం - దండకారణ్య మాత్మవాన్**
**రామో దదర్శ దుర్ధర్షః - తాపశా స్రమ మండలమ్**

అరణ్యకాండ ప్రారంభంలో సీతారామలక్ష్మణులలో ముందుగా శ్రీరాముడు, తదుపరి సీతాదేవి, ఆ వెనుక లక్ష్మణుడు నడచినట్లు వాచ్యార్థం మనకు కానవస్తుంది.

**సదృష్ట్వా రాఘవశ్శ్రీమాన్ - తాపసాశ్రమ మండలమ్**
**అభ్యగచ్ఛ న్మహాతేజా - నిజ్యం కృత్వా మహద్ధమః**
**దివ్యజ్ఞానోప పన్నాస్తే - రామం దృష్ట్వా మహర్షయః**
**అభ్యగచ్ఛం స్తథా ప్రీతా - వైదేహిం చ యశస్వినీమ్**
**తేతం సోమమివాద్యం తం - దృష్ట్వా వై ధర్మచారిణః**
**లక్షణం చైవ దృష్ట్వాతు - వైదేహిం చ యశస్వినీమ్**
**మంగలాని ప్రయుంజానాః - ప్రత్యగృహ్ణాన్ దృఢవ్రతాః**

కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే విశేషార్థం తప్పక స్ఫురిస్తుంది. మహర్షులంతా చక్షుర్యుగళం సఫలమగునట్లు శ్రీరాముని దర్శించుకున్నారు.

**చక్షుభ్యామేవ సాక్షాత్కుర్వంతి**

శ్రీరాముని అంగ ప్రత్యంగ సంఘటనా విశేషం, కళా సమృద్ధి, సౌకుమార్యం, మనోజ్ఞమైన వేషం, ఆహ్లాదప్రదమగు ఆకారాన్ని వనవాసులు గాంచి అద్భుతంతో తలలాడించారు.

**రూప సంవహనం లక్ష్మీం - సౌకుమార్యం సువేషతామ్**
**యదృశు ర్విస్మితాకారం - రామస్య వనవాసినః**

మహర్షులు శ్రీరాముని పరతత్త్వాన్ని శరణు వేడుతారు.

**తే నయం భవతా రక్ష్యాః - భవద్విషయ వాసినః**
**నగరస్థో వనస్థోవా - త్వన్నో రాజా జనేశ్వరః**

''మాకు రాజదండన లేదు. యోగ దండము చేబూనిన మేము జితక్రోధులము, జితేంద్రియులము, తపోధనులము, గర్భస్థ శిశుప్రాయులమగు మేము నిరంతరం నీ చేత రక్షింప తగినవారము'' అంటారు.

**న్యస్తదండా వయం రాజన్ - జితక్రోధా జితేంద్రియాః**
**రక్షతవ్యాస్త్వయా శశ్వత్ - గర్భభూత స్తపోధనాః**

తపోధనులకు 'తపస్సే శరీరం' అని ఆర్ష వచనం.

**"తపో ధనానాం హి తపశ్శరీరమ్"**

తపస్సుకు మూలం భగవద్వాచకమయిన ప్రణవం. కనుకనే ''తస్య వాచకః ప్రణవః'' అని పతంజలి మహర్షి తన యోగదర్శనంలో పేర్కొన్నాడు.

'ఓం'కార స్వరూపమే ప్రణవం. అది ఏకము, అక్షరము – 'ఓమిత్యే కాక్షరం బ్రహ్మ'.

భాషా దృష్టిలో 'అ' కార, 'ఉ' కార, 'మ' కారముల సమన్వయ స్వరూపమే 'ఓం' కారము. అందు 'అ' కారము శ్రీరామునికి, 'ఉ' కారము సీతమ్మకు, 'మ' కారము లక్ష్మణునకు సంకేతాలు. కనుకనే, సీతారామ లక్ష్మణులను దర్శించగనే మహర్షిగణాలకు తాము నిరంతరం ధ్యానించే ప్రణవతత్త్వం ప్రకటితమైనది.

ప్రణవతత్త్వాన్ని 'అ' కార, 'ఉ' కార, 'మ' కార సమన్వయంగా నారాయణోపనిషత్తు ఉద్ఘాటిస్తుంది.

**అకార ఉకార మకార ఇతి**
**తానే కథా సమభరత్ తదేతదో మితి**

ప్రణవంలో 'అ' కారం విష్ణు స్వరూపం, పురుష తత్త్వం, పరమాత్మ వాచకం. శ్రీరాముడు విష్ణు స్వరూపుడు. విష్ణువు కానివాడు ప్రభువు కాలేడు. ''నా విష్ణుః పృథివీపతిః'' అని ఆర్ష వాక్కు. 'ఉ' కారం ప్రకృతి. లక్ష్మికి ప్రతీక. ఆమెయే సీత. 'మ' కారం జీవునికి సంకేతం, అనగా లక్ష్మణుడు. 'స్తోత్రార్ణవములో ఈ విశేషార్థ వివరణ లక్షిస్తుంది.

**అకారార్థో విష్ణుర్జగదుదయ - రక్షా ప్రళయ కృతన్**
**మకారార్థో జీవస్తదు - ప్రకరణం వైష్ణవ మిదమ్**
**ఉకారో నన్యార్థం నియమ - యతి సమ్బన్ధమయోః**
**త్రయీ సారస్యాత్మా ప్రణవ - ఇమమర్థం సమదిశత్**

శ్రీవిష్ణుపురాణం, మహాభారతం ఈ శ్లోకాలకు మూలములని చెప్పవచ్చును. ఇదే విషయాన్ని మహాకవి తులసీదాసు 'రామచరిత మానస్'లో మరికొంత వివరిస్తారు. ''ముందు రాముడు, వెనుక లక్ష్మణుడు మునివేష ధారులై నడుస్తున్నారు. ఆ ఇరువురి మధ్యలో సీతమ్మ, పురుషుడు (బ్రహ్మ), జీవునికి మధ్య, మాయ (ప్రకృతి) లాగా శోభిల్లుతుంది''.

**ఆగే రామ అనుజ పుని చలే - మునివర వేషబనే ఆతి కాఛే**
**ఉభయ బీచ్ శ్రీ సోహయి కైసే - బ్రహ్మ జీవ బిచ్ మాయా జైసే**

పురుషుని వెంట ప్రకృతి, ఆ తర్వాత 'జీవుడు' లేక 'జ్ఞాని' –

'సాధకుడు' – 'ఉపాసకుడు' ఉంటారు. జీవుడు సర్వం త్యజించి పరంబ్రహ్మను శరణాగతి నొందినప్పుడు 'శ్రీమాన్' అవుతాడు. అందుకే వనగమన సమయంలో లక్ష్మణుని 'శ్రీమాన్' అని సంబోధిస్తాడు వాల్మీకి. అలాంటి జీవుడే 'యోగి'. యోగుల మనస్సులను ఆనంద సాగరంలో ముంచెత్తే పరమాత్మ రాముడు.

శ్రీరామ వనగమనం చైత్ర శుక్ల పక్షంలో సంభవిస్తుంది. ఆ రోజులలో రాత్రి సమయం తగ్గి పగటివేళ అధిగమించ మొదలవుతుంది. సీతారామ లక్ష్మణుల వనవాసం గాంచి 'ధర్మరక్షణ'కు నాంది యని ఊహించి సూర్యభగవానుడు తన్మయత్వంతో అలాగే చూస్తుండి పోయాడని ఒక కవి విశేషార్థ సూచనతో చమత్కరిస్తాడు.

**రాముడు ముందు వెన్కను**
**ధరాసుత ఆ వెనువెంట లక్ష్మణ**
**స్వామియుగా ప్రయాణమును**
**సల్పిరి కాల్నడ దుష్టసత్వ నా**
**నా మనుజాశ నావృత**
**వనమ్మున వారల ధర్మదీక్షకున్**
**మైమరచెన్ దినేశుడు మ**
**మత్త్వము తప్పద దెంత వారికిన్**


***

# వాల్మీకి మహర్షి

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

వాల్మీకి మహర్షి జీవితం నేటితరం వారికి ఆదర్శం కావాలి. నేటి యువతరం వాల్మీకి మహర్షిని స్ఫూర్తి దాయకంగా భావించాలి. ఈ వాక్యాలను వాల్మీకి జీవితంతో జోడించి విశ్లేషిస్తే, ఈ వాక్యాలలో యథార్థత మనకు బోధపడుతుంది.

ఆశ్వయుజ పూర్ణిమ వాల్మీకి మహర్షి జయంతి. తెలంగాణ రాష్ట్రంలోని వాల్మీకిపురం వీరి జన్మస్థానమని కొందరు చరిత్రకారుల భావన. ఈ జన్మస్థలం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వాల్మీకి, మహర్షిగా మారకముందు వీరు బోయ రత్నాకరుడు. వేటాడడం వీరి వృత్తి. అలాగే దారి దొంగతనాలు కూడా చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఒకరోజు ఒక మునుల బృందం అడవి గుండా ప్రయాణం చేస్తుంటే వారి వద్దనుండి దోపిడీ చేయాలని బోయ రత్నాకరుడు ప్రయత్నించాడు. అంతట వారు, ''మేము మునులము. మా వద్ద నీకే సంపదలూ ధనమూ లభించదు. ఈ పాపాలు చేస్తూ, అందరి శాపాలు నీవు ప్రతిగా పొందుతున్నావు. నీ పాపఫలంలో భాగం తీసికొంటారేమో నీ భార్యా బిడ్డలను అడిగి వచ్చి మాకు చెప్పు'' అన్నారు. వారి సలహాను పాటించి, ఇంటికి వెళ్ళి మునులు చెప్పినట్లే అడగగా వారు, ''కుటుంబాన్ని పోషించుట నీ బాధ్యత. మేము నీ పాపంలో భాగం తీసుకోమని'' చెప్పారు. తిరిగి వచ్చిన రత్నాకరుడు మునులకు అదే విషయాన్ని చెప్పాడు. అప్పుడు మునులు రత్నాకరునికి ఇలాంటి పాపాలు చేయవద్దని హితవు చెప్పి, రామనామాన్ని జపించుకోమని, రామనామ మంత్రాన్ని ఉపదేశించారు. చిత్తశుద్ధితో, అచంచల విశ్వాసంతో, గాఢమైన భక్తితో రామ నామాన్ని జపించి రత్నాకరుడు వాల్మీకి మహర్షిగా పునర్జన్మ పొందాడు. ఆ తరువాత రామాయణ మహాకావ్యాన్ని రచించి ఆదికవిగా ప్రసిద్ధి పొందాడు. తరువాత కాలంలో ఎన్ని రామాయణ గ్రంథాలను ఎందరు రచించినా, వాల్మీకి రామాయణ గ్రంథం మాత్రమే ప్రమాణ గ్రంథంగా నిలిచింది. ఎవరు చెప్పినా హిత వాక్యాలు నేను వింటాను. చెవులతో కాదు, మనసు కవాటాలు తెరచుకొని విన్న విషయాలను, అందులోని మంచిని, మనస్సు పొరల్లో నిక్షిప్తం చేసుకుంటూ వింటాను. ఎవరు చెప్పినా మంచిని పాటిస్తాను. అనే సానుకూల దృక్పథం. నేను మారను అనే మొండి వైఖరి లేకుండా మార్పును అంగీకరిస్తూ మంచి దారి వైపు అడుగులు వేసిన ఆదర్శం, బోయ రత్నాకరుని జీవితంలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే వేటగానిగా, దారిదొంగగా, మొరటు మనిషిగా జీవనం సాగిస్తున్న రత్నాకరుడు అపరిచితులైన మునుల మాట విని తన జీవనవిధానాన్ని మార్చుకొని వాల్మీకి మహర్షిగా మనందరికీ ఆరాధ్యుడైనాడు. భారతీయ సంస్కృతికీ, సంప్రదాయానికీ, ధర్మబద్ధతకీ మార్గదర్శకమైన రామాయణ గ్రంథాన్ని రచించి మనకు ప్రాతః స్మరణీయునిగా నిలిచాడు. మేము మారం. ఎవరు ఏం చెప్పినా మేము వినం. తప్పయినా, ఒప్పయినా మా భావజాలం మాదే. మార్పుని ఆహ్వానించం అనే మొండి వైఖరితో ప్రవర్తించేవారు వాల్మీకి జీవితం నుంచి నేర్చుకొని పరివర్తన దిశగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.




# సంబరాల కేళి – రంగు రంగుల హోళీ

– చిల్లర సీతారామారావు

ఫాల్గుణ మాసమున వచ్చు పండుగలలో హోళీ పండుగ ఒకటి. హోళీ పండుగ శుద్ధ పూర్ణిమ నాడు వస్తుంది. ఈ పండుగనే కాముని పండుగ, కాముని దహనం, మదన పూర్ణిమ, వసంతోత్సవం మున్నగు పేర్లతో వ్యవహరిస్తుంటారు. ఫాల్గుణ శుద్ధ పూర్ణిమను మహా ఫాల్గుణి అని కూడా అంటారు.

ఫాల్గుణ మాసంలో వసంత ఋతువు సమీపిస్తుంటే చలి తగ్గుతుంది. వాతావరణం వేడి పుంజుకునే సమయంలో పరవశత్వం, ఉత్సాహం, ప్రేమ, స్నేహం ఒలకబోస్తూ చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ నాడు హోళికోత్సవములో పాల్గొంటారు.



**ఫాల్గుణ మాసమున వచ్చు హోళీ పండుగను ఉత్తర భారతదేశంలో ఘనంగా జరుపుకుంటారు. దక్షిణ భారతదేశమున కూడా హోళీ పండుగను విశేషముగా జరుపుకుంటున్నారు. ఈ పండుగను రంగులను ఉపయోగించి జరుపుకోవడం వల్ల ఈ పండుగను రంగు రంగుల పండుగ అని ముద్దుగా పిలుచుకుంటారు. హోళీ పండుగ వెనుక అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.**

శ్రీరాముడు తండ్రి మాట ననుసరించి పదునాలుగు సంవత్సరాలు వనవాసం పూర్తి గావించుకొని, సీతను అపహరించిన లంకాధిపతి రావణాసురుడిని సంహరించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భము ననుసరించి, ఆనాటి నుండి హోళీ పండుగను జరుపుతూ వస్తున్నారని ఒక కథ. శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన నాటినుంచి జరుపుకుంటున్నారని మరొక కథ. శివుడు మన్మథుని భస్మం గావించగా రతీదేవి దుఃఖితురాలైంది. ఆ దుఃఖాన్ని చూడలేక పార్వతీదేవి, శివుడిని కనికరించమని ప్రార్థించింది. పార్వతి ప్రార్థనను మన్నించి శివుడు మన్మథుడు తిరిగి శరీరాన్ని పొందగలడని, ఆ శరీరం కేవలం రతీదేవి మాత్రమే కాంచగలదని రతీదేవికి వరమిచ్చాడు. ఆనాటి నుండి ఈ పండుగ అమలులో ఉన్నదని చెబుతుంటారు. నారదుడి కోరికననుసరించి ధర్మరాజు ప్రజలకు ఫాల్గుణ మాస పూర్ణిమ నాడు అభయప్రదానం గావించాడని, అప్పుడు ప్రజలు ఆనందముతో నృత్యాలు, గానాలు మున్నగు వాటితో ఈ పండుగను జరుపుకొన్నారని భవిష్యోత్తర పురాణము నందున్నది. విస్తృత ప్రచారంలో ఉన్న కథ ఇలా ఉంది.

హిరణ్యకశిపుడు ఒక రాక్షస రాజు. అతడి జీవితములో

భోగమునకే అధిక ప్రాధాన్యత. హిరణ్యకశిపుడు శివుడి గురించి ఘోరమైన తపము నాచరించి, ఎవరి వలన మృత్యువు కలగకుండా వరమును పొందాడు. ఆ వర గర్వముతో విష్ణుద్వేషి అయిన హిరణ్యకశిపుడు తన రాజ్యములో విష్ణ్వారాధన వలదని, తననే భగవంతుడిగా ఆరాధించవలెనని శాసనము చేశాడు. రాజాజ్ఞను మీరలేక ప్రజలు రాజశాసనమును అమలు పరచసాగారు. బురదలో నుండి కమలం ఉద్భవించినట్లు ప్రహ్లాద కుమారుడు ఆ రాక్షస రాజు ఇంట జన్మించాడు. ప్రహ్లాదుడు తల్లి గర్భంలో ఉన్నప్పుడు, అతడి తల్లి నారదమహర్షి ఆశ్రమంలో ఉండటం చేత నారద మహర్షి నిత్య బోధనల వల్ల ప్రహ్లాదుడు విష్ణుభక్తుడయ్యాడు. ఇది రాక్షస రాజుకు సహించరానిదయింది. హిరణ్యకశిపుడు లాలనతో, ప్రేమతో విష్ణుభక్తిని మానుకొనమని, తననే భగవంతునిగా ఆరాధించమని బోధించాడు. కాని ప్రహ్లాదుడు విష్ణుభక్తిని మానలేదు. తండ్రికే విష్ణు మహిమను గురించి తెలియజెప్పసాగాడు. దీనితో హిరణ్యకశిపుడు ఆగ్రహానికి లోనయ్యాడు. తన కొడుకు విష్ణుభక్తిని మానేవరకు కఠినంగా శిక్షించమని భటులకు పురమాయించాడు. భటులు అనేక రకాలుగా హింసించారు. కాని ప్రహ్లాదుడు విష్ణుభక్తిని మానలేదు.

ప్రహ్లాదుని మేనత్త హోళిక. ఆమె ఘోరమైన తపస్సు చేసి 'సజ్జనులను బాధించనంతవరకు అగ్ని వలన ప్రమాదం ఉండదు' అని వరమును పొందింది. విష్ణుభక్తిని మాన్పించడానికి హిరణ్యకశిపుడు పడుతున్న బాధను గమనించిన హోళిక అన్నగారికి సహాయపడదామని, దానికి తనకు లభించిన వరమును ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నది. ఒకనాడు ప్రహ్లాదుడిని తన ఒడిలో కూర్చోబెట్టుకున్నది. భటులను తన చుట్టూ కట్టెలను పేర్చమని ఆదేశించింది. తర్వాత వాటికి మంట పెట్టమని ఆజ్ఞాపించింది. భటులు అలాగే చేశారు. మంటలు పెద్దయెత్తున ఎగిసాయి. అందరూ ప్రహ్లాదుడు మంటలకు ఆహుతుడైనాడని భావించారు. కాని విచిత్రం. అందరూ చూస్తూ ఉండగా చిరునవ్వు నవ్వుతూ విష్ణుదేవుని నామస్మరణతో మంటల నుంచి బయటకు వచ్చాడు ప్రహ్లాదుడు. మంటలు తనను ఏమీ చేయలేవన్న అహంకారంతో ఉన్న హోళిక భస్మమైపోయింది. న్యాయం గెలిచింది. అన్యాయం ఓడింది అని ప్రజలు ఆనాటి నుండి ఆనందోత్సాహాలతో హోళీ పండుగను జరుపుకుంటున్నారు.

ఫాల్గుణ పూర్ణిమ యందు హోళికా ఉత్సవమును జరుపుకోవాలని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

**శ్లో ॥ "ఫాల్గుణ పౌర్ణమాసి హోళికా సా చ సాయాహ్న వ్యాపినీ గ్రాహ్య సాయాహ్నే హోళికాం కుర్యాత్పూర్వాహ్నే క్రీనంగనామ్"**

ఫాల్గుణ పూర్ణిమ యందు హోళికా ఉత్సవమును జరపాలని, సాయంకాల వ్యాపి అయిన పూర్ణిమను గ్రహించాలని భావము.

హోళీ పండుగకు నెలరోజుల ముందు నుండి ఎండు కట్టెలు, పిడకలు, విరిగిన కుర్చీలు, పనికిరాని వస్తువులు మున్నగు వాటిని సేకరించి ఒక కుప్పగా పోస్తారు. పూర్ణిమ నాడు చీకట్లు ముసిరిన తరువాత శ్రద్ధా భక్తులతో ఆ కుప్పను పూజిస్తారు. తరువాత ఈ క్రింది శ్లోకమును చదువుతారు.

**శ్లో ॥ "అస్మాభిర్భయ సంత్రస్త్యేః కృతాత్వం హోళికే యతః అతస్త్వాం పూజ యిస్యామి భూతే భూతి ప్రదాభవ"**

ఓ హోళికా భూతమా! మా భయాలు తొలగిపోవు నిమిత్తము మిమ్ములను పూజిస్తున్నాము. నీవు మా భయములను పోగొట్టి, కనికరించి, సంపదలను ప్రసాదించుము అని శ్లోక భావము. శ్లోకమును చదివిన తరువాత కుప్పకు నిప్పు పెడతారు. కుప్ప చుట్టూ నీళ్ళు చల్లుతూ తిరుగుతారు. చప్పట్లు కొడతారు. నృత్యాలు చేస్తారు. హోళీ సమయంలో వేసే కేకలు, అట్టహాసాలు, కోలాహలం రాక్షసులను నాశనం చేస్తాయని ప్రజల నమ్మకం. హోళీ దహనంతో అనిష్టాలన్నీ దూరమవుతాయని ప్రబల విశ్వాసం. అనంతరం ఒకరికి ఒకరు శుభాభినందనలు చెప్పుకుంటూ మిఠాయిలు తింటారు. మరుసటి రోజు హోళీ పండుగ జరుపుకుంటారు.

హోళీ పండుగను వయసు తారతమ్యం లేకుండా, స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఆ రోజు రంగులను కొని, నీరు నిలవ ఉంచిన డ్రమ్ములలో కలుపుతారు. ఆ రంగు నీళ్ళను ఒకళ్ళ మీద ఒకళ్ళు చల్లుకుంటూ, పిచికారీ మున్నగు సాధనాలతో నీళ్ళు చిమ్ముకుంటూ, నృత్యాలు చేస్తూ, పాటలు పాడుకుంటూ, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకుంటారు. బజార్లలో లభించే రంగులు అధికంగా రసాయనాలు కలిసినవే అయి ఉంటాయి. అందువలన అత్యుత్సాహంతో రంగులు చల్లుకుంటూ ఎక్కువ సమయం రంగులను శరీరంపై ఉండనివ్వడం వలన లభించే ఆనందం కన్నా హాని అధికంగా కలుగుతుంది. కాబట్టి పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి. పిల్లలకు తొందరగా రంగులు వదిలించుకోవాలన్న ఊహ ఉండదు. పెద్దలు పిల్లలను హోళీ పండుగ నాడు అత్యధిక సమయము ఆటలలో గడపనీయకుండా చూచుకోవాలి.

వైదిక కాలంలో ఈ పండుగను 'నవాన్నేష్టి యజ్ఞం' అనేవారు. పొలాలలో సగం పక్వమైన, సగం పచ్చిగా ఉన్న ధాన్యం తెచ్చి హోమం చేసి ప్రసాదంగా స్వీకరించేవారు. ఆ అన్నము హోళీ అని పిలువబడేది. అందువలన ఈ పండుగను హోళికోత్సవం అనేవారు. ప్రతి సంవత్సరం ప్రజలలో ఉత్సాహం, ప్రేమ, కలుపుగోలుతనం, స్నేహభావం పెంచుతూ, శత్రుత్వాలు, మనస్తాపాలు మరచి, అందరితో కలిసి ఆనందించి, ఇతరులకు ఆ సంతోషాన్ని పంచిపెట్టమంటుంది హోళీ పండుగ. భిన్నత్వంలో ఏకత్వం, సద్భావన, ఆనందోత్సాహాల ద్వారా అలసత్వ భావమును పోగొట్టడమే హోళీ పండుగ విశేషత.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.
కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.
ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము.
శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.
శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు కోర్టు సంబంధమైన సమస్యలు రాగలవు. త గాదాలకు దూరంగా ఉండాలి. ఆకస్మిక నిర్ణయములకు, ఆ డంబరాలకు సమయం కాదు. శుభకార్యములలో తెలియకుండా అవరోధములు రాగలవు. నాలికను అదుపులో పెట్టుకొనగలరు. కుటుంబ సభ్యులతో కలిసిపోయి చాలా జాగ్రత్తగా ఉండండి.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆటంకములు ఉన్నను విశ్వాసముతో ముందుకు సాగండి. కార్యసిద్ధి తోడుగా ఉంటుంది. వ్యాపారములో ఒడిదుడుకులు వలన ఆందోళన చెందక కార్యనిర్వహణలో చురుకుగా ఉండండి. కొన్ని విషయములలో అనుకూలించగలవు. శుభపరిణామాలకు, నాగులకు తప్పనిసరిగా పూజలు చేయండి.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు మనసులో నిరాశ ఉంటుంది. కాని మనో నిగ్రహంతో ముందుకు నడవండి. ఎక్కడ ఇబ్బందులు ఎదుర్కొన్నారో అక్కడనే తలెత్తుకొనగలరు. అంతకముందు మిమ్ములను చులకనగా మాట్లాడినవారు మిమ్ములను చూసి తలదించుకొనగలరు. ఇది అంతా గురుబలం.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వ్యాపారంలో అనుకూలత ఉంటుంది. కాని మీరు చాలా తక్కువగా మాట్లాడాలి. డబ్బు చేతికి వచ్చే సమయానికి బ్రేకు పడగలదు. నూతన పరిచయం స్త్రీల వలన నష్టములు, మీ ప్రతిభను గుర్తించాలి అనుకొనిన మీరు చాలా జాగ్రత్తలు పాటించాలి.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు మనోవికారం. దేవాలయ ప్రదక్షిణలు భార్యాభర్తల మాట పట్టింపు అనారోగ్య సమస్యలు అదనపు ఖర్చులు ఏమాత్రం ఆర్భాటంనకు ఇది సమయం కాదు. బంధువులలో లేక మిత్రులలో అప్పులను కోల్పోవుట విచారం ఉంటుంది.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. నిర్లక్ష్యంగా ఉండరాదు. విందులు విలాసములకు తీర్థయాత్రలకు కొంత ధనము ఖర్చు చేయగలరు. ఇతరుల విషయములలో కొన్ని సమస్యలు ఉన్నవి. చాలా మెలకువగా ఉండవలసిన రోజులు. కొన్ని జాగ్రత్తలు పాటించండి. ఓం నమో నారాయణాయ నామ స్మరణ చేయండి.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు సంఘంలో కొన్ని వ్యతిరేక భావనలు కలిగి ఉన్నారు. తక్కువగా మాట్లాడగలరు. అసూయతో కొందరు ఇబ్బంది పెట్టుటకు కంకణం కట్టుకొని ఉన్నారు. మీ మౌనమే మీ విజయం. అందరిలో గౌరవము పెరుగును. ధనము చేతికి వస్తుంది. ఆశ నిరాశ వదలండి నవగ్రహ ఆరాధనలు కలిసి వస్తాయి.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంటుంది. కార్యసాధనకు సరైన సమయం మరల రాదు. ధనలాభం వస్తు వాహన లాభం ప్లాట్స్ కొనుగోలు చేయుటకు ప్రయత్నములు ఫలించగలవు. నవగ్రహ ఆరాధన శాంతి కలిగి ఆనందంగా ఉంటారు.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని విధములుగా జయము, అపజయము ఉన్నది. అది సహజం. కుటుంబంలో తక్కువగా మాట్లాడుకొనుట మంచిది. వృథా ఖర్చులకు బ్రేక్ వేయండి. అవసరానికి సరిపడ డబ్బు వస్తుంది. తొందరపాటు ఆలోచనలు వదలండి. నవగ్రహ ఆరాధన వలన సమస్యలు పరిష్కారము ఉంటుంది.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు అనేక సమస్యలు స్నేహ బాంధవ్యములు పెరుగును. అసలు ఏమి జరుగుతుందో అర్థం కాదు. కుటుంబ కలహములు ఓటమి గురించి చాలా జాగ్రత్తగా ఆలోచన చేయండి. చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. మిమ్ములను అమ్మవారు బయటవేయాలి.

## కుంభరాశి

ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వస్తువాహన ఆభరణములు సమకూర్చుకొనగలరు. తల్లితండ్రి వాత్సల్యంతో ఆస్తులు ఇవ్వగలరు. వారు ఇచ్చేది మనస్ఫూర్తిగా ఉంటుంది. మీరు గొంతెమ్మ కోర్కెలు కోరరాదు. అమావాస్య రోజు పితృదేవతలకు తర్పణలు చేయండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆడంబరములకు ధనము మంచినీరు ప్రాయంగా ఖర్చు చేయగలరు. కుటుంబములో మీరు చేయు ఖర్చులు చూసి చికాకు పడగలరు. పంతాలకు వెళ్ళరాదు. ఏదో విధంగా వారిని కూల్ చేయండి. మీ వద్ద సహాయం పొందిన వారు మిమ్ములను విమర్శించగలరు. దేవతారాధనతో సంతృప్తి ఉంటుంది.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. అభిషేకప్రియుడు ఎవరు?
2. తిరుపతిలో "శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపం" ఎవరి చేత నిర్మించబడింది?
3. ఉత్సవ శబ్దాన్ని నిర్వచించిందెవరు?
4. శ్రీశైలం బ్రహ్మోత్సవాలలో తొమ్మిదో రోజున అమ్మవారికి ఏది అలంకరిస్తారు?
5. అగస్త్యునికి 20 వేల గద్దెల బంగారాన్ని ఇచ్చిందెవరు?
6. తేజస్వి తల్లి ఎవరు?
7. కవేరునికి ఎక్కడినుండి కుమార్తె పుట్టింది?
8. ఆదిత్య హృదయాన్ని ఎవరు ఎవరికి చెప్పారు?
9. వానర సేనాపతి ఎవరు?
10. శ్రీరాముని జన్మరాశి ఏది?
11. త్రిపురాసురుల రాజ్యంలో నాస్తికతను వ్యాప్తి చేసిందెవరు?
12. మాఘమాసంలోని పూర్ణిమ ఏ నక్షత్రంతో కూడి ఉంటుంది?
13. పాదసేవన భక్తికి ప్రతీక ఎవరు?
14. ఫాల్గుణ మాస శుక్ల ఏకాదశిని ఏమంటారు?
15. అశ్వినీ దేవతలు – నిత్యం ఆమలక ఫలం తినమని ఎవరికి చెప్పారు?

1. ..............................
2. ..............................
3. ..............................
4. ..............................
5. ..............................
6. ..............................
7. ..............................
8. ..............................
9. ..............................
10. ..............................
11. ..............................
12. ..............................
13. ..............................
14. ..............................
15. ..............................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. పొష్యలక్ష్మి, 2. 2021 జనవరి నుండి, 3. విదర్భ రాజ్యానికి, 4. వాతాపి, 5. మార్గశి వ్రతం, 6. డా.కె.వి.రమణాచారి గారు, 7. బ్రహ్మాస్త్రం, 8. దూర్వాసుడు, 9. నరస దాసు, 10. దర్బారు సేవ, 11. ఇంద్ర కుమారుడు, 12. విష్వక్సేనుడు, 13. సంపంగి ప్రాకారము, 14. ప్రహ్లాదుడు, 15. శనిదేవునికి

## సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకర శాస్త్రి, 2. చిల్లర సీతారామారావు, 3. జనమంచి జయశ్రీ, 4. వి. యోగానంద్, 5. సి.హెచ్. కృష్ణకిషోర్

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

వి. యోగానంద్



RNI No.: APTEL/2008/23122
Postal Registration No: HSE/879/2025-2027
Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month
Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq